ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

1-2-2026 ఆదివారం సంపుటి: 31 సంచిక: 361 పేజీలు: 10+4 వెల: 8.00



ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య చికిత్స పొందుతూ మృతి 3

ఆర్థికబిల్లు ఆమోదం పొందేవరకూ అత్యధిక సిబ్బందికి జీతంలేని విధులే!

అత్యవసర సర్వీసుల వరకే పరిమితం




## అమెరికాలో మళ్లీ షట్‌డౌన్

**వాషింగ్టన్, జనవరి 31:** అమెరికా ప్రభుత్వం మరోసారి షట్‌డౌన్‌అయింది. 2026 బడ్జెట్ ఆమోదానికి విధించిన గడువు అర్ధరాత్రిలో ముగిసింది. దాంతో ప్రభుత్వ కార్యకలాపాలు పాక్షికంగా నిలిచిపోనున్నాయి. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా శనివారం వెల్లడించింది. మినియాపొలిస్‌లో ఇటీవల ఇద్దరు ఆందోళనకారులు ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసిఇ) అధికారుల కాల్పుల్లో మరణించడంతో సెనెట్ డెమొక్రాట్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'చట్టాన్ని అమలుచేసే అధికారులకు అమెరికా ప్రజలు మద్దతిస్తారు. సరిహద్దు భద్రతా దళాలకు మద్దతుగా నిలుస్తారు. కానీ వీధుల్లో భయభ్రాంతులకు గురిచేసే, అమెరికా పౌరులను చంపే ఐసిఇ అధికారులను ఉపేక్షించబోరు' అని తీవ్రంగా స్పందించారు. దానిని సంస్కరించకపోతే నిధుల విడుదల బిల్లుకు అవసరమైన ఓట్లు వేయబోమంటూ వారు హెచ్చరించారు. దీంతో హోంలాండ్ భద్రత, ఇతర విభాగాలకు నిధులు నిలిచిపోనున్నాయి. అయితే ఇది పాక్షికమేనని వచ్చే వారం ఈ నిధుల బిల్లుపై మరోసారి చర్చలు జరగనున్నాయని చట్టసభ సభ్యులు పేర్కొన్నారు. గతేడాది అక్టోబరు 1న కూడా అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ అయింది. ఆ దేశ చరిత్రలో సుదీర్ఘకాలం (43 రోజులు) పాటు కొనసాగింది. 1981 నుంచి యుఎస్ ప్రభుత్వం 16 సార్లు మూతపడింది. 2018-19 మధ్య దాదాపు 35 రోజుల పాటు మూతపడగా.. నాడు ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నారు. ప్రస్తుతంకొనసాగుతున్న పాక్షిక షట్‌డౌన్ అంటే అన్ని బిల్లులు పాస్‌కావు.

# కేంద్ర బడ్జెట్‌లో పన్నీటి జల్లు!



నేడు పార్లమెంటుకు సమర్పించనున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

అటు వేతన జీవులు, ఇటు మధ్యతరగతికి పన్ను ఊరట!

కార్పొరేట్, పారిశ్రామిక రంగాలకు మరిన్ని రాయితీలు

పన్ను శ్లాబుల హేతు బద్దీకరణపై ఆశలు

**న్యూఢిల్లీ, జనవరి 31:** కేంద్రఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంటులో 2026-27 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈసారి బడ్జెట్‌లో వృద్ధి వేగాన్ని కొనసాగిస్తూనే, సంక్షేమ పథకాలకు, ఆర్థిక క్రమశిక్షణకు మధ్య ప్రభుత్వం సమతుల్యత పాటించనుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా రక్షణ, మౌలిక సదుపాయాలు, మూలధన వ్యయం, విద్యుత్, అందుబాటు ధరల్లో గృహ నిర్మాణం వంటి రంగాలకు ప్రాధాన్యత ఇవ్వవచ్చని భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో దేశీయ వృద్ధి లక్ష్యాలకు, ద్రవ్యలోటు నియంత్రణకు మధ్య బడ్జెట్ ఒక చక్కటి సమన్వయాన్ని సాధించాల్సి ఉంది. ప్రభుత్వం ఇప్పటికే ఆర్థిక క్రమశిక్షణ మార్గంలో స్థిరంగా పయనిస్తోంది. కోవిడ్ సమయంలో 9.2 శాతంగా ఉన్న ద్రవ్యలోటును 2026 ఆర్థిక సంవత్సరానికి 4.4 శాతానికి తగ్గించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ మార్గం నుంచి ప్రభుత్వం పెద్దగా పక్కకు వెళ్లకపోవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఇది 15వ బడ్జెట్ కాగా, నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి రికార్డు సృష్టించనున్నారు. గతబడ్జెట్‌లో మధ్యతరగతి వినియోగాన్ని పెంచేందుకు పన్ను రాయితీలపై దృష్టి సారించగా, ఈసారి వినియోగాన్ని ప్రోత్సహించే విధానం పరిమితంగానే ఉంటుందని తెలుస్తోంది. వ్యూహాత్మకంగా ముఖ్యమైన రంగాల్లో మూలధన వ్యయాన్ని పెంచడంపైనే ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించవచ్చని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. పెట్టుబడిదారులు ప్రభుత్వ రుణాల వివరాలు, ద్రవ్యలోటు లక్ష్యాలు, కొత్త అప్పుల ప్రణాళికలపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 2025-26, వచ్చే ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 6.8 నుంచి 7.2 మధ్య ఉండవచ్చని అంచనా వేసింది. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 7.4 కంటే కొంచెం తక్కువ. బడ్జెట్ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, ఫిబ్రవరి 1 ఆదివారం అయినప్పటికీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో పూర్తిస్థాయి ట్రేడింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. ఆదాయపు పన్ను మినహాయింపులు, పీఎం కిసాన్ సాయం పెంపు సహా కీలకమైన అంశాలు ఈ >>2

విచారణకు

# నేనొస్తా..



నేటి మధ్యాహ్నం 3 గం.లకు నందినగర్‌లో అందుబాటులో ఉంటా..

గోడలకు నోటీసులు అంటించడం సబబు కాదు..

పోలీసుల తీరు నా వ్యక్తి గౌరవానికి భంగమే

జూబ్లీహిల్స్ ఏసిపికి మాజీ సిఎం కెసిఆర్ 6 పేజీల లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి31:** సిట్ అధికారులు నందినగర్‌లోని తన ఇంటి గోడలకు నోటీసులు అంటించడంపై బీఆర్ఎస్ అధినేత,మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ మేరకు శనివారం సాయంత్రం జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరికి ఆయన 6 పేజీల లేఖ రాశారు. చట్టపరమైన అభ్యంతరాలున్నా తాను విచారణలో సిట్‌కు సహకరిస్తానని చెప్పారు. ఫిబ్రవరి 1న మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు సిద్ధంగా ఉంటానని తెలిపారు. గోడలకు నోటీసులు అంటించడం సరైన పద్ధతి కాదని కేసీఆర్ పేర్కొన్నారు. సిట్ పోలీసుల వైఖరి కోర్టు ధిక్కారం కిందకే వస్తుందని తెలిపారు. పోలీసుల తీరు నా వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించే విధంగా ఉందని వెల్లడించారు. ఏసీపీ వెంకటగిరికి తనను విచారించే అధికార పరిధి లేదని పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన పౌరుడిగా, ప్రతిపక్ష నేతగా విచారణకు సహకరిస్తానని తెలిపారు కేసీఆర్ లేఖలో ఏం రాశారంటే.. 'సిట్ అధికారులు వ్యవహరించిన తీరు చట్టాలకి వ్యతిరేకం. సుప్రీంకోర్టు తీర్పులను తుంగలో తొక్కిన సిట్ అధికారుల తీరు. సిట్ అధికారులకి నోటీసు ఇచ్చే అధికారమే లేదు. ఇది నా రాజ్యాంగ హక్కులను కాలరాయడమే. మొన్న రెండుసార్లు సిట్ అధికారులు ఇచ్చిన నోటీసులు చట్టవిరుద్ధం, చట్టాలను అతిక్రమించి ఇచ్చారు. మీరు ఇచ్చిన మొదటి నోటీసుకు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బిజీగా ఉండటంవల్ల వేరే రోజు విచారణకు తేదీ ఇవ్వాలని చెప్పాను. దాంతోపాటు 65 ఏళ్ల పైబడిన వ్యక్తులను వారు నివసించే చోటనే విచారించాలని చెప్పే సెక్షన్ 160 సిఆర్‌పిసి నిబంధనలను మీ దృష్టికి తెచ్చాను' అని పేర్కొన్నారు.'తదుపరి నోటీసులన్నీ కూడా ఎర్రవల్లిలోని నా నివాసానికే పంపాలని చెప్పాను. కానీ, ఇది చెప్పిన తర్వాత కూడా గుర్తుతెలియని వ్యక్తులు మీ సంతకంతో ఉన్న లేఖను రాత్రి 9 గంటలకు నందినగర్ నివాసంలోని మా ఇంటి గోడకు అతికించినట్లు తెలుస్తోంది. ఆ లేఖ మీరే పంపినట్లయితే, మీ సూచనల మేరకే అతికించినట్లయితే, ఆ లేఖను తీవ్రంగా ఆక్షేపిస్తున్నాను. ఇది భారత రాజ్యాంగం, చట్టం, గౌరవ సుప్రీంకోర్టుల >>2



హార్వర్డ్ వర్సిటీలో విద్యార్థులతో సిఎం రేవంత్ రెడ్డి

హార్వర్డ్‌లో చివరి రోజు..

# విద్యార్థుల బృందంతో సిఎం రేవంత్ భేటీ

తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌పై సంభాషణ

రేపు హైదరాబాద్‌కు రానున్న ముఖ్యమంత్రి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి31:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హార్వర్డ్ విశ్వవిద్యాలయ పర్యటన ఒక చారిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ఉండి కూడా.. ఒక విద్యార్థిలా మారి ఆయన నేర్చుకున్న తీరు, అక్కడి విద్యార్థులతో ఆయన జరిపిన సంభాషణలు ఆసక్తికరంగా మారాయి. అమెరికాలోని ప్రతిష్టాత్మక హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన దిగ్విజయంగా ముగిసింది. హార్వర్డ్ యూనివర్సిటీలో ఈనెల 25 నుంచి 30 వరకు నిర్వహించిన లీడర్‌షిప్ ఫర్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ అనే ఎగ్జిక్యూటివ్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్‌ను పూర్తి చేసిన సీఎం, చివరి రోజున హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన వివిధ ప్రతినిధి బృందాలతో భేటీ అయ్యారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు.పూర్వ విద్యార్థులతో పాటు మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటి), కొలంబియా యూనివర్సిటీల వంటి ప్రముఖ విద్యాసంస్థల >>2

# జనం నుండి వనంలోకి..

ముగిసిన వనదేవతల మహాజాతర

1.5 కోట్ల మంది దర్శించినట్లు అంచనా

వివిఐపిలతో సాధారణ ప్రజల పాట్లు

సామాన్యులకు అందని తల్లుల దర్శనం



గద్దెల వద్ద భక్తజన సందోహం



సమ్మక్క, సారలమ్మలను వనంలోకి తరలిస్తున్న దృశ్యం



**ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో ప్రభాతవార్త:** వనదేవతల వనప్రవేశంతో మేడారం సమ్మక్క- సారలమ్మ మహాజాతర ముగిసినా.. ఈ జాతర నిర్వహణపై మాత్రం తీవ్ర అసంతృప్తి వెల్లువెత్తుతోంది. కోటి యాభై లక్షల మందికి పైగా భక్తులు వనదేవతలను దర్శించుకున్నారని అధికార అంచనాలు చెబుతున్నాయి. కానీ ఆ మహాజాతరలో భక్తికన్నా ఎక్కువగా కనిపించింది. "వీవీఐపీ" 'వీఐపీ దర్పం' 'పరిపాలనా వైఫల్యమనే విమర్శలు భక్తుల నుండి వినిపిస్తున్నాయి. ఆసియాలోనే అతిపెద్ద ఆదివాసి జాతర శనివారం రాత్రి ముగిసింది. జనవరి 28 నుంచి నాలుగు రోజులపాటు అట్టహాసంగా సాగిన మేడారం మహాజాతర (జనవరి 31) ముగిసింది. సమ్మక్కసారలమ్మ జనం వీడి >>2

హైదరాబాద్‌లో రైలు కిందపడి ముగ్గురు బలవన్మరణం

మృతులు ఒకే కుటుంబీకులు

3

ప్రియుడి భార్యపై పెట్రోలు పోసి నిప్పంటించిన యువతి

నల్లగొండ జిల్లాలో దారుణం

3



మహారాష్ట్ర డి.సిఎంగా సునేత్రపవార్

తనకు తెలియదన్న శరద్‌పవార్

5

## 4 నుంచి సిఎం మున్సిపల్ ప్రచారం

రెండు రోజుల్లో బిజెపి, బిఆర్ఎస్ రంగంలోకి

20,313 అభ్యర్థులు, 29,694 నామినేషన్లు

రెబల్స్ ఉపసంహారణకు పార్టీల బుజ్జగింపులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి31:** మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ల పర్వం పూర్తయింది. 7 కార్పొరేషన్లు,116 మున్సిపాలిటీలకు కలిపి మొత్తం >>2



శనివారం కోఠిలోని ఘటనాస్థలంలో విచారణ చేస్తున్న పోలీసులు

# హైదరాబాద్‌లో కాల్పుల కలకలం

కోఠిలోని బ్యాంక్ స్ట్రీట్‌లో దుండగులు కాల్పులు

రూ. 6 లక్షలు లూటీ.. బాధితుడి స్కూటీపై దుండగుడి పరార్

ఐదు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్న పోలీసులు

బాధితుడు ఉస్మానియా ఆస్పత్రికి తరలింపు




ఘటనాస్థలిలో తూటా

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో మరోసారి కాల్పుల కలకం రేగింది. శనివారం ఉదయం ఏడు గంటల సమయంలో కోఠిలోని బ్యాంక్ స్ట్రీట్ వద్ద గల ఎస్‌బిఐ ఎటిఎంలో ఆరు లక్షల రూపాయలను డిపాజిట్ చేసేందుకు వచ్చిన కేరళకు చెందిన వస్త్ర వ్యాపారిపై ఎటిఎం వద్దే కాల్పులు జరిపిన ఇద్దరు దుండగులు అతని వద్ద వున్న మొత్తం డబ్బుతో రెప్పపాటులో అక్కడి నుంచి పారిపోయారు. కాల్పుల శబ్దంతో సమీపంలోని ప్రజలుగమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని కాల్పుల్లో >>2



శనివారంరాత్రి గుంటూరులో అంబటిని తరలిస్తున్న పోలీసులు

# అంబటి అరెస్టు

గుంటూరులో హైటెన్షన్

సిఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసు

**విజయవాడ.జనవరి 31,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ మంత్రి, వైకాంగ్రెస్ పార్టీనేత అంబటి రాంబాబును పోలీసులు శనివారం రాత్రి అరెస్ట్ చేసారు. సీఎం చంద్రబాబుపై అసభ్యకర వ్యాఖ్యలు చేసారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బాజీ చౌదరి ఇచ్చిన ఫిర్యాదుపై గుంటూరు పరిధిలోని నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసారు.ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ తాను అరెస్ట్‌కు భయపడేది లేదని,సీఎంను తాను అనుచితంగా మాట్లాడలేదని స్పష్టం చేసారు.టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారి తీసాయి.సీఎంపై అంబటి చేసిన వ్యాఖలకు క్షమాపణ చెప్పాలని టీడీపీ కార్యకర్తలు డిమాండ్ చేస్తూ ఆయన ఇంటి మీదకు దూసుకుని వెళ్ళడంతో తీవ్ర ఉద్రిక్తతకు >>2



ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో శనివారం మంచుతో కప్పబడిన బద్రీనాథ్ ఆలయం

# కాల్పుల కలకలం

>> గాయపడ్డ వస్త్ర వ్యాపారిని వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. దుండగుల కాల్పుల్లో ఒక బుల్లెట్ వస్త్ర వ్యాపారి కాలికి తగలడంతో వైద్యులు ఆపరేషన్ చేశారు. అత ని ఆరోగ్యం నిలకడగా వుందని వారు తెలిపారు. మరోవైపు వస్త్ర వ్యాపారిపై కాల్పులు జరిపిన దుండగుల కోసం ఐదు ప్రత్యేక బృందాలను రంగం లో దించారు. వివరాలు ఇలావున్నాయి. కేరళలోని కోజీకోడ్‌కు చెందిన వస్త్ర వ్యాపారి రిన్షద్ (26) ఈ నెల ఏడవ తేదీన హైదరాబాద్‌కు వచ్చాడు. నాంపల్లిలోని తనకు తెలిసిన మిత్రుడి ఇంట్లో వున్నాడు. ఇంతకు ముందు పలుమార్లు హైదరాబాద్‌లో హోల్‌సేల్‌లో బట్టలుకొని దానిని కేరళలో అ మ్ముతున్న రిన్షద్ ఇదే క్రమంలో మరోదఫా నగరానికి వచ్చాడు. దుస్తులు కొనేందుకు పలుచోట్ల తిరిగినా అతనికి ఎక్కడా బేరం కుదరలేదు. దీంతో తన వద్ద వున్న ఆరు లక్షల రూపాయలను శనివారం ఉదయం ఏడు గంటల సమయంలో బ్యాంక్ స్ట్రీట్‌లోని ఎస్‌బిఐ ఎటిఎంలో డిపాజిట్ చేసేం దుకు తన మిత్రుడి స్కూటీ (నంబర్ టిఎస్ 08 హెచ్ ఎన్ 8582)పై వెళ్లాడు. అయితే రిన్షద్ కదలికలను ముందుగానే తెలుసుకున్న ఇద్దరు దుం డగులు అతన్ని దగ్గర నుంచి గమనిస్తూ వెంటనే వచ్చారు. రిన్షద్ ఎటిఎంలో వెళ్లగానే ఒక్కసారిగా ఇద్దరు దుండగులు లోపలికి వెళ్లి అతని వద్దు న్న ఆరు లక్షల రూపాయలను లాక్కునేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా పెనుగులాట జరిగింది. అనంతరం దుండగుల్లో ఒకడు రిన్షద్‌పై కాలు ్పలు జరిపాడు. ఈ కాల్పుల్లో రిన్షద్ కాలికి మొకాలి కింది భాగంలో బుల్లెట్ గాయమయ్యింది. దీని తరువాత దుండగులు వెంటనే ఎటిఎం బయ ట వున్న బాధితుడి స్కూటీపై పారిపోయారు. మరోవైపు ఎటిఎంలో బుల్లెట్ గాయంతో కిందప డిపోయిన రిన్షద్ సహాయం కోసం కేకలు వేశాడు. రిన్షద్ కేకలు విన్న సమీప ప్రజలు వెంటనే అక్కడికి చేరుకుని అతనికి సపర్యలు చేసి దీనిపై పోలీసులకు సమాచారం అందించారు. ఈ సమాచార ం అందిన వెంటనే పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని బాధితుడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో రిన్షద్‌కు వై ద్యులు అత్యవసర ఆపరేషన్ చేశారు. రిన్షద్ ఆరోగ్యం ప్రస్తుతం బాగానే వుందని, ఎలాంటి ప్ర మాదం లేదని పోలీసులు తెలిపారు. కాగా రిన్షద్‌పై కాల్పులకు దిగిన ఇద్దరు దుండగులు బాధితుడి స్కూటీ నింబోలిఅడ్డా వద్ద స్కూటీని వదిలి, తమ దుస్తులు మార్చుకుని కాచిగూడ చౌరస్తా వైపు కాలి నడకన పారిపోయారు. అక్కడి నుంచి దుండగులు ఆటోలో సికింద్రాబాద్ వైపు వెళ్లినట్లు తేలింది. దీనిపై సిసి కెమెరాల ఆధారంగా దుండగుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు. దుండగులను పట్టుకునేందుకు ఐదు ప్రత్యేక బృందాలను రంగంలో దింపారు. ఘటనా స్థలికి నగర అదనపు పోలీసు కమిషనర్ (సిట్ అండ్ క్రైం) శ్రీనివాస్‌తో పాటు ఖైరతాబాద్ జోన్ డిసిపి శిల్పవల్లి సహా సుల్తాన్ బజార్ ఎసిపి మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇదిలావుండగా కోఠిలోని బ్యాంక్ స్ట్రీట్ వద్ద ఉదయం ఏడు గంటల సమయంలో జరిగిన కాల్పుల ఘటనపై పోలీసు శాఖ తీవ్రంగా పరిగణించిం ది. ఈ కాల్పుల్లో కేరళకు చెందిన వస్త్ర వ్యాపారి రిన్షద్ గాయపడి ఉస్మానియా ఆసుపత్రిలో కోలుకుంటున్నాడు. రిన్షద్‌తో బాగా పరిచయం వున్న వారు లేదా లేదా బాగా సన్నిహితంగా వున్న వారే ఈ కాల్పుకు కారణమై వుండవ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఉదయం ఏడు గంటల సమ యంలో రిన్షద్ ఆరు లక్షల రూపాయలు ఎటిఎంలో డిపాజిట్ చేస్తున్న విషయం అతని మిత్రులు లేదా సన్నిహితులకు మాత్రమే తెలిసి వుంటుంద ని పోలీసులు భావిస్తున్నారు. డబ్బుల గురించి రిన్షద్ ఎవరెవరితో చర్చలు జరిపాడనే విషయమై ఆరా తీస్తున్నారు. అతని సన్నిహితులడి భావిస్తు న్న హైదరాబాద్‌కు చెందిన పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ కేసులో రెండు మూడు రోజుల్లో మిస్టరీ వీడే వీలుం దపి తెలుస్తోంది.

# సిఎం మున్సిపల్ ప్రచారం

>> 29,694 నామినేషన్లు దాఖలయ్యాయి. 2,996 వార్డులకు గానూ 20,313 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాంగ్రెస్ 10,024 నామినేషన్లు దాఖలు చేయగా, బిఆర్‌ఎస్ 7,556, బిజెపి 5,457 నామినేషన్లు దాఖలు చేసింది. ఈ మూడు పార్టీల్లోనూ రెబల్స్ అత్యధికంగా నామినేషన్లు దాఖలు చేశారు. శనివారం నామినేషన్ల స్క్రూట్నీ ముగిసింది. ఫిబ్రవరి 3 వరకు నామినేషన్ల ఉపసంహారణకు గడువు ఉంది. రెబల్స్ నామినేషన్లను ఉపసంహారించుకునేందుకు ఆయా ప్రధాన పార్టీలు బుజ్జగింపులు చేస్తున్నాయి. కాగా, నామినేషన్ల పర్వం ముగియడంతో అన్ని పార్టీలు ప్రచారంపై దృష్టి పెట్టాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మున్సిపల్ ఎన్నికల ప్రచారం షెడ్యూల్ స్వల్ప మార్పులతో ఖరారు అయింది. 6 ఉమ్మడి జిల్లాల్లో ఆయన ప్రచారం చేయనున్నారు. ఫిబ్రవరి 4న ఉమ్మడి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ, 5న కరీంనగర్ జిల్లా చొప్పదండి, 6న నిజామాబాద్ రూరల్, 7న రంగారెడ్డి జిల్లా పరిగి, 8న ఉమ్మడి వరంగల్ జిల్లా భూపాలపల్లి, 9న మెదక్‌లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరనున్నారు. బిఆర్‌ఎస్ బిజెపి కూడా వ్యూహ రచనలో మునిగిపోయాయి. బిఆర్‌ఆస్ అధినేత, మాజి సిఎం కెసిఆర్‌ను సిట్ విచారణకు పిలవడంపై బిఆర్‌ఎస్ ఆదివారంనాడు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపట్టింది.

# అంబటి అరెస్టు

>> దారి తీసింది, ఈ పరిస్థితుల నడుమ అంబటి వ్యాఖ్యలపై టీడీపీ కార్యకర్తలకు పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఇక పరిస్థితుల నేపథ్యం గమనిస్తే తిరుమల నెయ్యి కల్తీపై గుంటూరులో టీడీపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ కాసేపు ఉద్రిక్తతకు కారణమైంది. గోరంట్లలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద "మహాపాపం "పేరుతో టీడీపీ నేతలు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీని తొలగించాలని లేకుంటే తామే తొలగిస్తామని వైఎస్సార్సీపీ నేత అంబటి రాంబాబు నిన్న ప్రకటించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం గోరంట్ల వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన అంబటి ఫ్లెక్సీ వద్దకు వస్తామని ప్రకటించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఫ్లెక్సీ వద్దకు భారీగా చేరుకున్నారు. గొడవ జరిగే అవకాశం ఉందని భావించిన పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అంబటి రాంబాబును ఫ్లెక్సీ వద్దకు రావొద్దని కోరారు. అయితే ఆలయంలో పూజల తర్వాత రాంబాబు ఆ మార్గంలో వెళ్తుండగా టీడీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. రాంబాబు వాహనం దిగేందుకు ప్రయత్నించగా పోలీసులు వారించారు. ఆగ్రహంతో ఊగిపోయిన అంబటి రాంబాబు ముఖ్యమంత్రి చంద్రబాబును తీవ్ర అసభ్య పదజాలంతో దూషించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అంబటి రాంబాబును పోలీసులు అక్కడి నుంచి పంపించి వేశారు. చంద్రబాబుపై అంబటి రాంబాబు వ్యాఖ్యలను రాష్ట్రవ్యాప్తంగా కూటమి నేతలు ఖండించారు.

# నేనొస్తా..

>> పట్ల మీకు ఏమాత్రం గౌరవం లేదు అనే విషయాన్ని సూచిస్తుంది. గతంలో సుప్రీంకోర్టు సతేంద్ర కుమార్ యాంటిల్ వర్సెస్ సీబీఐ అనే కేసులో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వాట్సాప్ లేదా ఇతర ఎలక్ట్రానిక్ మార్గాల ద్వారా నోటీసులు పంపడం చట్టబద్ధమైన పద్ధతి కాదని, చట్టం నిర్దేశించిన రీతిలోనే నోటీసులు ఇవ్వాలని పేర్కొంది. సిఆర్‌పిసి 160 నోటీసులను వ్యక్తిగతంగా అందజేయాలి. కానీ మీరు కావాలనే చట్టాన్ని, సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించారు. ఇది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది అని కేసీఆర్ తన లేఖలో సూచించారు. 'భవిష్యత్తు నోటీసులన్నీ ఎర్రవల్లికే పంపాలని చెప్పినప్పటికీ మీరు దాన్ని విస్మరించారు. కాబట్టి మీరు ఇచ్చిన రెండో నోటీసు చట్టబద్ధంగా అందలేదు, అది చెల్లదు. మీరు ఇచ్చిన నోటీసు నా రాజ్యాంగ బద్ధ హక్కులను ఉల్లంఘించడమే. నేను మీ పోలీస్ స్టేషన్ పరిధిలోగానీ, పొరుగు పోలీస్ స్టేషన్ పరిధిలోగానీ నివసించడం లేదు. కాబట్టి మీకు నోటీసు ఇచ్చే అధికార పరిధి లేదు. ఈ నోటీసుతో నన్ను కట్టడి చేసే అధికారం లేదు. ఎలక్షన్ అఫిడవిట్‌లో, అసెంబ్లీ రికార్డులో ఉన్న అడ్రస్ ఆధారంగా ఎర్రవల్లిలో విచారించలేమని మీరు చెప్పడం సరికాదు. నోటీసు ఇచ్చే సమయానికి వ్యక్తి ఎక్కడ నివసిస్తున్నారు అన్నదే ముఖ్యం. నేను కొన్ని సంవత్సరాలుగా ఎర్రవల్లిలో నివసిస్తున్నాను అన్నది నిర్వివాద అంశం. అక్కడే నా స్టేట్‌మెంట్ రికార్డ్ చేయవలసిన బాధ్యత మీపై ఉన్నది' అని పేర్కొన్నారు. 'హరీష్‌రావు అఫిడవిట్‌లో సిద్దిపేట అని చిరునామా ఉన్నప్పటికీ హైదరాబాద్‌లో నోటీసు ఇచ్చారు. ఇది మీ ద్వంద్వ ప్రమాణాలను సూచిస్తున్నది. మీరు గోడకు నోటీసు అతికించడం చట్టవిరుద్ధం. మీరు నాకు నోటీసు ఇచ్చే అధికార పరిధి లేదు. చట్టం ప్రకారం నా స్టేట్‌మెంట్‌ను ఎర్రవల్లిలోనే రికార్డ్ చేయాలి. అయితే చట్టపరమైన అంశాలు ఎలా ఉన్నప్పటికీ, మాజీ ముఖ్యమంత్రిగా, ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడిగా, బాధ్యతాయుతమైన భారత పౌరుడిగా దర్యాప్తునకు సహకరించాలని నిర్ణయించుకున్నాను. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు నందినగర్‌లో అందుబాటులో ఉంటా. మీరు నందినగర్ నివాసంలోనే స్టేట్‌మెంట్ రికార్డ్ చేయాలని పట్టుబట్టినందున అక్కడే అందుబాటులో ఉంటా' అని కేసీఆర్ లేఖ ద్వారా తెలియజేశారు. అక్రమ పద్ధతిలో జారీ చేసిన నోటీసులను విస్మరించే హక్కు తనకు ఉందని కేసీఆర్ వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో తనకు సంబంధించిన నోటీసులన్నీ ఎర్రవల్లి చిరునామాకే పంపాలని పోలీసులకు సూచించారు. అలాగే ఏపీ హైకోర్టులోని వీడీ మూర్తి కేసు తీర్పును కూడా లేఖలో ప్రస్తావించారు.

## వారం - వర్జ్యం

01-02-2026, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శ్రవణ కార్తె
○పౌర్ణమి రా.3.40
పుష్యమి రా.12.00
వర్జ్యం : మ.12.11-1.43
దు.సా.4.29-5.15
శుభసమయం : సా.6.00-7.00,సా.6.15-7.00
రాహుకాలం - సా.4.30-6.00

## వారఫలం

**మేషం :** ఉమ్మడిగా తీసుకునే నిర్ణయాలకు మీరు బాధ్యత వహించవలసి వస్తుంది. ప్రచారంలో ఉన్న నిందలను పట్టించుకోరు.

**వృషభం:** అద్భుతాలు జరిగి సమస్యల నుండి బయట పడగలిగితే బావుండని భావిస్తారు. పోటీ పరీక్షలలో విజయం.

**మిథునం:** కుటుంబ పురోభివృద్ధిపైన దృష్టిని కేంద్రీకరిస్తారు. బంధువులతో అభిప్రాయ భేదాలు చోటు చేసుకుంటాయి.

**కర్కాటకం:** సన్నిహితాలతో కలిసి ఉల్లాసంగా గడుపుతారు. స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. వస్త్ర లాభం.

**సింహం:** కుటుంబంలో శుభకార్యాలు జరుగుతాయి. దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కార మార్గాలు లభిస్తాయి.

**కన్య :** ముఖ్యవ్యవహారాలలో ఆచితూచి అడుగు వేయండి. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా వుంటుంది. వాహన సౌలభ్యం.

**తుల :** ఉపకరించే ఒక వర్గం అందుబాటులో లేని కారణం చేత ఈ రోజు ఇబ్బంది పడతారు. సోదరుల కలయిక.

**వృశ్చికం:** కీలక నిర్ణలలో స్వంత ఆలోచనలు శ్రేయస్కరం. సాహసకార్యాలు చేస్తారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ధిని పొందుతారు.

**ధనుస్సు:** ఋణాలు ఇవ్వడం, ఋణాలు తీసుకోవడం చెప్పదగినది. ఆరోగ్య సమస్యల నుండి బయట పడతారు.

**మకరం:** ప్రయాణాలు, రహస్య చర్చలు చోటు చేసుకుంటాయి. వృద్ధుల బరువు బాధ్యతల పట్ల అప్రమత్తత. ధనలాభం.

**కుంభం:** సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. సంగీత, సాహిత్యాలపై దృష్టి సారిస్తారు. సన్నిహితులు కలయిక.

**మీనం :** బంధువుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. మీ పరిధులకు మించి శ్రమిస్తారు. వాహన సౌలభ్యం కలదు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కేంద్ర బడ్జెట్‌లో పన్నీటి జల్లు!

>> బడ్జెట్‌లో ఉంటాయన్న అంచనాలున్నాయి. ఆదాయపు పన్ను వ్యక్తిగత ఆదాయపు పన్ను పరిమితిని రూ. 13 లక్షలకు పెంచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కొత్త పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ రూ. 75,000గా ఉంది. దీనిని మరో రూ.25000 పెంచి రూ. 1 లక్షకు చేస్తారనే వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో జీతం తీసుకునే ఉద్యోగులకు రూ. 13 లక్షల వరకు ఎలాంటి ట్యాక్స్ ఉండదు. ప్రస్తుతం టాక్స్ రిబేట్తో కలిపి రూ. 12.75 లక్షల వరకు పన్ను లేదు. రైతులకు పీఎం కిసాన్ పథకం ద్వారా ఏడాదికి రూ. 6,000 పెట్టుబడి సాయం అందిస్తోంది కేంద్రం. దీన్ని 50శాతం పెంపుతో రూ. 9,000 వరకు చేయవచ్చని అంచనా. 2019లో ప్రారంభమైన ఈ స్కీమ్ ద్వారా మూడు విడతల్లో రూ. 2,000 చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఇప్పుడు రూ.9 వేలకు చేస్తే ప్రతి విడతలో రైతులకు రూ.3 వేల చొప్పున సాయం అందనుంది. 300కి పైగా కొత్త అమృత్ భారత్, వందే భారత్ రైళ్ల రిజర్వేషన్‌లో వెయిటింగ్ లిస్ట్ తగ్గించడం, రైల్వే ట్రాక్‌లు మెరుగుప రచడం, కొత్త రైళ్లు పెంచడం వంటి నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. 300కి పైగా కొత్త అమృత్ భారత్, వందే భారత్ రైళ్లు ప్రకటిస్తారని విశ్లేషకులు అంచనా వేస్తు న్నారు. గత బడ్జెట్‌లో రైల్వేకు రూ. 2.65 లక్షల కోట్లు కేటాయించారు. ఈసారి బడ్జెట్ మరింత పెంచవచ్చని సమాచారం. 2030 నాటికి వెయిటింగ్ లిస్ట్ లేకుండా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. పీఎం సూర్యా ఘర్ యోజన ద్వారా ప్రస్తుతం 2 కిలోవాట్ వరకు రూ. 30,000 చొప్పున రూ. 60,000 సబ్సిడీ ఇస్తున్నారు. దీన్ని కిలో వాట్ కు రూ. 40,000కు పెంచాలని డిమాండ్ ఉంది. అంటే కుటుంబానికి అదనంగా మరో రూ. 20,000 వరకు సబ్సిడీ లభిస్తుంది. 2026 మార్చి నాటికి 40 లక్షల ఇళ్లు, 2027 నాటికి 1 కోటి ఇళ్లకు సౌర విద్యుత్తు పలకను అమర్చాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే 19.45 లక్షల సోలార్ ప్యానెల్స్ ఇన్‌స్టాల్ చేశారు. 7.7 లక్షల ఇళ్లకు విద్యుత్ బిల్లు జీరో అయింది. ప్రస్తుతం 70 ఏళ్ల వయసు దాటిన వారికి మాత్రమే అదనంగా రూ.5 లక్షల వరకు ఉచిత చికిత్స ఉంది. దీన్ని 60 ఏళ్లకు తగ్గించవచ్చని సమాచారం. సంవత్సరానికి రూ. 5 లక్షల ఉచిత చికిత్స పరిమితిని పెంచడం సహా క్యాన్సర్, హార్ట్ సర్జరీల వంటి పెద్ద పెద్ద శస్త్ర చికిత్సలను సైతం కవర్ చేసేలా రూల్స్ మార్చవచ్చని సమాచారం. ప్రస్తుతం దేశంలో 60 ఏళ్లు దాటిన వారిలో 82 శాతం మందికి ఎలాంటి ఆరోగ్య బీమా లేదని గణాంకాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ఆయుష్మాన్ భారత్ వయసును 60కితగ్గించే అవకాశం ఉంది. అలాగే బంగారం, వెండి ధరల పెరుగుదలపైనా ఆర్థికమంత్రి తన బడ్జెట్‌ప్రసంగంలో కీలకప్రకటనచేస్తారన్న అంచనా ఉంది. పెట్రోలు, డీజిల్‌పై సంఉకాలురూ.3 ఉంచి రూ.4వరకూ పెరుగుతాయన్న ఆందోళన ఉంది. అదే జరిగితేరవాణారంగంపై ప్రభావం పడి రవాణా వ్యయాలుపెరుగుతాయి దీనివల్లకూర గాయలు, పండ్లు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య మధ్యతరగతికి పెనుభారం కాకతప్పదు. జిఎస్టీ రేట్లను కూడా కొన్ని మారుస్తారన్న ప్రచారం ఉంది. 18% శ్లాబ్‌నుంచి అధికవినియోగం ఉత్పత్తులను 5% శ్లాబ్‌కు మార్చే అవకాశం ఉందని అంచనా. అదే జరిగితే సబ్బులు, డిటర్జెంట్లు వంటి వాటిధరలు తగ్గుతాయి. వంటనూనెలపై దిగుమతి సుంకం తగ్గించి దేశీయంగా ఉత్పత్తినిపెంచేందుకు ప్రోత్సాహకాలు ప్రకటించవచ్చని అంచనాలున్నాయి. ఎలక్ట్రానిక్స్, లగ్జరీ కార్లు, సిగరెట్లు, మత్తు ఉత్ప్రేరక పానీయాలు వంటి వాటిపై ధరలు పెరుగుతాయన్న అంచనాలున్నాయి. కార్పొరేట్‌రంగానికి ఊతం ఇచ్చేవిధంగా పన్ను వసూళ్లలో రాయితీలు, మినహాయింపులతోపాటు విదేశీ పెట్టు బడులను ఆకర్షించే కొత్త విధానాలను నిర్మలమ్మ తన బడ్జెట్‌లోప్రకటిస్తారని అంచనా. కొన్ని ప్రభుత్వసంస్థల్లో నూరుశాతం విదేశీ పెట్టుబడులు అనుమతులిచ్చిన కేంద్రం కొన్ని సంస్థల్లో ప్రభుత్వ వాటాను తగ్గించి ప్రైవేటు భాగస్వాములను పెంచేందుకు కృషిచేస్తోంది. దీనివల్ల ఖజానా మెరుగుపడటంతోపాటు ఆర్థికలోటు కూడా తగ్గుతుందన్న అంచనాలు ఎక్కువ ఉన్నాయి. ఈకోణంనుంచి చూస్తే పెట్టుబడులకు కొత్త బడ్జెట్ రెడ్‌కార్పెట్ వేస్తుందని స్పష్టంగా తెలుస్తోంది. మూలధన లబ్ధిపై పన్ను, ఎగుమతులపై మినహాయింపులు, దిగుమతులపైనా సుంకాల రాయితీలు వంటి వాటిపైనే అటు ట్రేడర్లు, ఎగుమతిదారులు, కార్పొరేట్లు, పారిశ్రామిక సంఘాలు ఆసక్తితోచూస్తున్నాయి.

# కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణను నిర్లక్ష్యం చేయొద్దు

## కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి31:** కేంద్ర ప్రభుత్వం ఆదివారం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో తెలంగాణను నిర్లక్ష్యం చేయొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వానికి వివక్ష ఉందన్నారు. తెలంగాణపై బడ్జెట్‌లో వివక్షత చూపిస్తే బీజేపీ ఎంపీలే బాధ్యత వహించాలని చెప్పారు. శనివారం గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. పౌర్ణమి తెలంగాణకు వెలుగులు తెస్తుందా..? , చీకటి ఇస్తుందా..? చూడాలని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రతిసారీ తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఈ బడ్జెట్‌లోనైనా తెలంగాణకు న్యాయం చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పాటు, ఉద్యమం పట్ల ప్రధాని నరేంద్రమోదీకి వ్యతిరేకత ఉందన్నారు. రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన వంటి తెలంగాణ ప్రతిపాదనలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని సూచించారు. ఈ విషయంపై కేంద్రానికి, బీజేపీకి చివరిసారిగా గుర్తు చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ కేంద్రం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కేంద్ర విద్యాసంస్థల స్థాపనకు మోదీ ప్రభుత్వం సహకరించాలని కోరారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు తెలంగాణకి వస్తే తాము గౌరవంగా కలుస్తున్నామని ప్రస్తావించారు. పక్క రాష్ట్రాలకి నిధులు కేటాయిస్తే తప్పుపట్టడం లేదని మంత్రి స్పష్టం చేశారు.

# డాక్టర్ నోరి దత్తాత్రేయుడికి మెగాస్టార్ చిరంజీవి ఆతిథ్యం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి31:** ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణుడు, పద్మభూషణ్ పురస్కార గ్రహీత డాక్టర్ నోరి దత్తాత్రేయుడితో మెగాస్టార్ చిరంజీవి భేటీ అయ్యారు. ఇటీవల పద్మభూషణ్ పురస్కారం అందుకున్న డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని చిరంజీవి తన నివాసానికి ఆహ్వానించి, ఆతిథ్యం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి, ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ భేటీపై చిరంజీవి సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ తన సంతోషాన్ని పంచుకున్నారు. 'అధునాతన కేన్సర్ చికిత్సలో అసాధారణమైన సేవలకు గాను పద్మభూషణ్ గౌరవం పొందిన డాక్టర్ నోరి దత్తాత్రేయుడు గారికి ఆతిథ్యం ఇవ్వడం, ఆయనతో అద్భుతమైన క్షణాలను గడపడం గౌరవంగా భావిస్తున్నాను. ఆయన సేవా ప్రయాణం, అంకితభావం, నిజాయతీ తరతరాలకు నిజమైన స్ఫూర్తిగా నిలుస్తాయి. ఆయనకు నా హృదయపూర్వక అభినందనలు, ప్రగాఢ గౌరవాన్ని తెలియజేస్తున్నాను' అని పేర్కొన్నారు.



శనివారం మేడారంలో సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

# జనం నుండి వనంలోకి..

>> తిరిగి వన ప్రవేశం చేశారు. దీంతో కన్నుల పండుగగా జరిగిన మేడారం మహా జాతర అధికారికంగా ముగిసింది. అయితే అమ్మలు వనానికి కదిలే వేళ కూడా భక్తులు లక్షలలో వన దేవతల దర్శనానికి వస్తూనే ఉన్నారు. తల్లుల వనప్రవేశంతో వన జాతర ముగిసింది. సాయంత్రం సమయంలో గద్దెలను పరిశుభ్రం చేసి, గిరిజన పూజారులులైట్లను ఆర్పివేసి..వెన్నెల కాంతిలో గద్దెలవద్ద అమ్మవార్లకు తుదిపూజలు నిర్వహించారు. సమ్మక్క తల్లిని చిలుకలగుట్టకు, సారలమ్మను కన్నెపల్లి ఆలయానికి, పగిడిద్దరాజును మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లకు, గోవిందరాజులను ఏటూరినాగారం మండలం కొండాయ్ గ్రామానికి పూజారులు ఊరేగింపుగా తీసుకెళ్లారు. దేవతల వనప్రవేశంతో మేడారం మహా జాతర ముగిసింది.

**వీవీఐపీ వాహనాలకే రెడ్ కార్పెట్..**

మేడారం పురవీధుల్లో భక్తులకు నడక కూడా దుర్లభంగా మారింది. వీఐపీ, వీవీఐపీ వాహనాల కాన్వాయ్‌లు మేడారాన్ని ముట్టడించడంతో ప్రధాన మార్గాలు పూర్తిగా స్తంభించిపోయాయి. స్థానిక ఆటోలు, పాసులేని వీఐపీ వాహనాలు ఇష్టారాజ్యంగా తిరగడంతో సామాన్య భక్తులు గంటల తరబడి రోడ్లపైనే పడిగాపులు కాసేలా చేశాయి. దర్శనం కోసంమే కాదు.. కేవలం అడుగు ముందుకు వేయడానికే భక్తులు పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**పొలిటికల్ దర్బానిదే రాజ్యం**

వీఐపీ, వీవీఐపీ పాస్‌లు చేతిలో ఉన్నా ప్రయోజనం లేకుండా పోయిందన్న ఆవేదన భక్తుల్లో వ్యక్తమవుతోంది. పాస్ వ్యవస్థ ఒక ప్రహసనంగా మారగా, 'ఎవరి వాహనం ఎంత పెద్దదైతే అంత ప్రాధాన్యం' అన్న దుర్మార్గమైన వ్యవస్థ మేడారంలో నడిచిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పొలిటికల్ దర్బానిదే రాజ్యంగా నడిచిందని భక్తుల నుండి తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి.

**అదుపుతప్పిన ట్రాఫిక్..**

చేతులెత్తేసిన యంత్రాంగం ప్రముఖుల వాహనాల రాకపోకలతో జాతర మొత్తం ట్రాఫిక్ అదుపు తప్పి, అధికారులు నిస్సహాయంగా మారిపోయారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మేడారం పూర్తిగా 'వీఐపీ వల'లో చిక్కుకోగా, సామాన్య భక్తులు వనదేవతల సన్నిధిలోనే విలవిల్లాడారు. భక్తుల బాధలు పట్టించుకునే దిక్కు లేకుండా పోయిందన్న వేదన స్పష్టంగా కనిపించింది. ఆర్టీసీ చేతులెత్తేయడం.. విద్యుత్ శాఖకే మెప్పు. భక్తుల రాకపోకలకు కీలకమైన ఆర్టీసీ సేవలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శలు గుప్పుమంటున్నాయి. సరైన బస్సులు లేక భక్తులు కాలినడకన, ఆటోలపైనే ఆధారపడాల్సి వచ్చింది. మరోవైపు విద్యుత్ శాఖ మాత్రం నిరంతర విద్యుత్ సరఫరాతో కొంతమేరకు ఊరటనిచ్చిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. విద్యుత్ వెలుగు జిలుగులతో మేడారంలో మరో కొత్త లోకం ఆవిష్కృతమైందని భక్తులన్నారు. ఎక్కడ చూసిన రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన కళ్ళు మిరుమిట్లు గొలిపే సుందర దృశ్యాలతో భక్తులను మరో లోకంలో విహరింపజేసింది.

**వైద్య సేవల వైఫల్యం.. ఆరుగురు మృతి..?**

అత్యంత ఆందోళన కలిగించే అంశం హెల్త్ డిపార్ట్మెంట్ పనితీరుపై వచ్చిన ఆరోపణలే. సరైన వైద్య సేవలు అత్యవసర అందక ఆరుగురు భక్తులు మృతి చెందినట్లు జాతర ప్రాంగణంలో టాక్ జోరుగా నడుస్తోంది. నిజమైతే ఇది చిన్న విషయం కాదు.. ఇది ప్రభుత్వ యంత్రాంగం ఘోర వైఫల్యానికి నిదర్శనమేనన్న విమర్శలు భక్తుల నుండి వినిపిస్తున్నాయి. భక్తి జాతరలో వీవీఐపీ సంస్కృతితో ప్రభుత్వానికి చెడ్డ పేరు..భక్తి, విశ్వాసాలకి ప్రతీకగా నిలిచే మేడారం మహాజాతరలో వీవీఐపీ సంస్కృతి పెత్తనం చలాయించడంతో ప్రభుత్వానికి కూడా చెడ్డ పేరు తెస్తోందని భక్తులు ఆవేదన చెందుతున్నారు. మెరుగైన సౌకర్యాలతో మంచి చేయాలన్న ఉద్దేశంతో జాతర నిర్వహణకు పెద్దఎత్తున నిధులు కేటాయించిన ప్రభుత్వానికి.. ఈ వీవీఐపీ వ్యవస్థ వల్ల ప్రభుత్వానికి అపప్రథ పడుతోందన్న అభిప్రాయం భక్తుల్లో వ్యక్తమవుతోంది.

**ప్రజాక్షేత్రంలో మోగుతున్న అనేక ప్రశ్నలు...**

మేడారంలాంటి మహాజాతరలోనైనా..వీఐపీ సామాన్య భక్తుల మధ్య తేడా ఉండాలా..?హోదాను బట్టే వనదేవతలు దర్శన భాగ్యమా? ఈప్రశ్నలకు ప్రభుత్వం, ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. లేక పోతే..భక్తి జాతరపై వీవీఐపీ మచ్చ శాశ్వతంగా మిగిలిపోతుందన్న హెచ్చరిక భక్తుల నుండి స్పష్టంగా వినిపిస్తోంది.

# విద్యార్థుల బృందంతో సిఎం రేవంత్ భేటీ

>> విద్యార్థులు, అలుమ్నీలతోనూ సుదీర్ఘంగా సిఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాయకత్వం, విజయానికి సంబంధించిన అంశాలు, ఆర్థిక వృద్ధి, అభివృద్ధి నమూనాలు, సుస్థిరత, పర్యావరణ సవాళ్లు, రైతులు, మహిళలు, యువత సంక్షేమ విధానాలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సీఎం తనదైన శైలిలో సమాధానమిచ్చారు. 'మీకు నాయకత్వ పాఠాలు చెప్పడానికి ఇక్కడ ప్రొఫెసర్లే ఉత్తమ గురువులు. ఈ విషయంలో తాను మోసపూరిత ప్రొఫెసర్ పాత్రను ధరించదలుచుకోలేదని సిఎం రేవంత్ సరదాగా వ్యాఖ్యానించారు. నేను కేవలం నా అనుభవాలను పంచుకోవడానికి వచ్చాను. బోధన కంటే సంభాషణ ద్వారానే ఎక్కువ నేర్చుకోవచ్చని సీఎం స్పష్టం చేశారు.

పరస్పర సంభాషణ, అనుభవాలు పంచుకోవడం, పరస్పర అధ్యయనం ఆధారంగా జరిగే సార్థక ద్విముఖ చర్చలకే తాను ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. భారతదేశం, తెలంగాణ భవిష్యత్తుపై తాను చాలా ఆశాజనకంగా ఉన్నానని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మన దేశం కీలక పాత్ర పోషించబోతోందని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మక తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను విద్యార్థులకు వివరించారు. 2034 నాటికి వన్ ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణ ఎదగడమే లక్ష్యమని వివరించారు. పర్యావరణ పరిరక్షణతో కూడిన పారిశ్రామికాభివృద్ధి, రైతులకు భరోసా, మహిళా సాధికారత అంశాలపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సీఎం వివరణాత్మక సమాధానాలు ఇచ్చారు.

హార్వర్డ్ వంటి అంతర్జాతీయ వేదికలపై చదువుతున్న విద్యార్థులు తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సీఎం పిలుపునిచ్చారు. మార్పు దిశగా నాయకత్వం వహించడంలో ఉన్న సవాళ్లతో పాటు తన దీర్ఘకాలిక విజన్ కోర్ పిల్లర్లను వివరించారు. సమగ్ర వృద్ధి, స్టేక్‌హోల్డర్ పార్టిసిపేషన్, శక్తివంతీకరణ ఆధారిత అభివృద్ధికి తెలంగాణ రైజింగ్ 2047 విజన్ కల్పించే అవకాశాలను ఆయన వివరించారు. 'హైదరాబాద్, తెలంగాణ అభివృద్ధికి మీ నైపుణ్యాన్ని ఉపయోగించండి. తెలంగాణ రైజింగ్ బ్రాండ్ అంబాసిడర్లుగా మారండీ అని విద్యార్థులకు సిఎం పిలుపునిచ్చారు. సీఎం విజన్‌కు ప్రభావితమైన విద్యార్థులు, తాము కచ్చితంగా తెలంగాణ అభివృద్ధి, స్టార్టప్ రంగానికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర గ్లోబల్ ప్రతిష్ఠను మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు.

క్లాసుల విరామ సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి హార్వర్డ్ వైస్ ప్రొవోస్ట్ ప్రొఫెసర్ డస్టిన్ టిన్‌గ్లీ, కెన్నెడీ స్కూల్ డీన్ జెరెమీ వైన్‌స్టెయిన్‌లతో సమావేశమయ్యారు. తెలంగాణలోని విద్యాసంస్థల్లో అంతర్జాతీయ ప్రమాణాలను తీసుకురావడానికి హార్వర్డ్ సహకారాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. కాగా విదేశీ పర్యటన ముగించుకున్న సిఎం రేవంత్‌రెడ్డి ఫిబ్రవరి 2న హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

# 'హార్వర్డ్'లో ప్రసంగించాలని సిఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

## మార్చిలో కెన్నెడీ స్కూల్ నిర్వహించనున్న ఎఐ సింపోజియం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి31:** అమెరికా హార్వర్డ్ యూనివర్సిటీలో లీడర్‌షిప్ ఇన్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మరో అరుదైన ఆహ్వానం అందుకున్నారు. హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ మొట్టమొదటి సారిగా నిర్వహిస్తున్న ఏఐ పాలసీ సింపోజియంలో ప్రసంగించాలని రేవంత్ రెడ్డిని నిర్వాహకులు ప్రత్యేకంగా ఆహ్వానించారు. భారత్ నుంచి తెలంగాణ ముఖ్యమంత్రి ఒక్కరే ఈ సింపోజియం ఆహ్వానం అందుకోవటం విశేషం. మార్చిలో జరిగే ఈ కార్యక్రమంలో హార్వర్డ్ కెన్నడీ స్కూల్ డీన్ జెరెమీ వైన్‌స్టీన్‌తో కలిసి సింపోజియం ప్రారంభించాలని ప్రత్యేక ఆహ్వాన లేఖను అందించారు. వివిధ రంగాల ప్రముఖులతో పాటు సాంకేతిక నిపుణులు హాజరవుతారు. హైదరాబాద్ నుంచే వర్చువల్‌గా ఈ వేదికపై ప్రసంగించే అవకాశాన్ని పరిశీలిస్తానని సీఎం అంగీకరించారు. హార్వర్డ్ యూనివర్సిటీలో కార్యక్రమాల చివరి రోజున సిఎం రేవంత్ రెడ్డి వివిధ ప్రతినిధి బృందాలు, పలు స్కూల్ విద్యార్థులు, అలుమినీతో పాటు ఎంఐటీ, కొలంబియా యూనివర్సిటీల విద్యార్థులు, పూర్వ విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్యాలు, ఎదురయ్యే సవాళ్లు, సాధికారత అభివృద్ధి దిశగా ఉన్న అవకాశాలను వివరించారు. భవిష్యత్తు భారత పురోభివృద్ధిలో తెలంగాణ, అందులో ప్రధానంగా హైదరాబాద్ ముందుండి దిశానిర్దేశం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వివిధ దేశాల్లో చదువుతున్న విద్యార్థులు తెలంగాణ రైజింగ్ బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని పిలుపునిచ్చారు.

## ఆపరేషన్ స్మైల్‌తో 5,582 మంది చిన్నారులకు విముక్తి

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా జనవరి ఒకటవ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరిగిన ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా మొత్తం 5,582 మంది చిన్నారులకు సిఐడి విముక్తి కలిగించింది. ప్రతీ ఏడాది బాల కార్మికులుగా వుంటున్న వారిని కాపాడేందుకు, వెట్టి చాకిరిలో వున్న వారిని ఆదుకునేందుకు సిఐడి ప్రత్యేకంగా దాడులు చేస్తుండడం తెలిసిందే. ఈ క్రమంలోనే జనవరి నెలలో అనేకచోట్ల దాడులు చేబట్టారు. ఈ దాడుల్లో 121 సబ్ డివిజన్లలో 600 మంది పోలీసు సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారని సిఐడి చీఫ్ చారు సిన్హా శనివారం నాడు మీడియాకు తెలి పారు. ఈ దాడుల్లో పోలీసులతో పాటు స్త్రీ శిశు సంక్షేమ శాఖతో పాటు, కార్మిక, ఆరోగ్య శాఖ, బాలల సంరక్షణ కమిటీలు, స్వచ్ఛంద సంస్థలు కూడా పాలు పంచుకున్నారని ఆమె తెలిపారు. ఈ దాడుల్లో సిఐడి కాపాడిన వారిలో 5108 మంది బాలలు, 474 మంది బాలికలు వున్నారని ఆ మె తెలిపారు. రక్షించిన బాలల్లో 2292 మంది బిహార్, ఎపి, యుపి, ఒడిషా, ఎపి రాష్ట్రాలకు చెందిన వారని ఆమె తెలిపారు. వీరిలో నేపాల్‌కు చెందిన 43 మంది వున్నారని ఆమె వెల్లడించారు. రక్షించబడిన బాలలలో 4567 మంది బాల కార్మికులు కాగా 486 మంది వీధి బాలలుగా, 38 మంది బిక్షాటన చేస్తున్నవారేగా, 491 మంది ఇతర పనుల్లో వున్నారని ఆమె తెలిపారు. దాడుల సమయంలో 1480 మందిపై ఎఫ్ఐఆర్‌లు నమో దు చేసి 1483 మందిని అరెస్టు చేశామని సిఐడి చీఫ్ చారు సిన్హా తెలిపారు. కాగా సిఐడి రక్షించిన వారిలో 4978 మంది చిన్నారులను వారి త ల్లిదండ్రుల వద్దకు చేర్చామని 604 మందిని హోంలకు తరలించామని ఆమె తెలిపారు. వలస కార్మికుల పిల్లల కోసం 29 అర్బన్ బ్రిడ్జి స్కూళ్లలో 2375 మంది బాలలను చేర్పించినట్లు ఆమె తెలిపారు. బాలకార్మికులను రక్షించేందుకు సిఐడి నిరంతరం దాడులు చేస్తూనే వుంటుందని చారుసిన్హా తెలిపారు.

## పెండింగ్ డిఎ, పిఆర్సీలను తక్షణమే ప్రకటించాలి

### విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల ప్రయోజనాలను రిలీజ్ చేయాలి

### టీచర్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, ఎవిఎన్ రెడ్డి

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీలను తక్షణమే ప్రకటించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీల మల్క కొమరయ్య, ఏవీఎన్ రెడ్డి డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ అయిన ప్రభుత్వ ఉద్యోగుల ప్రయోజనాలను కూడా విడుదల చేయాలన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) రూపొందించిన 2026 డైరీ, క్యాలెండర్లను ఎమ్మెల్సీలు హైదరాబాద్ విద్యానగర్‌లో ఉన్న తపస్ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మాట్లాడుతూ, తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గత ఏడాది కాలంగా ప్రజాక్షేత్రంలోనూ, శాసనసభతోపాటు శాసనమండలిలోనూ బిజెపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పలుమార్లు స్పీకర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలను తీసుకెళ్లామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ విడుదల వంటి కీలక అంశాలపై మొన్న ఇందిరా పార్కులో మహాధర్నా నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చామన్నారు. ప్రభుత్వం నిరక్ష్య వైఖరిని విడనాడే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని, ముందు మరింత తీవ్ర స్థాయిలో ఉద్యమాలు చేపడతామన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి బిజెపి అండగా నిలుస్తుందని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షులు వోడ్నాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ హన్మంతరావు పాల్గొన్నారు.

## ప్రియుడి భార్యపై పెట్రోల్‌పోసి నిప్పంటించిన ప్రియురాలు

### నల్లగొండ జిల్లా నాంపల్లి మండలంలో దారుణం.. తల్లి, పసికందు మృతి

**నాంపల్లి, జనవరి 31, ప్రభాతవార్త:** నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం కేతపల్లిలో శుక్రవారం హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. వివాహేతర సంబంధం నేపథ్యంలో ప్రియుడి భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో తల్లి, పసికందు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతపల్లి గ్రామానికి చెందిన నగేష్‌యాదవ్‌కు వివాహం జరిగి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే అతనికి అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఆ మహిళకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ క్రమంలో తన ఇద్దరు కూతుళ్లలో ఒకరిని పెళ్లి చేసుకోవాలని నగేష్‌యాదవ్‌ను సుజాత బలవంతం చేసింది. దీనికి నగేష్ అంగీకరించకపోవడంతో ఆమె తీవ్ర ఆగ్రహానికి గురై నగేష్ ఇంటికి వెళ్లి చంటి బిడ్డకు పాలిస్తున్న అతని భార్య మమతపై పెట్రోల్‌పోసి నిప్పంటించింది. ఈ ఘటన సమయంలో మమత తన చిన్నారిని కాపాడేందుకు ప్రయత్నించగా, చిన్నారిని దూరంగా విసిరివేశారు. అయినప్పటికీ మంటలు అంటుకోవడంతో మమత అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్ర గాయాలపాలైన పసికందు చావుబతుకుల మధ్య పోరాడుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నిందితురాలు నాంపల్లి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నిమ్స్‌లో చికిత్స పొందుతూ ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య మృతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 31:** ఎక్సైజ్ కానిస్టేబుల్ జి. సౌమ్య నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఇటీవల గంజాయి స్మగ్లర్ల దాడి జరిగిన సందర్భంగా తీవ్రంగా గాయపడి ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య ఆసుపత్రి పాలైన సంగతి తెలిసిందే. ఈ సంఘటన జరిగిన నుంచి ఆసుపత్రిలో ఉన్న సౌమ్య ఆరోగ్య పరిస్థితి, అత్యంత విషమంగా తయారైంది. ఈ నేపథ్యంలోనే శనివారం రాత్రి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సౌమ్య మరణించినట్లు నిమ్స్ ఆస్పత్రి నుంచి హెల్త్ అప్డేట్ పేరుతో ఓ ప్రకటన విడుదలైంది. బయటకు వచ్చిందని సమాచారం. నిజామాబాద్ జిల్లాలో గంజాయిస్ స్మగ్లర్ల కారు దాడిలో ఎక్సైజ్ శాఖ కానిస్టేబుల్ సౌమ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. గంజాయి తరలిస్తున్న ముఠాను అడ్డుకునేందుకు సౌమ్య ప్రయత్నించింది. దీంతో ఆమెను కారుతో గంజాయి స్మగ్లర్లు ఢీకొట్టారు. ఈ సంఘటన నేపథ్యంలో తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ సౌమ్యను హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఆరోగ్యం విషమించడంతో మరణించినట్లు నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పోటీ

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, జనవరి 31 ప్రభాతవార్త:** తెలంగాణలో 116 మున్సిపాలిటీలు, 6 మున్సిపల్ కార్పొరేషన్‌లు, 2996 వార్డులు, డివిజన్లలో భారతీయ జనతా పార్టీ వందశాతం అన్ని స్థానాల్లో పోటీకి నామినేషన్లు సమర్పించినట్లు బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు తెలిపారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అభ్యర్థులకు బి ఫారమ్ పంపించడం జరిగిందని, గత ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బిజెపి పట్ల చూపిన విశ్వాసాన్ని గమనించి, ప్రతి స్థానంలో పోటీ చేస్తున్నారు. మా అభ్యర్థులు అన్ని బ్యాలెట్ పేపర్స్‌లో బిజెపి సింబల్‌తో పోటీలో నిలుస్తారు. బిఆర్ఎస్‌తో పార్టీలు కాంగ్రెస్ పార్టీలు ఒకే దారిలో వెళ్ళి, గతంలో చేసిన స్కామ్స్‌ను కొనసాగిస్తూ ప్రజల నమ్మకాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా మున్సిపాలిటీస్‌లో గత బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన లే అవుట్ రెగ్యులేషన్ స్కీమ్‌తో లక్షలాది ప్రజలను బాధపడే పరిస్థితిలో పెట్టిందన్నారు. చిన్న ప్లాట్ కోసం 1,000 రూపాయలు, పెద్ద ప్లాట్ కోసం 10,000 రూపాయలు ఫీజు వసూలు చేశారని, దాదాపు 25.67 లక్షల అప్లికేషన్లు వచ్చినప్పటికీ, ప్రభుత్వానికి మొత్తం 250 కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. కానీ, ప్రజలకు అందిన లాభం కేవలం 10శాతం మాత్రమే అన్నారు. ఫీజులు వసూలు చేసినప్పటికీ, న్యాయపరమైన సమస్యలు, బకాయిల కారణంగా స్కీమ్ నిలిపివేయబడిందన్నారు. తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా 20శాతం మాత్రమే ఫీజులు ప్రభుత్వానికి సమర్పించబడేలా చేసిందన్నారు. ఇప్పటికీ ల్యాండ్ రెగ్యులేషన్ అమలు కాలేదన్నారు. ఫలితంగా లక్షలాది ప్రజలు అన్యాయంగా ఎదురుచూస్తున్నారు. ఈ 15 రోజుల్లో రెగ్యులేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని, ప్రజలకు న్యాయం చేయాలని, ఫీజులు వసూలు అయినప్పటికీ అమలు కాని సమస్యలను వెంటనే పరిష్కరించాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, 1000 రూపాయల ఫీజుతో పేద ప్రజలను లక్ష్యంగా తీసుకొని, లే అవుట్ రెగ్యులేషన్ స్కీమ్ ద్వారా మోసం చేస్తుందన్నారు. గత బిఆర్ఎస్‌తో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం.. గతంలో చేసిన లూఠీ పద్ధతినే కొనసాగిస్తున్నాయి.



శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

## మహిళా సాధికారికత విప్లవాత్మక ప్రజాస్వామ్య మార్పు

### గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జనవరి 31, ప్రభాతవార్త:** మహిళా సాధికారత దేశంలో నిశ్శబ్ద విప్లవాత్మక ప్రజాస్వామ్య మార్పుగా అభివృద్ధి చెందిందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. పాఠశాల విద్యార్థుల కోసం రూపొందించిన సృజనాత్మక, వినూత్న పౌర విద్యాకార్యక్రమం ఐ విజన్ యూత్ పార్లమెంట్-2025 గ్రాండ్‌ఫినాలే కార్యక్రమాన్ని బంజారాహిల్స్ బీజేఆర్ భవన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయనతోపాటు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. గవర్నర్ మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్ నాయకులని, రాయబారులని అన్నారు. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు దేశం, రాష్ట్ర భవి ష్యత్ దిశను నిర్ణయించే అత్యున్నత ప్రజాస్వామ్య సంస్థలన్నారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా అనుభవాత్మక విద్య ప్రాముఖ్యతను ఆయన వివరించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు, సర్టిఫికెట్లు అందజేశారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, రాజకీయాల నాణ్యతను మెరుగుపరచడానికి యువత ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం అత్య వసరమన్నారు. విద్యార్థి రాజకీయాల నుండి ప్రజాజీవితానికి తన ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ, చదువుకున్న, అవగాహన కలిగిన యు వత ప్రజాస్వామ్య సంస్థలతో అనుసంధానం కావాలని పిలుపునిచ్చారు. యూత్ పార్లమెంట్, మాక్ అసెంబ్లీ, మోడల్ యునైటెడ్ నేషన్స్ వంటి కార్యక్రమాలు విద్యార్థులకు శాసనసభల పనితీరు, ప్రజావిధానం, పరిపాలనపై ఆచరణాత్మక అవగాహన కల్పిస్తాయని, బాధ్యతాయుతమైన భవిష్యత్ నాయకత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. ఇలాంటి కార్యక్రమాలను రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమలు చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ హరిచందన దాసరి మాట్లాడుతూ, ఐ విజన్ యూత్ పార్లమెంట్ పఠన పద్ధతిని దాటి, తరగతి గదులను ప్రజాస్వామ్యానికి జీవంతమైన ప్రయోగ శాలలుగా మార్చే లక్ష్యంతో రూపొందించబడిందని తెలిపారు. జిల్లాలోని 183 ప్రభుత్వ పాఠశాలలు, 50కిపైగా ప్రైవేట్ సంస్థలను చేరిందన్నారు. 2వేల మందికి పైగా విద్యార్థులు పాఠశాల, మండల స్థాయిల్లో పాల్గొనగా, 183 మంది విద్యార్థులు జిల్లా స్థాయి ఫినాలేకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రోహిణి, మార్కెటింగ్ ప్రతినిధులు అంజలి గుప్తా, అంకుర్ గుప్తా, రోటరీ లేక్ డిస్ట్రిక్ట్ ప్రతినిధులు రోటేరియన్లు సునీల్ సరాఫ్, రాజ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు



విద్యార్థులతో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, చిత్రంలో మంత్రి పొన్నం, దాసరి హరిచందన తదితరులు

## నేటి ఉదయం కెసిఆర్ ఎర్రవల్లి నుంచి రాక

### నందినగర్‌లో భద్రత పెంచిన పోలీసులు

### బిఆర్ఎస్ రాష్ట్రవ్యాప్త ఆందోళనతో భారీ బందోబస్తు

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ విచారణకు రంగం సిద్ధమయ్యింది. మొదటి దఫాగా ఇచ్చిన నోటీసుకు సమయంతో పాటు తనను ఎరవల్లిలోనే విచారించాలని కెసిఆర్ కోరడం తెలిసిందే. అయితే కెసిఆర్ కోరినట్లుగా విచారణకు గడువు ఇచ్చిన పోలీసులు ఎరవల్లిలో విచారిం చేందుకు నిరాకరించడం విదితమే. దీనిపై రెండవసారి శుక్రవారం నాడు నోటీసు లు ఇవ్వగా ఈ నోటీసుపై మొదట కెసిఆర్ కానీ బిఆర్ఎస్ కానీ స్పందించక పోవడంతో ఉత్కంఠ నెలకొంది. ఒక దశలో పోలీసుల నోటీసులపై హైకోర్టును ఆశ్రయించాలని బిఆర్ఎస్ భావించినట్లు వార్తలు వచ్చాయి. చివరకు దీనిపై న్యాయ నిపుణుల సలహా మేరకు ఆదివారం నాడు నందీనగర్‌లో విచారణకు అందుబాటులో వుండాలని కెసిఆర్ నిర్ణయించి ఈ మేరకు శనివారం సాయంత్రం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఫోన్ ట్యాపింగ్‌పై కెసిఆర్ విచారణకున్న అడ్డంకులు తొలగిపోయాయి. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులో కెసిఆర్ విచారణను నిరసిస్తూ ఆదివారం నాడు రా ష్ట్ర వ్యాప్తంగా బిఆర్ఎస్ శ్రేణులు నిరసనలు చేయాలని పార్టీ ఆదేశించడంతో పోలీసు శాఖ భారీ బందోబస్తు చేబట్టింది.

రెండేళ్ల క్రితం వెలుగు చూసిన ఫోన్ ట్యాపింగ్‌పై పోలీసుల విచారణ ముగింపు దశకు చేరింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓటమి పాలై కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చాక నాలుగు నెలల అనంతరం ఫోన్ ట్యాపింగ్ వెలుగు చూడడం తెలిసిందే. 2024 ఫిబ్రవరి నెలలో అప్పట్లో ఎస్ ఐబిలో ఫోన్ ట్యాపింగ్ యూనిట్‌కు డిఎస్‌పిగా వున్న దుగ్యాల ప్రణీత్ రావును సిరిసిల్లా జిల్లాకు బదలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్తగా వచ్చిన మరో అధికారి ఫోన్ ట్యాపింగ్ యూనిట్‌లో కంప్యూటర్లు, హార్డ్ డిస్కులు ధ్వంసం అయివుండడం గమనించారు. ఆఖరుకు కంప్యూటర్లకు వున్న కరెంటు కనెక్షన్లను కూడా తొలగించి వుండడం, కరెంటు కనెక్షన్ల వైర్లను ఇష్టం వచ్చినట్లు బయటపడవేసి కాల్చి వేయడం జరిగింది. దీనిపై కొత్త అధికారి ఎస్ఐబి ఐజి సుమతికి ఫిర్యాదు చేయగా ఆమె దీనిపై అప్పటి నిఘా విభాగం డిజి శివధర్ రెడ్డికి సమాచారం అందించారు. దీనిపై ఉన్నతాధికారులు వెంటనే రంగంలో దిగి విచారించగా ఫోన్ ట్యాపింగ్ యూనిట్‌లో నక్సలైట్లకు సంబంధించిన కీలక సమాచారంతో పాటు అనేక అంశాలు ధ్వంసం అయినట్లు తేలింది. ఇదే సమయంలో అక్కడ లభించిన పెన్ డ్రైవ్ సహా ఇతర వస్తువుల్లో వున్న సమాచారం ఆధారంగా అసెంబ్లీ ఎన్నికల సమయం లో ప్రతిపక్ష నేతలతో పాటు ప్రముఖులు, జర్నలిస్టులు, జడ్జిలు, సెలబ్రటీల ఫోన్‌లను ట్యాపింగ్ చేసినట్లు తేలింది. దీంతో ఎస్ఐబి అదనపు ఎస్‌పి ఫిర్యాదు మేరకు 2024 మార్చి నెలలో పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. దీనిపై విచారణకు సిట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సిట్‌కు అప్పటి పశ్చిమ మండల డిసిని విజయ్ కుమార్ నేతృత్వం వహించారు. సిట్ విచారణాధికారిగా జూబ్లీహిల్స్ ఎసిపి వెంకటగిరి నియమించబడ్డారు. ఈ విచారణ అప్పటి నుంచి కొనసాగుతోంది. కెసిఆర్‌ను విచారించేందుకు మొదట జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయం, ఆ తరువాత పోలీసు స్టేషన్‌ను కేంద్రంగా నిర్ణయించినా, వయస్సు రీత్యా నందీనగర్‌లోని ఆయన ఇంట్లోనే విచారించడం ఉత్తమమని సిట్ అధికారులు నిర్ణయించారు. ఈ విషయంలో న్యాయ నిపుణుల సలహా తీసుకున్న సిట్ అధికారులు కెసిఆర్ విచారణకు ఎలాంటి అడ్డంకులు లేకుండా జాగ్రత్త పడ్డారు. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు మొదలయ్యే విచారణ రాత్రి బాగా పొద్దుపోయే వరకు కొనసాగే వీలుంది. కెసిఆర్‌ను సిట్ బాస్‌గా వున్న సజ్జనార్ విచారించే వీలుందని తెలిసింది. ఆయనతో పాటు ఇతర అధికారులు విచారణలో పాల్గొనే వీలుంది. ఫోన్ ట్యాపింగ్‌లో ఇ ప్పటి వరకు వెలుగు చూసిన ఆధారాలను కెసిఆర్ ముందుంచి ఆయన నుంచి వివరాలు, వాంగ్మూలం తీసుకోవాలని సిట్ అధికారులు నిర్ణయించారు.

**నందీనగర్ వద్ద భారీ భద్రత**

ఇదిలా ఉండగా కెసిఆర్‌ను విచారించే నందీనగర్‌లో పోలీసులు ఇప్పటికే భారీ భద్రతను ఏర్పాటు చేశారు. కెసిఆర్ విచారణను అడ్డుకునేందుకు బిఆ ర్ఎస్ శ్రేణులు ప్రయత్నించే వీలుండడంతో బారికేడ్లను ఏర్పాటు చేశారు. నందీనగర్ పరిసరాలలో ఎవరు రాకుండా డిసిపి స్థాయి అధికారిని బందోబస్తు కోసం నియమించారు. మరోవైపు బిఆర్ఎస్ భవన్ వద్ద కూడా పోలీసులను మోహరించారు. ఆదివారం నాడు భారీగా పార్టీ కార్యకర్తలను తర లి రావాలని పార్టీ అధినాయకత్వం పిలుపు నివ్వడంతో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భారీగా పోలీసులను మోహరించారు. దీంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం నాడు బిఆర్ఎస్ కార్యకర్తల నిరసనల నేపథ్యంలోనూ అన్నిచోట్ల బందోబస్తు ఏర్పాటు చేశారు.

## నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ శరణి పొంగూరుకు ఫెమినా అచీవర్స్ అవార్డ్స్-2026 పురస్కారం ప్రదానం

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ శరణి పొంగూరు మరో అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాల అభివృద్ధి కోసం ఆమె చేసిన విశేష కృషికి గాను ప్రతిష్టాత్మకమైన ఫెమినా అచీవర్స్ అవార్డ్స్ 2026 నార్త్ వేదికగా ఎక్సలెన్స్ ఇన్ స్టూడెంట్ మైండ్సెట్ అండ్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ అవార్డుతో ఘనంగా ఆమెను సత్కరించారు. భారతదేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులను ఆత్మవిశ్వాసం కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో ఆమె పోషిస్తున్న పాత్రకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. విద్యార్థుల్లో ఉన్న ప్రతికూల ఆలోచనలను తొలగించి, వారిలో స్పష్టమైన లక్ష్యాలను, ఆత్మస్థైర్యాన్ని నింపడంతో పాటు విద్యార్థుల్లో మానసిక పరివర్తనకు కోసం శరణి పొంగూరు నిర్విరామంగా కృషి చేస్తున్నారు. విద్యతో పాటు సైకాలజీ, న్యూరో లింగ్విస్టిక్ ప్రోగ్రామింగ్, పర్పస్‌డ్రివెన్ గోల్ సెట్టింగ్ వంటి అత్యాధునిక పద్ధతులను మిళితం చేస్తూ ఆమె అందిస్తున్న శిక్షణ విద్యార్థులలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోంది. కేవలం అకడమిక్ విజయాలే కాకుండా, విద్యార్థుల క్యారెక్టర్ బిల్డింగ్, హోలిస్టిక్ ఎడ్యుకేషన్ (సమగ్ర విద్య) పట్ల నారాయణ విద్యాసంస్థలకున్న అంకితభావాన్ని ఈ పురస్కారం ప్రతిబింబిస్తోంది.

ఈ సందర్భంగా శరణ్ నారాయణ మాట్లాడుతూ.. ఈ గుర్తింపు తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందని.. ప్రతి విద్యార్థిలోనూ అపారమైన ప్రతిభఉంటుందని.. వారు తమ కలలను నమ్మేలా చేసి, సరైన దిశానిర్దేశం చేసినప్పుడు అద్భుతమైన మార్పు సాధ్యమవుతుందన్నారు. ఈ అవార్డును కలల కోసం కష్టపడే ప్రతి విద్యార్థికి అంకితం చేస్తున్నానని, నారాయణ విద్యాసంస్థల్లో విద్యార్థుల కలలే తమ కలలని పేర్కొన్నారు. నారాయణ విద్యాసంస్థల్లో, ప్రతి విద్యార్థి సమగ్రాభివృద్ధి సాధించే విధంగా, విద్యార్థులు, తల్లిదండ్రుల అవసరాలకు తగినట్లుగా నేరుగా స్పందించే విధంగా ఫ్రేమ్ వర్క్, పాఠ్యప్రణాళికలను రూపొందించామన్నారు. 47 ఏళ్ల వారసత్వంతో, నారాయణ విద్యాసంస్థలు ఆసియాలో అతి పెద్ద విద్యాసంస్థలలో ఒకటిగా ఎదిగిందని, 900కి పైగా పాఠశాలలు, కళాశాలలు, కోచింగ్ సెంటర్లలో 6 లక్షలకుపైగా విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతోందిదన్నారు.



## రైలు కిందపడి ముగ్గురు బలవన్మరణం

### నగరంలో విషాదం

### మృతులు ఒకే కుటుంబీకులు

**హైదరాబాద్ (తార్నాక), జనవరి 31 ప్రభాతవార్త :** హైదరాబాద్ మహా నగరంలో హృదయవిదారక ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. శివారు ప్రాంతం బోడుప్పల్ ప్రాంతానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వారి ఆత్మహత్యలకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

తెల్లవారుజామున 2.30 గంటలల సమయంలో రైల్వేట్రాక్‌పై మూడు మృతదేహాలు పడి ఉండటాన్ని చూసిన గూడ్స్‌రైలు లోకోపైలెట్ వాకీటాకీ ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. చర్లపల్లి-ఘట్కేసర్ రైల్వేస్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఛిద్రమైన ముగ్గురి మృతదేహాలను స్వాధీ నం చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. భువనగిరి మండలం బొల్లెపల్లి గ్రామానికి చెందిన పి. సురేందర్‌రెడ్డి భార్య పిన్నింటి విజయశాంతి, కూతురు చేతనరెడ్డి, కుమారుడు విశాల్‌రెడ్డిగా గుర్తించారు.

విజయశాంతి కూతురు చేతనరెడ్డి ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతుండగా, కొడుకు విశాల్‌రెడ్డి ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. విజయశాంతి తన ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్ బోడుప్పల్ ఉంటుండగా ఆమె భర్త సురేం దర్‌రెడ్డి నెల్లూరులో ఉంటున్నాడు. ఈ మేరకు పోలీసులు మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం సికిందరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

**సుసైడ్ నోటు, కారును స్వాధీనం చేసుకున్న పోలీసులు**

చర్లపల్లి ఫ్యామిలీ సుసైడ్ కేసులో సుసైడ్ నోటు కీలకంగా మారనుంది. పోలీసులు విజయశాంతి రెడ్డి రాసిన సుసైడ్‌నోటుతో పాటు వారి వచ్చిన గ్రే కలర్ కారును స్వాధీనం చేసుకున్నారు. ఆత్మహత్యకు ముందు వారు స్టేషన్‌కు కారులో వచ్చి అక్కడే కారులో పార్కుచేసి సుసైడ్‌నోటును కారులో ఉంచి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

## క్రిటికల్ మినరల్స్‌లో సంయుక్త పరిశోధన

### మహీంద్రా 'వర్సిటీతో ఐఐటిహెచ్ ఒప్పందం

**హైదరాబాద్, జనవరి 31 ప్రభాతవార్త:** క్రిటికల్ మినరల్స్ రంగంలో సంయుక్త పరిశోధన, బోధన, శిక్షణ, ఆవిష్కరణల కోసం మహీంద్రా విశ్వవిద్యాలయానికి, సంగారెడ్డి జిల్లా కందిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ (ఐఐటీహెచ్) మధ్య ఒక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. క్రిటికల్ మినరల్స్, సస్టైనబుల్ మైనింగ్, అడ్వాన్స్‌డ్ ఇండస్ట్రియల్ ప్రాసెస్‌లపై ఈ రెండు సంస్థలు పరస్పరం సహకరించుకోనున్నాయి.

యూనివర్సిటీలోని ఇంటర్ డిసిప్లినరీ విద్యా విధానాన్ని, ఐఐటీహెచ్‌లోని అత్యాధునిక పరిశోధన పర్యావరణ వ్యవస్థతో సమన్వయం చేయడం ద్వారా దేశీయంగా క్రిటికల్ మినరల్స్ అన్వేషణ, ప్రాసెసింగ్ సామర్థ్యాలను పెంపొందించడం ఈ ఒప్పందం లక్ష్యమని ఐఐటీహెచ్ అధికారవర్గాలు వెల్లడించాయి. మైనింగ్ వ్యర్థాల వినియోగం, అరుదైన ఖనిజాల వెలికితీత, ప్రాసెస్ మోడలింగ్, సిమ్యులేషన్ వంటి కీలక రంగాల్లో రెండు సంస్థలు కలిసి పరిశోధనలు నిర్వహిస్తాయి. పరిశోధన ఫలితాలను పరిశ్రమలకు ఉపయోగపడే స్కేలబుల్ టెక్నాలజీలుగా మార్చడమే ఈ ఒప్పందం ప్రధాన ధ్యేయంగా చెబుతున్నారు. ఈ భాగస్వామ్యం జాతీయ క్రిటికల్ మినరల్ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా స్వదేశీ, స్థిరమైన సాంకేతిక పరిష్కారాలను ప్రోత్సహిస్తుందని విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ డా.యాజులు తెలిపారు. క్రిటికల్ మినరల్స్ రంగంలో భారతదేశ స్వావలంబనకు విద్యా సహకారం అవసర మని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి పేర్కొన్నారు.

**పోషకాహార పరిశోధనలపై హెచ్‌సియుతో ఎన్ఐఎన్ ఒప్పందం**

పోషకాహారం, ప్రజారోగ్య రంగాల్లో సరికొత్త పరిశోధనలకు నాంది పలకడమే లక్ష్యంగా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ), జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) శుక్రవారం ఎంవోయూ కుదుర్చుకున్నాయి. శుక్రవారం హెచ్‌సీయూలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ బీజే రావు, ఎన్ఐఎన్ డైరెక్టర్ భారతి పాల్గొన్నారు.

## 25 నుంచి మార్చి 14 వరకు వార్షిక పరీక్షలు

### మార్చి 1 నుంచే మూల్యాంకనం ప్రారంభం

# ఏప్రిల్ 4, 5 తేదీల్లో ఇంటర్ ఫలితాలు!

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ యేడాది ఇంటర్ వార్షిక పరీక్షల ఫలితాలను త్వరగా ఇవ్వాలని ఇంటర్ బోర్డు భావిస్తోంది. ఇంటర్ వార్షిక పరీక్షలు ముగియకముందే మూల్యాంకనాన్ని ప్రారంభించే ఇంటర్ బోర్డు ఏప్రిల్ 4, 5 తేదీల్లో ఫలితాలను వెల్లడించడానికి ప్రయత్నాలు చేస్తుంది. ఆ తరువాత మే నెలలోనే అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష లను నిర్వహించి నెలాఖరు నాటినికి ఆ ఫలితాలను కూడా ఇవ్వాలని ప్రణాళికను రూపొందించుకుంది. ఇందుకు సంబంధించిన ప్లాన్‌ను రూపొందించుకున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య శనివారం విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ చెప్పారు. ప్రతి ఏడాది ఇంటర్ పరీక్షలు పూర్త యిన తరువాత ఫలితాల కోసం విద్యార్థులు ఎదురు చూస్తున్నారని.. ఫలితాలను త్వరగా ఇస్తే విద్యార్థులు టెన్షన్ పడకుండా ఉంటారనే ఉద్దేశంతో తాము ఫలితాలను ఈ ఏడాది త్వరగా ఇవ్వడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిపారు. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 14 వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మార్చి 1 నుంచే మూల్యాంకనాన్ని ప్రారంభించేలా ప్రణాళికను సిద్ధం చేసుకున్నట్టు తెలిసింది. లాంగ్వేజెస్ పరీక్షలు ముగియగానే వెంటనే సంస్కృతం మూల్యాంకనాన్ని, తదుపరి ఇంగ్లీష్ మూల్యాంకనాన్ని ప్రారంభించడానికి ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. మార్చి నెలాఖరు నాటికే మూల్యాంకనాన్ని పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఏప్రిల్ 4, 5 తేదీల్లో వార్షిక పరీక్షల ఫలితాలను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఆ తరువాత ఏప్రిల్ నెలాఖరులో లేదా మే మొదటి వారంలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పూర్తి.. మే నెలాఖరు నాటికి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను కూడా విడుదల చేసేలా ప్లాన్ రూపొందించుకున్నట్టు తెలిపారు. జూన్ 1 నుంచే ఇంటర్ క్లాసులను ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రారంభించేలా ప్రణాళికను రూపొందించుకున్నట్టు చెప్పారు. వచ్చే ఏడాది నుంచి సైన్స్ విద్యార్థులు మొదటి సంవత్సరంలో కూడా ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన విధాననిర్ణయం కోసం ప్రభుత్వానిక ప్రతిపాదనలను సమర్పించగా ప్రభుత్వం ఆమోదం తెలిపిందని.. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు త్వరలో వెలువడే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం సైన్స్ విద్యార్థులకు 15 మార్కులకు ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన సిలబస్‌ను కూడా విద్యార్థులకు చెప్పనున్నట్టు తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో మరో 15 మార్కులకు ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిం చనున్నట్టు తెలిపారు. ఈ ఏడాది ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు 5.26 లక్షల మంది విద్యార్థులు హాజరుకానుండగా.. వచ్చే యేడాది ఇది రెండింతలు అయ్యే అవకాశం ఉందన్నారు.


వార్త, ఆదివారం 1, ఫిబ్రవరి 2026

# వనదేవతల చెంత భక్తజనకోటి

జి.గంగాధర్ రెడ్డి

మేడారం మహాజాతర ఉత్సవం ముగిసింది. అనుకున్నదాని కంటే అంచనాలను మించి భక్తులు తరలివచ్చారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచే కాకుండా పొరుగున ఉన్న నాలుగు రాష్ట్రాల నుంచి ప్రజలు తరలివచ్చారు. జాతర ప్రధాన ఘట్టం నాలుగు రోజులు మేడారం పరిసరాలు జనాలతో నిండిపోయాయి. ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరించినప్పటికీ ట్రాఫిక్ తిప్పలు తప్పలేదు. కేవలం రెండు కిలోమీటర్ల ప్రయాణానికి ఆరేడు గంటల సమయం పట్టింది. వరంగల్ నుంచి మేడారానికి వాహనాలు రావడానికి ఒక సందర్భంలో 8 గంటలు పైగా పట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. దీనితో భక్తులకు కొంత సౌకర్యం కలిగింది. అయితే అంచనాలకు మించి జనాలు తరలిరావడంతో అధికారులు, పోలీసులు చేతులెత్తేసిన పరిస్థితి కనిపించింది. అయితే జాతర ఆద్యాంతం పూర్తిగా గిరిజన సాంప్రదాయాల ప్రకారం కొనసాగింది. దేవతలను గద్దెమీదకు తీసుకురావడంతో పాటు నిష్క్రమించేదాకా భక్తి భావం కొనసాగింది. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సైతం ఆనందంతో తిరిగి వెళ్లారు. రికార్డు స్థాయిలో భక్తులు హాజరయ్యారయ్యారని అధికారులు ప్రకటించారు. దక్షిణ భారత కుంభ మేళాగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర వనదేవతల నామస్మరణతో అంగరంగ వైభవంగా కొనసాగింది. వన దేవత.. మన దేవత.. జన దేవత అంటూ అపార విశ్వాసంతో కోటి 50 లక్షలకు పైగా భక్తులు మేడారం అడవుల్లోకి వెళ్లారు. డోలు చప్పుళ్లు, కొమ్ము వాయిద్యాలు, ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు, శివసత్తుల పూనకాలతో మేడారం వనం మొత్తం భక్తి పారవశ్యంలో మునిగింది. బుధవారం కన్నెపల్లి నుంచి వచ్చిన సారలమ్మ మేడారంలోని గద్దెపై కొలువుదీరడంతో జాతరకు అధికారికంగా ఉత్సాహం వచ్చింది. ఆమెతో పాటు పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపై ప్రతిష్టించడంతో మేడారం జనసంద్రమైంది. కన్నెపల్లి నుంచి మేడారం వరకు నాలుగు కిలోమీటర్ల దూరం భక్తులతో నిండిపోయింది.

ఆదివాసీ పూజారులు కొమ్ముబూరలు ఊదుతూ, ప్రత్యేక డోలు వాయిద్యాలతో సారలమ్మను గద్దెలకు తీసుకువచ్చారు. మేడారం జాతరలో అత్యంత కీలక ఘట్టమైన సమ్మక్క తల్లి ఆగమనం గురువారం అర్ధరాత్రి జరిగింది. చిలుకలగుట్టనుంచి కుంకుమ భరణి రూపంలో సమ్మక్కను గిరిజన సంప్రదాయాల ప్రకారం గద్దెపైకి తీసుకొచ్చారు. ప్రభుత్వ లాంఛనాల మేరకు గాల్లోకి కాల్పులు జరిపి తల్లికి అధికారిక స్వాగతం



పలికారు. మాఘ శుద్ధ పౌర్ణమివేళ నిండు జాబిలిలా దర్శనం ఇచ్చిన సమ్మక్క తల్లి గద్దెపై కొలువుదీరడంతో మేడారం మహాజాతర పరిపూర్ణత సాధించింది. రూపమే లేని వనదేవతల ఈ అపూర్వ జాతరలో వెదురు కర్రలే దైవాలుగా, గద్దెలే గర్భగుడులుగా, పసుపు-కుంకుమలే వజ్రాభరణాలుగా మారాయి. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఆదివాసీ సంప్రదాయాలు ఈ జాతరలో జీవంతంగా దర్శనమిస్తున్నారు. వనదేవతల దర్శనానికి వచ్చిన భక్తులు జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెల ప్రాంగణం, క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. దర్శనానికి కొంత సమయం పడుతున్నా భక్తులు సహనంతో తల్లుల దర్శనం చేసుకుంటున్నారు. జాతరకు పటిష్ట బందోబస్తును జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ ఏర్పాటు చేశారు. మొత్తం 13 వేల మందికి పైగా పోలీసు సిబ్బంది, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, ఏఐ సాంకేతికత, డ్రోన్లతో భక్తుల రద్దీని నిరంతరం పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్ దివాకర ఆధ్వర్యంలో అన్ని శాఖలు సమన్వయం తో ఏర్పాట్లు చేశాయి. వైద్య బృందాలు, వాలంటీర్లు అప్రమ త్తంగా సేవలందిం చారు. వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి సుమారు 500 మంది ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు భక్తులకు సహాయం చేశారు. మహా జాతరలో సింగ రేణి రెస్క్యూ సేవలు ప్రత్యేకంగా చెప్పుకో వచ్చు. జాతరలో సింగరేణి రెస్క్యూ సిబ్బంది అద్భుతమైన సేవలు అందించారు. సుమారు 40 మంది సింగరేణి రెస్క్యూ సిబ్బంది మూడు బ్యాచులుగా విడిపోయి గద్దెల ప్రాంగణంలో భక్తులు విసిరిన కొబ్బరి చిప్పలు, బెల్లం ఉండలు తగిలిగాయాలపాలైన వారిని గద్దెల ప్రాంగణంలో అనారోగ్యంతో అస్వస్థతకు గురైన భక్తులకు సహాయక చర్యలు అందిస్తూ వారిని ఆసుపత్రికి అంబులెన్స్ వద్దకు తరలించగలిగారు. సింగరేణి రెస్క్యూ సిబ్బంది ప్రతి మేడారం జాతరకు సేవలు అందించడం అనవాయితీగా వస్తుందని రెస్క్యూ సిబ్బంది వారు తెలిపారు. భక్తులకు వినోదం పొందేందుకు సర్కస్, జాయింట్ వీల్స్, గేమ్స్ స్టాల్స్ ఏర్పాటుచేశారు. అమ్మవారి గద్దల నుండి జంపన్న వాగు వెళ్లే దారిలో అతి భారీ సర్కస్ విన్యాసాలు జాయింట్ వీల్స్ పిల్లల ఆటల పోటీలు నిర్వహించే తదితర స్టాల్స్ భక్తులను ప్రజలను పిల్లలను అమితంగా ఆకట్టుకున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సర్కస్ విన్యాసాలలో అమ్మవారి దర్శనం అనంతరం ఉపశమనం పొందారు. తప్పిపోయిన వారి కోసం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. జంపన్న వాగు ప్రాంతంలో స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిస్సింగ్ క్యాంపు ఏర్పాటుచేసి తప్పిపోయిన భక్తుల వివరాలను ఎప్పటికప్పుడు అనౌన్స్మెంట్ మైకు ద్వారా చేస్తూ 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటు సేవలు అందించారు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న (జోగిని) హిజ్రాలువనదేవతల జాతరలో హిజ్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. సమ్మక్క సారలమ్మల జాతర మొదలవగానే హిజ్రాలు వారి కుటుంబ సమేతంగా మేడారం చేరుకొని వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ సమ్మక్క తల్లిని ఆవాహన చేసుకుని కుటుంబ సభ్యులతో డప్పు చప్పుళ్ళనడుమ మట్టితో అమ్మవార్ల గద్దెలను ఏర్పాటు చేసి బంగారం (బెల్లం), మద్యం సమర్పించి కోళ్ళను, మేకలను బలి ఇస్తు అమ్మవార్లను పూజించారు. చిలకల గుట్ట నుండి సమ్మక్క రాక సందర్భంగా దారి వెంట రంగు రంగుల ముగ్గులు (పట్నాలు) వేసి అమ్మవార్లకు స్వాగతం పలుకుతారు. సమ్మక్క తల్లి గద్దెలకు చేరుకున్న తర్వాత ఒడి బియ్యం,బంగారం (బెల్లం) ,కొబ్బరి కాయలు సమర్పించారు, ఇలా మేడారం జాతరలో వన దేవతలకు పూజలు నిర్వహించడంవల్ల తాము కోరిన కోర్కెలు తీరుతాయని ప్రగాఢంగా విశ్వసిస్తుంటారు. జాతరలో నిరంతర విద్యుత్ సరఫరాలో విద్యుత్‌శాఖ ఏర్పాట్లు చేశారు. మిరుమిట్లు గొలిపేలా వెలుగుల మేడారంగా తీర్చిదిద్దిన ఎన్పీడీసీఎల్ .వెలుగుల జిగేల్ మనేలా తీరిచిద్దిన మేడారంకు అధికారులు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బంది నిత్యం 24/7 విధులు నిర్వహించారు. చీఫ్ ఇంజనీర్లు కె. రాజు చౌహాన్, ఆశోక్ పర్యవేక్షణలో నలుగురు సూపరిండెంట్ ఇంజనీర్లు, ఏడుగురు డివిజన్ ఇంజనీర్లు, 30 మంది అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, సబ్ ఇంజనీర్లు 150 నుండి 500 మంది ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఉద్యోగులు మూడు బ్యాచ్లో 30 మంది చొప్పున విధులు నిర్వహించారని చెప్పారు. శాశ్వత ప్రాతిపదికన జంపన వాగు ఇరువైపుల 6 టవర్లు ఏర్పాటు చేశారు. ●

గవర్నర్, కేంద్ర-రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు సమ్మక్క-సారలమ్మలను దర్శించి నిలువెత్తు బంగారం మొక్కులు సమర్పించారు. దేశం నలుమూలల నుంచే కాకుండా పలు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో మేడారం ప్రాంగణం సందడిగా మారింది. మేడారంలో రూ. 236.2 కోట్లతో ఫ్యూచర్ మాస్టర్ ప్లాన్. గద్దెల అభివృద్ధికి రూ. 58.2 కోట్లు గద్దెల వద్ద కళాకృతి పనులకు రూ. 6.8 కోట్లు జంపన్న వాగు అభివృద్ధి కోసం రూ.39 కోట్లు.భక్తుల అకామిడేషన్ నిమిత్తం రూ.50 కోట్లు రోడ్ల అభివృద్ధి నిమిత్తం రూ. 52.5 కోట్లు మిగతావి ఇతరత్రా ఖర్చుల నిమిత్తం కేటాయించారు. వీటిలో ప్రస్తుతం ఖర్చు చేసినవి 101 కోట్లు మాత్రమే.. ప్రధాన రహదారుల విస్తరణకు ఆర్అండ్‌బీ శాఖకు రూ.9.95 కోట్లు. మేడారంతో పాటు పరిసర గ్రామాల్లో ప్రధాన, అంతర్గత మార్గాల విస్తరణకు పంచాయతీరాజ్ శాఖకు రూ.51.30 కోట్లు. తాగునీటి సరఫరాలో ,డైరెక్ట్ పంపింగ్ ద్వారా శుద్ధ జలాలు అందజేయడానికి రూ.5 కోట్లు. జాతర పరిసరాల్లో టన్నుల కొద్దీ వ్యర్థాలు సేకరణకు వందల సంఖ్యలో యంత్రాలు, వేల సంఖ్యలో కూలీలు, పనిముట్లు, రసాయనాలు,జాతరను ఏకో ఫ్రెండ్లీ తరహాలో నిర్వహించేందుకు జిల్లా పంచాయతీ శాఖకి రూ.11.62 కోట్లు. అగ్నిమాపక, గిరిజన సంక్షేమం, మత్స్య, సమాచార, పశు సంవర్ధక, వైద్యఆరోగ్యం, అటవీ, రెవెన్యూ, దేవాదాయ, పర్యాటక,ఎన్పీడీసీఎల్, ఆబ్కారీ, ఆర్టీసీలకు రూ.33.01 కోట్లు. మేడారం మహా జాతరకు కేంద్రం కేటాయించిన నిధులు రూ. 3.70 కోట్లు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు. ములుగు,లక్నవరం, మేడవరం, తాడ్వాయి, బొగత జలపాతం ప్రాంతాల పర్యాటక అభివృద్ధికి ..80 కోట్లు. రామప్ప దేవాలయ అభివృద్ధికి ..140 కోట్లు కేటాయించారు.

---

స్మృతి

మహారాష్ట్ర

# విలీనమా! విభేదమా?

ఎ.వి.వి ప్రసాద్

హఠాత్తుగా జరిగే కొన్ని సంఘటనలు కొన్ని అనూహ్య పరిణామాలకు దారితీస్తుంటాయి. మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగాఉన్న ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ గత బుధవారం విమాన ప్రమాదంలో హఠాత్తుగా మరణించడంతో తర్వాత పార్టీలోను, మహాయుతి కూటమిలోను అనేక పరిణామాలు తొంగిచూశాయి. ఎన్నెన్నో ఊహాగానాలు చక్కర్లు కొట్టాయి. పినతండ్రి, మరాఠా 'స్ట్రాంగ్ మాన్' శరద్ పవార్ అడుగుజాడల్లో రాజకీయ జీవితం ఆరంభించినా, తర్వాత సొంత మార్గంలో ఎదిగి, ఎన్సీపీలో సైతం చీలిక తెచ్చి, తన వర్గమే అసలు పార్టీ అనే గుర్తింపు కూడా పొందిన నేతగా అజిత్ పవార్‌కు రాష్ట్రంలో అనితరసాధ్యమైన ఫాలోయింగ్ ఉందనే చెప్పాలి. వ్యూహరచనా నైపుణ్యం, రాజకీయ చాతుర్యం ఆయనలో కొంచెం ఎక్కువ పాళ్లలోనే కనిపిస్తాయి. 2023లో శరద్ పవార్‌తో విడిపోయి ఎన్సీపీలో చీలిక తెచ్చినా, పినతండ్రికి ఇవ్వాల్సిన గౌరవం ఇస్తూనే వచ్చారు. అందుకే ఇటీవల స్థానిక ఎన్నికల్లో మళ్లీ కొన్ని స్థానాల్లో రెండు వర్గాలు ఒకే బాటలో నడిచే వ్యూహం రూపొందించి అద్భుత ఫలితాలు సాధించాయి. 1991 నుంచి ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా గెలిచి, ఆరుసార్లు డిప్యూటీ సీఎం బాధ్యతలు నిర్వహించిన అజిత్ పవార్‌కు సిఎం కావాలన్నదొక్కటే లక్ష్యం. అందుకు తగినట్లుగానే ఆయన పావులు కదుపుతూ వచ్చినా, రెండుసార్లు సిఎం పదవి దగ్గరగా వచ్చి జారిపోవడంతో, ఈసారి ఏ రాజకీయ పరిణామాలు సంభవించినా తనదే సిఎం పీఠమనే ధీమాతో ఉన్నారు. అయితే కాలం వక్రీకరించి ఆయన కనుమరుగవడంతో రాజ్యసభ సభ్యురాలైన ఆయన సతీమణి సునేత్రను డి.సిఎం పదవి వరించింది. కానీ అనేక రాజకీయ పరిణామాలు అక్కడే తెరలేస్తున్నాయి. అజిత్ హఠాన్మరణంతో ఎన్సీపీ రెండు వర్గాలు విలీనమవుతాయనే ఊహాగానాలు తొలుత మొదలయ్యాయి. అందుకు బలమైన కారణమే ఉంది. సంక్రాంతి రోజున జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్సీపీ రెండు వర్గాలు రెండు మూడు చోట్ల కలిసి పోటీ చేయడంతో, తర్వాత కాలంలో అవి పూర్తిగా విలీనం కావొచ్చనే అభిప్రాయం వినిపించింది. అజిత్ హఠాన్మరణానంతరం కూడా శరద్ నాయకత్వంలోని ఎన్సీపీతో అజిత్ వర్గం విలీనం తథ్యమనేమాటే వినిపించింది కానీ వెంట వెంటనే జరిగిన కొన్ని పరిణామాలు సునేత్ర డిసిఎం పదవి అంగీకరించడానికి దారితీశాయి. దీనితో రెండు వర్గాల విలీనం ఇప్పట్లో సాధ్యంకాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మహాయుతి ప్రభుత్వంలో అజిత్ ఎన్సీపీకి 41మంది ఎమ్మెల్యేలున్నారు. అయితే వారికి ఉన్న ఓట్ల శాతం 9.1 మాత్రమే. శరద్ ఎన్సీపీకి 10సీట్లు మాత్రమేఉన్నా, ఓట్ల శాతం 11.28ఉంది. అంటే విలీనం జరిగితే ఓట్లశాతం 20 దాటుతుంది. బిజెపి (26.7 శాతం) తర్వాత రాష్ట్రంలో అతి పెద్దపార్టీగా సమైక్య ఎన్సీపీ ఆవిర్భవిస్తుంది. అలా జరిగితే శరద్ పవార్‌కు రాష్ట్రంలోనేగాక జాతీయ



సునేత్ర పవార్

స్థాయిలో మళ్లీచక్రం తిప్పే అవకాశం లభిస్తుంది. వార్ధక్యం కారణంగా రాజకీయాల్లో శరద్ మునుపటిలా క్రియాశీలక పాత్రపోషించలేక పోయినా, ఆయన వ్యూహ రచన బలమైన శక్తిగా పరిణమిస్తుంది. ఆ ప్రమాదం పసిగట్టిన బిజెపి అజిత్ సంతాప దినాలు కూడా పూర్తికాకుండానేపావులు కదిపి సునేత్రను డిప్యూటీ సీఎం పదవికి ఒప్పించగలిగింది. ఈవిషయంలో సిఎం ఫడ్నవీస్‌చొరవ తీసుకుని సునేత్రతో చర్చించి ఒప్పించినట్లు చెబుతున్నారు. అజిత్ పెద్ద కుమారుడైన పార్థ్ పవార్ శరద్‌తో సన్నిహితంగా ఉండడమేగాక విలీనం పట్ల మొగ్గు చూపారనీ, అది నచ్చని ఫడ్నవీస్ పార్థ్‌తో కూడా ఏకాంతంగా చర్చలు జరిపి రాజ్యసభకు పంపు తానని హామీఇచ్చారనీ తెలుస్తోంది. ఇటీవల అజిత్ మళ్లీ శరద్‌వైపు మొగ్గు చూపడంతో పార్థ్ కూడా అటే అడుగులు వేశారు. ఇప్పుడు అజిత్ లేకపో వడంతో ఆ వర్గాన్ని తమ గుప్పెట్లో ఉంచుకోవడానికి ఫడ్నవీస్ తక్షణమే పావులు కదిపిడిప్యూటీ సీఎం, రాజ్యసభ సీటు తాయిలాలు అందించినట్లు చెబుతున్నారు. సునేత్రతో ఫడ్నవీస్ జరిపిన ఆంతరంగిక చర్చలు శరద్‌కు తెలియవనీ, బిజెపి నేతలు ఆయనతో ఎలాంటి సంప్రదింపులుజరపలేదనీ తెలుస్తోంది. రెండువర్గాల విలీనం జరిగితే తాను కీలక పాత్ర పోషించాలని సుప్రియాసూలె భావించినట్లుగా చెబుతున్నారు. అజిత్ వర్గంలో ఆయన తర్వాత ప్రఫుల్ పటేల్,సునీల్ తత్కరే, భుజబల్,ధనుంజయ్ ముండే కీలకపాత్రలు పోషిస్తున్నారు. వీరిలో భుజబల్ ఫడ్నవీస్ తో కూడా సన్నిహితంగా ఉంటారనీ,సునేత్రను డి.సిఎంపదవికి ఒప్పించడంలో ఆయన ముఖ్య పాత్రవహించారనీ అంటున్నారు. ఫడ్నవిస్ కేబినెట్‌లో అజిత్ గాక మరో ఎనిమిది మంది ఎన్సీపీ మంత్రులు ఉన్నారు. వారందరు కూడా సునేత్రకు మద్దతు ప్రకటించినట్లు సమాచారం. అయితే మహాయుతి కూటమిలోని షిండే శివసేనలో కొందరు అజిత్ వర్గానికి లభిస్తున్న ప్రాధాన్యతను వ్యతిరేకిస్తున్నారు. కీలకమైన శాఖలు కూడా అజిత్ మంత్రుల వద్దే ఉన్నాయనీ, వాటిలో కొన్ని తాము కోరినా ఫడ్నవీస్ తిరస్కరించారనీ వారుఆరోపిస్తున్నారు. షిండే శివసేనకు 12.3 శాతం ఓట్లతో 57 సీట్ల బలం ఉంది. ఆ పార్టీ కూడా మహాయుతిలో కీలకమే. కానీ ఫడ్నవీస్ వైఖరితో షిండే గ్రూపు ఇటీవల పక్క చూపులు చూస్తోంది. ఆ విషయం తెలియడంవల్లే అజిత్ వర్గానికి తిరిగి అదేప్రాధాన్యం కొనసాగించాలని ఫడ్నవీస్ నిర్ణయించారనీ, అందుకే సునేత్రకు తక్షణమే డి.సిఎం పదవి ఇచ్చారనీ అంటున్నారు. బిజెపి వ్యూహం పటిష్టంగానే ఉన్నా, దీనివల్ల ముందు ముందు కొత్త సమీకరణాలు మొదలు కావచ్చనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. ఈ పరిస్థితిలో శరద్‌పవార్ ఎటువంటి వ్యూహం అనుసరిస్తారోచూడాలి. ఎన్నికల రాజకీయాల్లోకి సునేత్ర ప్రవేశం2024లోనే. ఎన్సీపీ రెండువర్గాల విలీనానికి ఆమె ప్రయత్నిస్తారో, లేక అజిత్ వర్గాన్ని మరింత పటిష్టం చేయడంపైనే దృష్టి కేంద్రీకరిస్తారో చూడాలి. ●

---

స్మృతి

బ్రిటన్

# జిన్‌పింగ్‌తో దోస్తీకి అగ్రదేశాల తహతహ!

గన్ని మోహన్

ప్రపంచదేశాలతో ట్రంప్ అనుసరిస్తున్న ధోరణి మిత్రదేశాలకు సైతం చిరాకు రప్పిస్తోంది. మిత్రులు, శత్రువులు అని చూడకుండా అందరిపైనా సుంకాలు అంటూ భారీ ఎత్తున విరుచుకుపడటం, వలసల కట్టడి పేరిట విదేశీపౌరులను అక్రమ నిర్బంధాలకు గురిచేయడం వారిని ఖైదీల తరహాలో చూడటం వంటి సంఘటనలు బ్రిటన్, ఫ్రాన్స్ వంటి అగ్రరాజ్యాలకుసైతం రుచించడంలేదు. అలాగే వెనిజులాపై సైనిక చర్యతోపాటు ఇరాన్ పై యుద్ధానికి కాలుదువ్వుతున్న ట్రంప్ వైఖరికి చెక్‌పెట్టేందుకు ప్రపంచదేశాలు సిద్ధం అవుతున్నాయి. ప్రత్యేకించి నాటో మిత్రదేశాలపై విధిస్తున్న సుంకాలు ససేమిరా వాటికి మింగుడు పడటం లేదు. ఈక్రమంలోనే ఈదేశాలన్నీ చైనాకు చేరువవుతున్నాయి. గ్రీన్‌ల్యాండ్స్ విషయంలో ముందు నుంచి ట్రంప్‌తో విభేదిస్తున్న బ్రిటన్ చైనాకు దగ్గరవుతున్నట్లుకనిపిస్తోంది. బ్రిటన్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ప్రీమియర్ లీఖ్వియాంగ్‌లతో భేటీకావడం, చైనా బిజినెస్ ఫోరమ్‌తో సదస్సులో పాల్గొనడంవంటి సంఘటనలు ఇందుకు మద్దతిస్తున్నాయి. ఇప్పటికే ఫ్రాన్స్, కెనడా, ఫిన్‌ల్యాండ్ వంటి దేశాలు చైనాలో పర్యటించి పలు ఒప్పందాలు కూడా చేసుకున్నాయి. తాజాగా బ్రిటన్ కూడాచైనాతో చేతులు కలపడం అమెరికాకు సుతరాము నచ్చడంలేదు. ఇది అత్యంత ప్రమాదకరమని చెప్పుకుంటూ వస్తున్న అమెరికా మాత్రం తనవైఖరి మార్చుకోవడం లేదు. గడచిన ఎనిమిదేళ్లలో ఒక బ్రిటన్ ప్రధాన మంత్రి చైనాలో పర్యటించడం ఇదే మొదటిసారి. అమెరికాను కాదని ప్రపంచదేశాల్లో నెగ్గు కు వస్తున్న చైనా ఇపుడు అమెరికా శత్రు దేశాలన్నింటినీ ఏకంచేస్తోంది. ఇందులో భాగంగానే బ్రిక్స్ సదస్సుల్లో కానీ, షాంఘై సహకార సంస్థ సమావేశాల్లోకానీ అమెరికాను విభేదించే దేశాలను కలుపుకుంటూవస్తోంది. ప్రపంచ వేదికపై చైనా కీలకభూమిక పోషి స్తోంతదని, విభేదాలు ఉన్నప్పటికీ సమస్యలు చర్చించడం అత్యంతముఖ్యమనే భావిస్తున్నట్లు కీర్‌స్టార్మర్ పేర్కొనడం చైనాతో సత్సంబంధాలనే కోరుకుంటున్నట్లు తెలుస్తోంది. ఓపక్కఉక్రెయిన్ పైయుద్ధంలో చైనా రష్యాకు మద్దతిస్తున్న సంగతి తెలిసిందే. మరోపక్కయూరో పియన్ దేశాలు బ్రిటన్ సహా అన్నీకూడా ఉక్రెయిన్‌కు బాసటగా నిలిచాయి. ఈ తరుణంలో ఒక పాశ్చాత్య దేశం అధినేత చైనాలోపర్యటించి ద్వైపాక్షిక భేటీ జరపడం ప్రపంచ దేశాలనుఆలో చింపచేస్తోంది. కెనడాను తీసిపారేసినట్లు చూస్తూ అమెరికాలో ఒక రాష్ట్రంగా పరిగణిస్తామని దావోస్ సదస్సులో ట్రంప్ వెల్లడించడాన్ని కెనడా తీవ్రం గావ్యతిరేకించింది. అలాగే గ్రీన్‌ల్యాండ్ ఎప్పటికైనా మాదేనని స్వాధీనం తప్పదని చెప్పిన ట్రంప్ నిర్ణయాన్ని యూరోప్ దేశాలు ముక్తకంఠంతో ఖండించాయి. ఎట్టి పరిస్థితుల్లోను జరగనీయమని తెగేసి చెప్పాయి. బ్రిటన్ కూడా చైనాతో సత్సంబంధాలకు ఉవ్విళ్లూరుతోంది. సుమారు పదికిపైగా ఒప్పందాలు చేసుకుంది. వ్యవస్థీకృత



కీర్ స్టార్మర్

నేరాల కట్టడి, అక్రమ వలసలపై సహకారం, ద్వైపాక్షిక సేవల భాగస్వామ్యం, యుకె నుంచి చైనాకు ఎగుమతులు, ఆరోగ్య సహకారం, జంతువులుమొక్కల మార్పిడి, అక్రమ నిర్బంధాలు వంటి వాటితోపాటు 30రోజులపాటు పర్యటించే విధంగా ఉచిత వీసాపర్యటనలు వంటి ఒప్పందాలు చేసుకున్న స్టార్మర్ సుమారు 50 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు జరిగాయని అంచనా. అంతేకాకుండా స్టార్మర్ చైనా ఆర్థిక హబ్‌గా భావించే షాంఘై నగరంలోనూ పర్యటించి అటుగా ఆసియా పర్యటనలో భాగంగా జపాన్ లో కూడా కొద్దిసమయం గడిపి ఆదేశ ప్రధాని సానైయి తకాయిచితో చర్చలు జరిపారు. చైనాయే కాకుండా బ్రిటన్‌తో పాటు మొత్తం 50 దేశాలు ఇలా30రోజుల ఉచిత పర్యటనలకు అనుమతిస్తున్నాయి. వీటిలో ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా, జపాన్ వంటివి కూడా ఉన్నాయి. ఈ దేశాలు కూడా చైనాతో ఈఒప్పందాలు చేసుకున్నాయి. భేటీలో చైనా కూడా బ్రిటన్ విస్కీపై సుంకాలను ఐదు శాతానికి తగ్గించేందుకు ముందుకువచ్చింది. ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి ఉద్రిక్తపరిస్థితుల్లో రెండు దేశాల మధ్య సామరస్య పూర్వక చర్చలు జరగడంమంచి పరిణామంగా చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ కూడా పేర్కొనడం బ్రిటన్‌తో చైనా కూడా జట్టుకట్టేందుకు ఉత్సాహపడుతోందని స్పష్టం అవుతోంది. యూరోప్ నుంచి విడిపోయినతర్వాత బ్రిటన్ ఆర్థికవృద్ధికి చైనా వంటి దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలు ఎంతో ఉపకరిస్తాయని బ్రిటన్ భావిస్తోంది. అంతే కాకుండా అమెరికా అనుసరిస్తున్న ఏకపక్ష విధానాలు, ట్రంప్‌లో పెరుగుతున్న దురాక్రమణ కాంక్షలకు చెక్‌పెట్టేందుకు చైనావంటి దేశాలతో దోస్తీ ఎంతో కలిసి వస్తుందని బ్రిటన్ ప్రధాని భావిస్తున్నారు. అందుకోసమే ద్వైపాక్షిక చర్చల పేరిట చైనాలో ఏకంగా నాలుగురోజులు పర్యటించి అమెరికాలో గుబులును మరింత పెంచారు. పనిలోపనిగా చైనాలో పెట్టుబడులను తమ దేశానికి ఆకర్షించడంతోపాటు బ్రిటన్‌ఫార్మా సంస్థలు కూడా చైనాలో పెట్టుబడులకు ముందుకు వచ్చేవిధంగా కీర్‌స్టార్మర్ కృషి చేసారు. ఇందులో భాగంగానే బ్రిటన్ అతిపెద్ద ఫార్మా కంపెనీ ఆస్ట్రాజెనెకా 15 బిలియన్ డాలర్ల మేర చైనాలో పెట్టుబడులు పెడతామని ప్రకటించింది. ఔషధ తయారీ, పరిశోధన అభివృద్ధిరంగాల్లోనే 2030 వరకూ పెట్టుబడులు కొనసాగిస్తామని బ్రిటన్ ప్రధానివెంట వెళ్లిన కంపెనీచీఫ్ పాస్కల్ సోరియట్ జిన్‌పింగ్ సమక్షంలో ప్రకటించడం వంటి పరిణామాలు చూస్తుంటే చైనా అటు యూరోప్, ఆసియా దేశాలు మరీముఖ్యంగా అమెరికాను వ్యతిరేకిస్తున్న రాజ్యాలకు అత్యంత మిత్రదేశంగా కనిపిస్తోంది. బ్రిటన్, ఫ్రాన్స్, కెనడాలతోపాటు ఇప్పుడు మరికొన్ని దేశాలు కూడా చైనాలో హడావిడి పర్యటనలు ఏర్పాటుచేసుకుని ఆదేశ అధినేతలను కలిసి మైత్రీబంధం కొనసాగించేందుకు తహతహలాడుతున్నాయంటే అది కేవలం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏకపక్ష పోకడలేనని నిస్సందేహంగా చెప్పగలం. ●

---

# ఉమ్మడి పౌరస్మృతితో సమతా భారత్

నేదునూరి కనకయ్య

స్వాతంత్ర్యం వచ్చిన తొలిరోజుల నుండి నేటి వరకు ఉమ్మడి పౌరస్మృతి పై చర్చలు వాదనలు కొనసాగుతున్నాయి. సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి వల్ల దేశంలోని సంస్థానాలు విలీనమై భారతదేశం ఒకదేశంగా అవతరించినప్పటికీ దేశంలో ఉన్న విభిన్న మతాల మధ్య చట్టాలు ఒకే రకంగా లేవు. ఉమ్మడి పౌరస్మృతిపై రాజకీయ పార్టీలు మత ఛాందసవాదులు గొంతు చించుకోవడం అలవాటైంది. ప్రజలందరిది రక్తం ఒకటే అంటున్న కమ్యూనిస్టులు సైతం దంద్వ విధానాన్ని అవలంబిస్తున్నారు. సమాజంలోని దురాచారాలను నిర్మూలించడంలో భాగంగా ఉమ్మడి పౌరస్మృతిని జాతీయ అవసరంగా భారత్ ప్రభుత్వం గుర్తించింది. ప్రపంచంలో చోటు చేసుకుంటున్న ఆధునిక సాంకేతిక సమాచార రంగాల్లో వస్తున్న మార్పుల్లో భాగంగా ఆధునికత వైపు సమాజం పయనించడానికి అడ్డంకిగా ఉన్న చట్టాలను సంస్కరించవలసిన అవసరం ఉంది. సమాజానికి దురాచారంగా పరిణమించిన సతీసహగమనం బాల్య వివాహాల రద్దు చట్టాలను అమలు చేయడం జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా సామాజికంగా గుణాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అందుకు అనుకూలంగా చట్టంలో మార్పులు సంస్కరణలను స్వాగతించాలి. ఉమ్మడి పౌరస్మృతి అంటే దేశమంతటికి పౌరులందరికీ ఒకేచట్టం అమలు చేయడం ఉమ్మడి పౌరస్మృతిలో ప్రజలను మతాలపరంగా చూడకుండా స్త్రీ పిల్లల హక్కుల గురించి ఆలోచించడం. ఏ మతాన్ని డామినేట్ చేయడం కాదు. ముస్లిం సమాజంలో స్త్రీలకు పిల్లలకు సమాన హక్కులు కల్పించవలసిన అవసరంఉంది. మతం ముసుగులో మహిళా హక్కులకు భంగం వాటిల్లుతుంది. వాటిని అరికట్టడమే ఉమ్మడి పౌరస్మృతి లక్ష్యం. ఇస్లాం, క్రిస్టియన్ జుడాయిజం దేశంలోకి వచ్చినప్పుడు వ్యతిరేకించలేదు. దేశంలో అన్ని మతాలు సహజీవనం చేసే సంస్కృతి నెలకొంది. విభిన్నమతాలకు సాంప్రదాయాలకు అతీతంగా భారత భూభాగంలో ఉన్న పౌరులందరికీ ఒకే చట్టాన్ని వర్తింపజేయడం. భారతదేశం విభిన్నతకు విభిన్న సంస్కృతులకు నిలయం. పలు రాష్ట్రాలలో ప్రాంతాలలో వివిధ మతాలలో వివాహాలు విడాకులు పిల్లల దత్తత జీవన భృతికి సంబంధించిన చట్టాలు ఒకేవిధంగా లేవు. మతాన్ని బట్టి ఆచారాల ప్రకారం వేరువేరుగా ఉన్నాయి. దేశంలో అనేక మతాలు ఉన్నాయి. అనేక చట్టాలు ఉన్నాయి. హిందువు వివాహ చట్టం హిందూవారసత్వ చట్టం క్రిస్టియన్ మ్యారేజ్ యాక్ట్ ఇండియన్ డైవర్స్ యాక్ట్ పార్సీ మ్యారేజ్ అండ్ డైవర్స్ యాక్ట్ అమల్లో ఉన్నాయి. ముస్లిం పర్సనల్ చట్టాలను క్రోడీకరించలేదు. మత గ్రంథాలే వారికి ఆధారం. క్రిమినల్ సివిల్ చట్టాలు వేర్వేరుగా ఉన్నాయి. దేశంలో నివసించే ప్రజలు స్త్రీ, పురుష లింగ భేదం లేకుండా పౌరు లందరికీ ఒకే చట్టం వర్తింపజేయడం ఉమ్మడి పౌరస్మృతి ఉద్దేశం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి నేటి వరకు ఉమ్మడి పౌరస్మృతి డిమాండ్ కొనసాగుతూనే ఉంది. రాజ్యాంగంలో 44 ఆర్టికల్ ప్రకారం ఆదేశిక సూత్రాల్లో పేర్కొన్నట్లు దేశ ప్రజలందరికి ఎలాంటి వివక్ష లేకుండా ఒకే చట్టం వర్తించాలి. దేశంలో హిందూ వివాహచట్టం ముస్లిం వివాహ చట్టం షరియా లాంటి ముస్లిం చట్టాలు అమల్లో ఉన్నాయి. దేశ ప్రజలందరికీ ఒకే చట్టం ఉండాలి అన్నవాదనని ముస్లింలు వ్యతిరేకిస్తున్నారు. అనేక దేశాల్లో ఉమ్మడి చట్టాలు అమల్లో ఉన్నాయి. ఫ్రాన్స్ జర్మనీ, చైనా, యుకె దేశాల్లో మతాల ప్రాతిపదికన చట్టాలు లేవు. ఈజిప్ట్ మొరాకోటరీ ముస్లిం దేశాలలో అల్పసంఖ్యాకులకు వేరే చట్టాలు లేవు. కేంద్ర ప్రభుత్వం 2019లో ట్రిపుల్ తలాక్ ను నేరంగా పరిగణిస్తూ చట్టంచేసింది. వేరువేరు చట్టాలు ఉండడం వల్ల రాజ్యాంగం ముందు అందరూ సమానులే అన్న స్ఫూర్తికి విఘాతం కలుగుతుందని అనేక తీర్పులో సుప్రీం కోర్టు ఉమ్మడి పౌరస్మృతి ప్రాధాన్యతను పేర్కొంది. ఇటీవల కాలంలో భారత దేశ లా కమిషన్ దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఉమ్మడి పౌరస్మృతి అవసరం గురించి నొక్కి వ్యాఖ్యానించడం గమనార్హం. ఉమ్మడి పౌరస్మృతి పట్ల రాజ్యాంగ సభలో



దీర్ఘస్థాయి చర్చలు జరిగాయి. ఇప్ప టికీ మేధావులు న్యాయ కోవిదులు సామాజిక వేత్తలు పలు సందర్భాలలో ఉమ్మడి పౌరస్మృతీ మీద చర్చలు జరు పుతున్నారు. పలు సందర్భాలలో సుప్రీమ్ కోర్టు ఉమ్మడి పౌరస్మృతి ఆవశ్యత గురించి వ్యాఖ్యానించింది. సాంఘిక న్యాయం ఉమ్మడి పౌరస్మృతి. ఉమ్మడి పౌరస్మృతి అమలు వల్ల సామాజిక సమత సాంఘిక న్యాయం స్త్రీ, పురుష సమానత్వ సాధన సాంఘిక దురాచారాల నిర్మూలన అభ్యు దయ సమాజ నిర్మాణం సామాజికంగా గుణాత్మక మార్పుల కొరకు పౌరస్మృతి అవసరాన్ని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రతిపాదించారు. రాజ్యాంగ నిర్మాణ సభలో ఉమ్మడి పౌరస్మృతి మీద సుదీర్ఘ చర్చలు జరిగాయి. అంబేద్కర్ కె ఎం మున్షి అల్లాడి కృష్ణస్వామి ఉమ్మడి పౌరస్మృతిని సమర్థించారు. మతాలు ఏకీకృత చట్టం పరిధిలోకి వస్తాయి. రాజ్యాంగ సూత్రాలకు అనుగుణంగా సుప్రీమ్ కోర్ట్ తీర్పులను ప్రతిబింబించే విధంగా దేశంలోని ప్రజలను విభిన్న మతాలను ఏకీకృత చట్టపరిధిలోకి తీసుకు వచ్చే ప్రయత్నమే ఉమ్మడి పౌరస్మృతి భారతగణతంత్ర దేశంలో దేశమంతటకి వర్తించే ఒకే రాజ్యాంగం ఒకేప్రధాన మంత్రి ఒకే రాష్ట్ర పతాకం (జాతీయ పతాకం) ఉన్నట్లుగా వివిధ మతాలకు ప్రాంతాలతో సంబంధం లేని ఉమ్మడి పౌరస్మృతి ఉండాలని మన రాజ్యాంగం నాల్గవ భాగం ఆదేశిక సూత్రాల్లో 44వ అధికరణంలో పేర్కొన్నారు. భారత దేశంలో నీ అన్ని ప్రాంతాల పౌరులందరికీ వర్తించేఏకరూప పౌరస్మృతి అవసరాన్ని పేర్కొన్నారు. ఒకే దేశం, ఒకే ప్రజ, ఒకే చట్టం, అనే లక్ష్యంతో విభిన్న మతాలు, విభిన్న సంస్కృతులు విభిన్న ఆచారాలు, నెలకొన్న సమాజంలో పౌరులందరికీ రాజ్యాంగం ఎలాంటి వివక్ష లేకుండా ప్రాథమిక హక్కులు స్వేచ్ఛలను ప్రసాదించింది. దేశంలోని వివిధ వర్గాలకు పౌరులకు వేరు వేరు చట్టాలు వుండకూడదని దేశ ప్రధాన మంత్రి ఆక్షేపణ చేస్తూ దేశ ప్రజలందరికీ వర్తించే ఉమ్మడి పౌరస్మృతి అవసరాన్ని వివిధ వేదికల మీద ప్రస్తావించడం గమనార్హం. ఉమ్మడి పౌరస్మృతి చట్టరూపంలో తేవడానికి అనేక చిక్కులు ఎదురవుతున్నాయి. కొన్ని మత సమూహాల నుండి వ్యతిరేకత దేశ సమైక్యత సమగ్రత ఏకాత్మత సమన్యాయం లింగ సమానత్వం కుటుంబ వ్యవస్థ స్థిరత్వం కోరేవారిలో కాలయాపన చేయకుండా చట్టం చేయాలన్న వాదనలు చర్చలు జోరందుకున్నాయి. ఉమ్మడి పౌరస్మృతి బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాణ సభలో ఉమ్మడి పౌరస్మృతి మీద చర్చ జరిగినప్పుడు బాబాసాహెబ్ అంబేద్కర్ మాట్లాడుతూమనిషి జీవితం ప్రతిఅంశాన్ని ఆక్రమించే విధంగా మతానికి విస్తృత అధికారం దాఖలుపరిచారు. మతంస్థానంలో శాసనాధికారం వుండాలి. భారత రాజ్యాంగం ద్వారా సంక్రమించిన స్వేచ్ఛ ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా అసమానతలు వివక్షల నుండి విముక్తి కలిగించడానికి సామాజిక వ్యవస్థను సంస్కరించడానికి స్వేచ్ఛ అనిస్పష్టం చేశాడు. ఉమ్మడి పౌరస్మృతి అమలు వల్ల దేశంలోని వివిధ మతాలలో ఉన్నచట్టాలలోని లోపాలను తొలిగించి జాతిసమైక్యత సమగ్రతకు దోహదం చేస్తుంది. దేశంలోని క్రిమినల్ సివిల్ చట్టాలు అందరికీ వర్తిస్తాయి. దేశ ప్రజలందరికీ ఒకేచట్టం వర్తిస్తుంది. హిందూ, ముస్లిం, క్రిస్టియన్, జైన్, సిక్కు మొన్నగు మతాల్లో ఉన్న వ్యక్తిగత చట్టాలను అనుమతించరు. బహుభార్యత్వం రద్దు అవుతుంది. ప్రజల్లో జాతీయభావం పెరుగుతుంది. కులం, మతం వర్గం స్త్రీ పురుషలింగ భేదాలకు అతీతంగా దేశంలోని పౌరులందరికీ సమాన హోదా వస్తుంది. ఆడ మగ సమానమే. లింగసమానత్వం సాధ్యమవుతుంది. ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగలక్ష్యం ఉమ్మడి పౌరస్మృతి అమలు ద్వారా నెరవేరుతాయి. భారత ప్రజాస్వామ్య దేశం కాబట్టి అందరికీ సమాన హక్కులు ఉంటాయి. వివిధమతాల వ్యక్తిగత చట్టాలు రద్దవుతాయి. సమ భావన ఉమ్మడి పౌరస్మృతి ప్రజలంతా ఒకటే. ప్రజలందరికి ఒకే చట్టం అన్న సమ భావన ఉమ్మడి పౌరస్మృతిద్వారా సాధ్యమౌతుంది. ఉమ్మడి పౌరస్మృతి అమలుతో దేశఐక్యత సామాజిక అభివృద్ధిగుణాత్మక మార్పులతో దేశం ప్రగతిపథంలో పయనిస్తుందని ఆశిద్దాం. ●

# మహారాష్ట్ర డిసిఎంగా సునేత్ర పవార్


## లోక్‌భవన్‌లో ప్రమాణం చేసిన అజిత్ సతీమణి



**ముంబయి, జనవరి 31:** మహారాష్ట్రలో తొలి మహిళా ఉప ముఖ్యమంత్రిగా 62 ఏళ్ల సునేత్రా పవార్ ప్రమాణం చేశారు. మహారాష్ట్ర గవర్నర్ ఆచార్య దేవవ్రత్ సునేత్రా పవార్ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. బారామతిలో జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మృతి చెందడంతో ఆయన భార్య సునేత్రా పవార్ మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. వారి కుమారుడు పార్థ్ పవార్‌కు రాజ్యసభ సీటు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కాగాప్రమాణస్వీకార కార్యక్రమంలో సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌తోపాటు డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్‌షిండే, ఇతర కేబినెట్ సహచర మంత్రులు, ఎన్సీపీ నేతలు పలువురు పాల్గొన్నారు. రాజ్‌భవన్‌లో నిరాడంబరంగా సునేత్ర ప్రమాణ స్వీకారం జరిగింది. అయితే అజిత్‌పవార్ నిర్వహించిన శాఖలే ఆమెకు ఇస్తారా లేక ఇతర శాఖలు ఏవైనా ఇస్తారా అన్నది రెండురోజుల్లో నిర్ధారణ అవుతుందని పార్టీనేతలు చెపుతున్నారు. అజిత్ పవార్ రాజకీయ వారసురాలిగా ఆమెను నిలబెట్టడం ద్వారా పార్టీపై పట్టు సాధించాలని ఎన్సీపీ వర్గం భావిస్తోంది. అదే సమయంలో శరద్ పవార్ వర్గంతో విలీనంపై చర్చలు కూడా కొనసాగుతుండటం గమనార్హం. ఎన్సీపీ శాసన సభాపక్ష నేతగా సునేత్రా పవార్‌ను ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ సీనియర్ నేత ఛగన్ భుజబల్ సునేత్రా పవార్ పేరును ప్రతిపాదించగా ఇతర ఎమ్మెల్యేలు మద్దతు ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సిఫార్సు మేరకు గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సునేత్రా పవార్‌కు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. బారామతిలో బుధవారం జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ సహా మొత్తం ఐదుగురు మరణించిన సంగతి తెలిసిందే. ఈ విషాద సమయంలోనే ఎన్సీపీ పగ్గాలు చేపట్టాలని సునేత్రా పవార్‌ను ఆ పార్టీ వర్గాలు ఒప్పించాయి. ఎన్సీపీలో శరద్ పవార్ ఆధిపత్యాన్ని అడ్డుకోవాలంటే అజిత్ పవార్ రాజకీయ వారసురాలిగా సునేత్రా పవార్‌ను నిలబెట్టాలని అజిత్ పవార్ ఎన్సీపీ నేతలు ఈ నిర్ణయం తీసుకున్నారు. విడిపోయిన ఎన్సీపీ రెండు వర్గాలు తిరిగి విలీనం అవుతాయని దీనికి సంబంధించిన చర్చలు జరుగుతున్నాయని ఇప్పటికే శరద్ పవార్ తేల్చి చెప్పారు. జయంత్ పాటిల్, అజిత్ పవార్ మధ్య ఇప్పటికే డిసెంబర్, జనవరి నెలల్లో చర్చలు జరిగాయని.. ఫిబ్రవరిలో విలీన ప్రక్రియ ఉండగా ఈ విషాధం చోటు చేసుకున్నట్లు తెలిపారు. సునేత్రా పవార్‌ను మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా నియమిస్తున్నారన్న వార్తలపై స్పందించిన శరద్ పవార్ తనకు ఈ విషయం తెలియదని స్పష్టం చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల వరకు సునేత్రా పవార్ ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండేవారు. ఆ ఎన్నికల్లో బారామతి లోక్‌సభ నియోజకవర్గం నుంచి తన వదిన సుప్రియా సూలేపై పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత ఆమె ఎన్సీపీ తరఫున రాజ్య సభకు ఎన్నికయ్యారు. ఇప్పటివరకు రాజ్యసభ ఎంపీగా ఉన్న సునేత్రా పవార్ అజిత్ పవార్ అకాల మరణంతో నేరుగా మహారాష్ట్ర ప్రభుత్వంలో కీలక బాధ్యతలు చేపట్టారు.

**విలీనమే అజిత్‌పవార్ చివరి కోరిక: శరద్ పవార్**

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా అజిత్ పవార్ భార్య సునేత్రా పవార్ ఈ రోజు ప్రమాణ స్వీకారంపై శరద్ పవార్ స్పందించారు. ఈ విషయం తనకు తెలియదని, తనతో ఎవరూ చర్చించలేదని వివరించారు. ఈ రోజు ఉదయం న్యూస్ పేపర్ల ద్వారా అజిత్ పవార్ కూటమి సభ్యులు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారనే విషయం మాత్రమే తనకు తెలిసిందన్నారు. ఆ పార్టీ తరఫున సీనియర్ నేతలు ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కారే ప్రభుత్వంతో చర్చలు జరిపినట్లు తెలిసిందన్నారు. బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వంలో చేరాలని సునేత్రా పవార్ నిర్ణయించుకున్నట్లు తమ కుటుంబానికి తెలియదని శరద్ పవార్ పేర్కొన్నారు. ఎన్సీపీ రెండు కూటములు ఒక్కటవ్వాలన్నదే అజిత్ పవార్ కోరిక అని శరద్ పవార్ తెలిపారు. ఈ విషయంపై నాలుగు నెలలుగా అజిత్ పవార్, శశికాంత్ షిండే, జయంత్ పాటిల్ చర్చలు జరిపారని, రెండు వర్గాల



విలీనానికి ఫిబ్రవరి 12వ తేదీని ఫిక్స్ చేశామని కూడా చెప్పారు. అయితే, ఈలోపు దురదృష్టవశాత్తూ అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మరణించారని చెప్పారు. దీంతో విలీన చర్చలకు బ్రేక్ పడిందని వివరించారు. అజిత్ పవార్ చివరి కోరిక నెరవేరాలని తమ కుటుంబం కోరుకుంటోందని శరద్ పవార్ తెలిపారు.

# మమత ప్రభుత్వ అవినీతివల్లే ఆనంద్‌పూర్ విషాదం



కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ధ్వజం

**కోల్‌కత్తా,జనవరి 31:** పశ్చిమ బెంగాల్‌లోని ఆనందపూర్‌వద్ద గోదాముల్లో జరిగిన భయంకర అగ్ని ప్రమాదంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు. మమతా బెనర్జీ ప్రభుత్వ అవినీతి వల్లే ఈ విషాదం జరిగిందని, పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి నిందితులను జైలుకు పంపాలని ఆయన డిమాండ్ చేశారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో అమిత్ షా మాట్లాడుతూ ఆనందపూర్‌లోని మోమో ఫ్యాక్టరీలో జరిగిన అగ్నిప్రమాదం విషాదకరం. ఇది ప్రమాదం కాదు మమతా బెనర్జీ ప్రభుత్వ అవినీతి దీనికి కారణం. మోమో ఫ్యాక్టరీలో ఎవరి డబ్బు పెట్టారు యజమాని ఎవరితో విదేశీ ఫ్లైట్‌లో వెళ్లాడు ఎందుకు అరెస్ట్‌చేయలేదు అని ప్రశ్నించారు. అగ్నిప్రమాదం జరిగి 32గంటల తర్వాత మంత్రి స్థలానికి చేరుకున్నారని, కార్మికులు అరుస్తుంటే ప్రభుత్వం నిశ్శబ్దంగా ఉందని ఆయన మండిపడ్డారు. ఈ అగ్నిప్రమాదం మీ పార్టీ అవినీతిని చూపిస్తోందని అమిత్‌షా ఆరోపించారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పూర్తి దర్యాప్తుకు ఆదేశించి నిందితులను జైలుకుపంపాలని డిమాండ్ చేశారు. ఆనందపూర్‌లోని డెకరేటర్ గోదాములో మొదలైన మంటలు సమీపంలోని మోమో గోదాముకు వ్యాపించాయి. 12,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ గోదాములో ప్యాకేజింగ్ మెటీరియల్, బెవరేజెస్,ఇతర సామాన్లు నిల్వఉన్నాయి. అగ్ని ప్రమాదం సమయంలో చాలా మంది కార్మికులు నిద్రపోయి ఉండటంతో వారు తప్పించుకోలేక పోయారు. మరణాల సంఖ్య 21కి చేరుకుంది. ఇంకా శవాలు శిథిలాల కింద ఉండవచ్చని అధికారులు చెబుతున్నారు.పోలీసులు 16 మంది బంధువుల నుంచి డీఎన్ఏ శాంపిల్స్ సేకరించారు. అనేకమంది కుటుంబ సభ్యులు తమ వారు ఇంకా శిథిలాల కింద ఉన్నారేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, గోదాములో ఫైర్ సేఫ్టీ గైడ్‌లైన్స్ ఎలా ఉన్నాయి అనే అంశంపై కూడా దర్యాప్తు జరుగుతోంది. ఈ ఘటన రాజకీయ రంగు పులుముకుంది. ప్రతిపక్ష నేత సువేందు అధికారి ఘటనా స్థలానికి వెళ్లి నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీనే ఈ విషాదానికి బాధ్యులని ఆయన ఆరోపించారు.

## సత్వర న్యాయానికి న్యాయమూర్తుల కొరత

### ప్రతి పదిలక్షల జనాభాకు కేవలం 22 మందే జడ్జిలు

**న్యూఢిల్లీ, జనవరి 31:** భారత న్యాయ వ్యవస్థ తీవ్ర ఒత్తిళ్లను ఎదుర్కొంటోంది. దేశంలో ప్రతీ 10 లక్షల మందికి కేవలం 22 మంది న్యాయమూర్తులు ఉన్నారు. న్యాయ మంత్రిత్వ శాఖ ప్రకారం, ఉండాల్సిన సంఖ్య కన్నా ఇది తక్కువ. సకాలంలో న్యాయం జరగాలంటే జనాభాకు తగినంత మంది జడ్జీలు లేరని ఇప్పటికే పలు పర్యాయాలు న్యాయమూర్తుల నుంచే నివేదికలు వచ్చాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం, 2026 నాటికి ఉండాల్సిన న్యాయమూర్తుల సంఖ్యను పరిగణలోకి తీసుకుని లెక్కించినట్లు కేంద్రం తెలిపింది. అధికారిక వివరాల ప్రకారం, సుప్రీంకోర్టులో మొత్తం 34 మంది న్యాయమూర్తులకు గానూ ప్రస్తుతం 33 మంది మాత్రమే ఉన్నారు. హైకోర్టులో 1122 మంది న్యాయమూర్తులు ఉండాలి, కానీ ప్రస్తుతం 814 మంది మాత్రమే పనిచేస్తున్నారు. అత్యధిక కేసులు జిల్లా, దిగువ కోర్టుల్లోనే ఉన్నాయి. ఈ కోర్టుల్లో 20,833 మంది న్యాయమూర్తులు పనిచేస్తున్నారు. అయినా పెండింగ్ కేసులు తగ్గించడానికి ఈ సంఖ్య సరిపోవడం లేదని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ప్రధాన కోర్టుల్లో గణనీయంగా న్యాయమూర్తుల కొరత ఉంది. లా కమిషన్ ఆఫ్ ఇండియా తన 120వ నివేదికలో ప్రతీ 10 లక్షల మందికి 50 మంది న్యాయమూర్తులు ఉండాలని సూచించింది. ఈ సంఖ్యలో సగం కూడా ప్రస్తుతం లేరు. కోర్టులపై ఉన్న ఒత్తిడి జైళ్లలో కనిపిస్తోంది. నేషనల్ క్రైమ్ బ్యూరో ప్రకారం, 2023 నాటికి 3,89,910 మంది అండర్ ట్రయల్ ఖైదీలు జైళ్లలో ఉన్నారు. సత్వర న్యాయం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టింది. కోర్టుల మౌలిక సదుపాయాలను మెరుగుపరడచంతో పాటు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆర్థిక సహకారంతో పాటు పారదర్శకతను మెరుగుపరచడానికి ఈకోర్టులు మిషన్ మోడ్ ప్రాజెక్ట్ ద్వారా టెక్నాలజీని తీసుకువస్తోంది.

# భారత్‌లోనే ఎస్‌యు-57ఇ ఫైటర్ జెట్ తయారీ

## భారత్-రష్యా మధ్య కొనసాగుతున్న చర్చలు

**న్యూఢిల్లీ, జనవరి 31:** భారత్ అత్యాధునిక 5వ జనరేషన్ స్టెల్త్ ఫైటర్ జెట్ తయారీకి సిద్ధమవుతోంది. భారత్-రష్యాలు కలిసి భారత్‌లోనే ఎస్‌యు-57ఇ ఫైటర్ జెట్ ఉత్పత్తి కోసం చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇదే నిజమైతే పాకిస్థాన్, చైనాలకు భయం మొదలు కావల్సిందే. ఈ చర్చలు ఫలితాలను ఇస్తే, భారత్ 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి మరింత బలం చేకూరుతుంది. రక్షణ రంగంలో స్వావలంబన ఏర్పడుతుంది. ఇదే సమయంలో భారత్ స్వదేశీ టెక్నాలజీతో తయారు చేసుకుంటున్న 5వ తరం యుద్ధవిమానం ఎఎంసిఎకు మద్దతు లభిస్తుంది. అయితే, ఈ చర్చలపై రష్యా నుంచి బలమైన సంకేతాలు ఉన్నప్పటికీ, న్యూఢిల్లీ ఇంకా దీనిపై అధికారికంగా స్పందించలేదు.

**ఎస్‌యు-57ఇ ఫైటర్ జెట్:** ఎస్‌యు-57ఇ ఫైటర్ జెట్ రష్యా తయారీ ఫిఫ్త్ జనరేషన్ ఫైటర్ జెట్. ఇది ఎగుమతి వేరియంట్. శత్రుదేశాల



రాడార్‌లకు చిక్కకుండా దాడి చేసే సామర్థ్యం ఉంది. సూపర్ క్రూయిజ్ ఎబిలిటీ, అధునాతన ఏవియానిక్స్, సెన్సార్‌ఫ్యూర్,లాంగ్ రేంజ్ ఎయిర్‌టు ఎయిర్, ఎయిర్ టూ గ్రౌండ్ ఆయుధాలతో దాడి చేసే సామర్థ్యం కలిగి ఉంది. దీంతో పాటు చైనీస్, అమెరికన 5వతరం యుద్ధ విమానాలతో పోలిస్తే తక్కువ నిర్మాణ ఖర్చు దీని ప్రత్యేకత.

**ఉమ్మడి తయారీ:** సుఖోయ్ ఎస్‌యు-57 భారత్‌లో సంయుక్తంగా తయారు చేసే అంశంపై భారత్-రష్యా మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయని రష్యా ఏరోస్పేస్ రంగానికి చెందిన ఉన్నతాధికారులు తెలిపారు. రష్యా యునైటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్ (యుఎసి) కూడా ఈ విషయాన్ని వెల్లడించింది. ఎగుమతి వేరియంట్‌ను భారత్‌లో లైసెన్స్ ఆధారంగా తయారుచేయడం ఒక ఛాయిస్ అని యుఎసి సిఇఒ వాదిమ్ బడేఖా తెలిపారు. ఎస్‌యు-57 యుద్ధవిమానాలను ప్రస్తుతం ఇండియాలో ఎస్‌యు-30 ఎంకెలు తయారుచేస్తున్న ఫెసిలిటీల్లోనే ఉత్పత్తి చేసే అవకాశం పరిశీలనలో ఉంది. తయారీలో భారత పరిశ్రమల భాగస్వామ్యం, స్వదేశీ వ్యవస్థల వినియోగం కీలకంగా ఉండే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే, రష్యా ప్రభుత్వ ఆయుధ ఎగుమతిదారు రోసోబోరోనెక్స్‌పోర్ట్ కూడా భారత్‌కు ఎస్‌యు-57 యుద్ధ విమానాల సరఫరాతో పాటు దేశీయంగా ఉత్పత్తి చేసే ప్రతిపాదన చేసినట్లు రష్యన్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. భారత్ స్వతహాగా అభివృద్ధి చేస్తున్న అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎఎంసిఎ) ప్రోగ్రామ్‌కు సాంకేతిక సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కూడా పేర్కొంది. ఎఎంసిఎ 2030 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే, ఈ మధ్యకాలంలో వైమానిక బలోపేతానికి 5వ తరం యుద్ధ విమానాలు చాలా కీలకంగా మారాయి.

# పన్నేతర ఆదాయంలో 40%వరకూ వడ్డీలకే..

## అప్పుల ఊబినుంచి బయటకురాలేని రాష్ట్రాలు ఎక్కువే

**ముంబయి,జనవరి 31:** భారత ఆర్థికవ్యవస్థ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ వంటిసంస్థలు ప్రశంసలు కురిపిస్తుంటే దేశంలోని అనేక రాష్ట్రాలు తీవ్రమైన అప్పులఊబిలో చిక్కుకుంటున్నాయి. భారత రిజర్వ్‌బ్యాంకు (ఆర్బీఐ) విడుదల చేసిన 2025 ఆర్థిక సంవత్సర గణాంకాలు ఈ ఆందోళనకర నిజాలను వెలుగులోకి తీసుకొచ్చాయి. సెంట్రల్ బ్యాంకు డేటా ప్రకారం, దేశంలోని కొన్ని పెద్ద రాష్ట్రాలు తమ పన్ను మరియు పన్నేతర ఆదాయంలో 40 శాతం వరకు కేవలం రుణాలపై వడ్డీ చెల్లింపులకే ఖర్చు చేస్తున్నాయి. దీనివల్ల అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, విద్య వంటి కీలక రంగాలకు సరిపడా నిధులు కేటాయించలేని పరిస్థితి ఏర్పడుతోంది.




అప్పుల భారంతో అత్యధిక ఒత్తిడిని ఎదుర్కొంటున్న రాష్ట్రాల జాబితాలో పశ్చిమ బెంగాల్ మొదటి స్థానంలో నిలిచింది. 2025 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం సుమారు రూ.1.09 లక్షల కోట్ల ఆదాయం పొందగా, అందులో రూ.45 వేల కోట్లకు పైగా వడ్డీ చెల్లింపులకే వెచ్చించాల్సి వచ్చింది. అంటే మొత్తం ఆదాయంలో దాదాపు 42 శాతం వడ్డీకే వెళ్లిపోయింది. ఇక, రెండో స్థానంలో ఉన్న పంజాబ్ తన ఆదాయంలో 34 శాతం వడ్డీ చెల్లింపులకే ఖర్చు చేసింది. రూ.70 వేలుకోట్ల ఆదాయంలో సుమారు రూ.24 వేల కోట్లు వడ్డీగా చెల్లించింది. ఆ తర్వాత బీహార్ మూడో స్థానంలో నిలిచింది. రాష్ట్రం సంపాదించిన రూ.62వేల కోట్ల ఆదాయంలో సుమారు రూ.21వేల కోట్లు వడ్డీ చెల్లింపులకు వెళ్లాయి.ఇది మొత్తం ఆదాయంలో 33 శాతం. నాలుగో స్థానంలో ఉన్న కేరళ 2025 ఆర్థిక సంవత్సరంలో రూ.1.03 లక్షల కోట్ల ఆదాయం పొందగా, దాదాపు 28 శాతం అంటే సుమారు రూ.29 వేల కోట్లు వడ్డీ చెల్లింపులకే ఖర్చు చేసింది. ఆ తర్వాత ఐదో స్థానంలో ఉన్న తమిళనాడు, అధిక పన్ను ఆదాయం ఉన్న రాష్ట్రాల్లో ఒకటైనా, అప్పుల భారంతోనే కొనసాగుతోంది. రాష్ట్రం తన ఆదాయంలో సుమారు 28 శాతం లేదా రూ.62 వేల కోట్లు వడ్డీగా చెల్లించింది. టాప్ 10 అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాల జాబితాలో హర్యానా, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ కూడా ఉన్నాయి.హర్యానా తన రూ.94 వేల కోట్ల ఆదాయంలో దాదాపు 27శాతం అంటే రూ.25వేల కోట్లు వడ్డీ చెల్లింపులకే ఖర్చు చేసింది. రాజస్థాన్ రూ.1.48 లక్షలకోట్ల ఆదాయంలో సుమారు రూ.38వేల కోట్లు వడ్డీగా చెల్లించి ఏడవ స్థానం లో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా తీవ్ర అప్పుల ఒత్తిడిని ఎదుర్కొంటోంది. 2025 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం సుమారు రూ.1.2 లక్షల కోట్ల ఆదాయం పొందగా, అందులోదాదాపు రూ.29వేల కోట్లు వడ్డీ చెల్లింపులకే వెచ్చించింది. ఇక మధ్యప్రదేశ్ తొమ్మిదో స్థానంలో నిలిచింది.2025లో రూ.1.23లక్షలకోట్ల ఆదాయం పొందగా, అందులో సుమారు రూ.27వేల కోట్లు వడ్డీ చెల్లింపులకే వెళ్లాయి. పదో స్థానంలో ఉన్న కర్ణాటక రూ.2.03 ట్రిలియన్ల ఆదాయం పొందినా, దాదాపు 19శాతం అంటే రూ.39వేల కోట్లు వడ్డీ చెల్లింపులకే ఖర్చు చేసిందని ఆర్బీఐ గణాంకాలు స్పష్టంచేసాయి. రాష్ట్రాల ఆదా యంలో ఇంత పెద్ద మొత్తంలో వడ్డీ చెల్లింపులు జరగడం వల్ల కొత్తరహదారులు, పాఠశాలలు, ఆసు పత్రులు, సంక్షేమపథకాలు వంటి అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత ఏర్పడుతోంది. ఆర్థిక క్రమశిక్షణ, ఆదాయ వనరుల విస్తరణ మరియు ఖర్చుల నియంత్రణ లేకపోతే ఈ అప్పుల భారం భవిష్యత్తులో మరింత తీవ్రంఅవుతుందని రాష్ట్రాల పాలకులుగుర్తించాలని ఆర్బీఐ హెచ్చరిస్తోంది.

## సౌదీ, ఇజ్రాయెల్‌కు భారీ ఆయుధ విక్రయాలు

# 15.6 బిలియన్ డాలర్లతో అమెరికా ఒప్పందం

**వాషింగ్టన్,జనవరి 31:** ఇజ్రాయెల్, సౌదీ అరేబియా దేశాలకు అమెరికా సుమారు 15.6 బిలియన్ల విలువైన భారీ ఆయుధాల విక్రయాలకు ఆమోదం తెలిపింది. ఇరాన్ నుండి ఎదురవుతున్న ముప్పును అడ్డుకోవడం, ప్రాంతీయ భద్రతను పటిష్టం చేయడం ఈ ఒప్పందాల ప్రధాన ఉద్దేశ్యంగా ఉంది. ఈ మేరకు ఇజ్రాయెల్‌కు 6.7 బిలియన్లు, సౌదీకి 9 బిలియన్ల పిఎసి-3 క్షిపణి నిరోధకాలను విక్రయించేందుకు అమెరికా ఆమోదం తెలిపింది. ఈ విక్రయాలు ప్రాంతీయ భద్రతలో కీలకమైన మార్పులకు దారితీయనున్నాయి. ఇజ్రాయెల్ కోసం నాలుగు విదేశీ సైనిక విక్రయ ఒప్పందాలు జరిగాయి. 3.8 బిలియన్ల 30 ఎహెచ్-64ని అపాచీ హెలికాప్టర్లు, 1.98 బిలియన్ల 3,250 జాయింట్ లైట్ టాక్టికల్ వాహనాలు, 740 మిలియన్ల నామెర్ ఆర్మర్డ్ పర్సనల్ క్యారియర్ పవర్ ప్యాక్‌లు, 150 మిలియన్ల అంచనాతో తేలికపాటి యుటిలిటీ హెలికాప్టర్లు. అలాగే సౌదీఅరేబియాకు 9బిలియన్ల 730 పిఎసి-3 క్షిపణి నిరోధకాలు,అనుబంధ పరికరాలు విక్రయించనున్నారు. ఈనెలలో లాక్ హీడ్, పెంటగాన్ 2030 చివరినాటికి పిఎసి-3 ఉత్పత్తిని సంవత్సరానికి మూడురెట్లు పెంచే ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ విస్తరణ సౌదీ ఒప్పం దానికి మరింత ఊతమిస్తుంది. ప్రతిపాదిత ఒప్పందం సౌదీ అరేబియా ప్రస్తుత, భవిష్యత్ ముప్పులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని మెరుగు పరుస్తుంది.



అమెరికాను కుదిపేస్తున్న

# ఎప్‌స్టీన్ ఫైళ్లు

## తాజాగా మరికొందరి పేర్లు బహిర్గతం

**వాషింగ్టన్,జనవరి 31:** అమెరికాను కుదిపేస్తున్న ఎప్ స్టీన్ ఫైల్స్ లో తాజాగా మరికొందరి పేర్లు బయటపడ్డాయి. డిపార్ట్ మెంట్ ఆఫ్ జస్టిస్ 2 వేల వీడియోలు, 1.8 లక్షల ఫొటోలు సహా మొత్తం 30లక్షలకు పైగా డాక్యుమెంట్లను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులోని ఓ ఈ-మెయిల్ లో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2009లో అమేలియా సినిమా రిలీజ్ సందర్భంగా జరిగిన ఓ పార్టీలో ఆ సినిమా దర్శకురాలు, న్యూయార్క్ ప్రస్తుత మేయర్ జొహ్రాన్ మందానీ తల్లి మీరా నాయర్ కూడా పాల్గొన్నారని ఓ ఈ-మెయిల్ వెల్లడించింది. ఈ పార్టీని ట్రాఫికింగ్ కేసులో దోషిగా తేలిన గిస్లెయిన్ మాక్స్ వెల్ తన నివాసంలో ఏర్పాటు చేసినట్లు వెల్లడైంది. ఈ పార్టీకి హాజరైన పెగ్గీ సీగల్ 2009 అక్టోబర్ 21న జెఫ్రీ ఎప్ స్టీన్ కు ఓ ఈ-మెయిల్ పంపారు. మాక్స్ వెల్ నివాసంలో జరిగిన పార్టీ నుంచి ఇప్పుడే బయటకు వచ్చాను. అమేలియా సినిమా రిలీజ్ సందర్భంగా మాక్స్ వెల్ తన ఇంట్లో ఈ పార్టీ ఏర్పాటు చేశారు. మాజీ ప్రెసిడెంట్ బిల్ క్లింటన్, అమెజాన్ సీఈవో జెఫ్ బెజోస్, జియాన్ పిగొని, డైరెక్టర్ మీరా నాయర్ తదితరులు ఈ పార్టీకి హాజరయ్యారు. సినిమా పెద్దగా ఆకట్టుకునేలా లేదని అతిథులు అభిప్రాయపడ్డారు. మహిళలను మాత్రం ఈ సినిమా చాలా ఆకట్టుకుంది అంటూ పెగ్గీ సీగల్ పలు వివరాలను ఇందులో పేర్కొన్నాడు. అమెరికా అధ్యక్షుడు దొనాల్డ్ ట్రంప్, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, బ్రిటిష్ బిలియనీర్ రిచర్డ్ బ్రాన్సన్, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్‌తో పాటు పలువురు ప్రముఖుల పేర్లు ప్రస్తావనకు వచ్చాయి. అయితే, ఈ ఫైల్స్‌లో పేర్లు ఉన్నంత మాత్రాన వీరిపై ఎలాంటి నేరారోపణలు మోపలేదని అధికారులు స్పష్టం చేశారు.రష్యన్ అమ్మాయిలతో గడిపిన తర్వాత ఎదురైన పరిణామాలను ఎదుర్కోవడానికి, వివాహిత మహిళలతో అక్రమ సంబంధాలు కొనసాగించడానికి తాను బిల్‌గేట్స్‌కు సహాయం చేసానని, గేట్స్‌కు ఎస్‌టిడిలు సంక్రమించాయని ఎప్‌స్టీన్ అందులో పేర్కొన్నాడు. బ్రిటన్ రాజకుటుంబానికి చెందిన ప్రిన్స్ ఆండ్రూ, బకింగ్‌హామ్ ప్యాలెస్‌కు విందుకు రావాలని, 'ప్రైవేట్ టైమ్' గడుపుదామని ఎప్‌స్టీన్‌ను ఆహ్వానించినట్లు ఈమెయిల్స్ ద్వారా తెలిసింది. ట్రంప్ కేబినెట్‌లో వాణిజ్య కార్యదర్శిగా ఉన్న హోవార్డ్ లుట్నిక్, నిర్మాత స్టీవ్ టిష్ వంటి ప్రముఖులు ఎప్‌స్టీన్‌తో సంబంధాలు కలిగి ఉన్నట్లు ఈ పత్రాలు వెల్లడిస్తున్నాయి. మొత్తం మీద ఈ కొత్త ఫైల్స్, ఎప్‌స్టీన్ నెట్‌వర్క్‌లో ఉన్న శక్తిమంతమైన వ్యక్తుల సంబంధాలపై మరోసారి ప్రపంచవ్యాప్తంగా చర్చను రేకెత్తించాయి.

# ఆర్థికవ్యవస్థలకు తీవ్రనష్టంచేస్తున్న ఉచితాలు

## ఆర్థిక సర్వే హెచ్చరికలు



**న్యూఢిల్లీ,జనవరి 31:** ఓట్ల వేటలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాలు విచ్చలవిడిగా ప్రకటిస్తున్న ఉచిత పథకాలు దేశ ఆర్థిక వ్యవస్థను అప్పుల ఊబిలోకి నెడుతున్నాయని ఆర్థిక సర్వే 2025-26 హెచ్చరికలు చేసింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఈ నివేదికలో నిబంధనలు లేని నగదు బదిలీ పథకాల కోసం రాష్ట్రాలు చేస్తున్న ఖర్చు గత మూడేళ్లలో ఐదు రెట్లు పెరిగి, ఈ ఏడాది రూ. 1.7 లక్షల కోట్లకు చేరుకుంది. ఈ భారీ వ్యయం వల్ల రాష్ట్రాల ఆదాయంలో దాదాపు 62 శాతం కేవలం జీతాలు, పెన్షన్లు, వడ్డీలు, ఉచితాలకే సరిపోతోంది. ఫలితంగా రోడ్లు, రైల్వేలు, ఆసుపత్రులు, విద్యా సంస్థల వంటి మౌలిక సదుపాయాల కల్పనకు వెచ్చించాల్సిన మూలధన వ్యయం దారుణంగా తగ్గిపోతోందని సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. ఇలా అప్పులు చేసి మరీ వినియోగం కోసం ఖర్చు చేయడం వల్ల దీర్ఘకాలంలో రాష్ట్రాలు దివాలా తీసే ప్రమాదం ఉందని, కేవలం నగదును చేతిలో పెట్టడం వల్ల పేదరికం తగ్గడం లేదని నివేదిక స్పష్టం చేసింది. ఈ ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు బ్రెజిల్‌లో విజయవంతమైన బోల్సా ఫ్యామిలియా తరహా విధానాన్ని అనుసరించాలని ఆర్థిక సర్వే సూచించింది. కేవలం ఉచితంగా డబ్బులు ఇవ్వకుండా, దానికి కొన్ని నిబంధనలను జోడించాలని పేర్కొంది. ఉదాహరణకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం పొందే కుటుంబాలు తమ పిల్లలను ఖచ్చితంగా బడికి పంపడం, సకాలంలో టీకాలు వేయించడం వంటి సామాజిక బాధ్యతలను నెరవేర్చాలి. అంతేకాకుండా, ప్రతి పథకానికి ఒక సన్‌సెట్ క్లాజ్(ముగింపు గడువు) ఉండాలని, ప్రజలు ఎప్పటికీ ప్రభుత్వంపైనే ఆధారపడకుండా వారిని స్వయం సమృద్ధి దిశగా నడిపించేలా పథకాల రూపకల్పన ఉండాలని సర్వే ప్రతిపాదించింది. ముఖ్యంగా మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు రాష్ట్రాలు పోటీ పడి మరీ ఇస్తున్న నగదు బదిలీలు, వారు తిరిగి ఉపాధి రంగంలోకి రాకుండా అడ్డుకుంటున్నాయని, ఇది దేశ ఉత్పాదకతపై ప్రభావం చూపుతోందని నివేదిక పేర్కొంది. సంక్షేమం అనేది ఒక భద్రతా వలయంగా ఉండాలి తప్ప, అది అభివృద్ధికి ఆటంకం కాకూడదని ఆర్థిక సర్వే గట్టిగా నొక్కి చెప్పింది.

# సంక్షిప్తంగా..

## కాఫీ షాపులపై దాడులకు ఎర్రకోట ఉగ్ర ముఠా కుట్రలు



**న్యూఢిల్లీ, జనవరి 31:** ఢిల్లీలో పేలుడు కేసును దర్యాప్తు చేసే కొద్దీ వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ పన్నిన అనేక కుట్రలు బయటపడుతున్నాయి. ఈ కేసుకు సంబంధించిన మరిన్ని విషయా లను దర్యాప్తు అధికారులు తాజాగా వెల్లడించారు. ఈ దాడికి పాల్పడిన వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ ప్రఖ్యాత కాఫీ చైన్లను లక్ష్యంగా చేసుకున్నట్లు విచారణలో వెల్లడయిందన్నారు. భారత్‌లోని ప్రధాన నగరాల్లో ఉన్న ఓ ప్రఖ్యాత కాఫీ చైన్‌లలో ఉగ్రదాడులకు నింది తులు ప్రణాళికలు సిద్ధం చేశారని పేర్కొన్నారు. తాము అదుపులోకి తీసుకున్న వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ నాలుగేళ్లుగా చురుగ్గా ఉందని అధికారులు తెలిపారు. నాటి నుంచి వారు ఉగ్రదాడులకు కుట్ర పన్నుతూ భారీ స్థాయిలో పేలుడు పదార్థాలను తయారుచేస్తున్నారన్నారు. విదేశీ ఆయుధాలను కూడా నిందితులు కొనుగోలు చేశారన్నారు.

## అప్పులు అడగడం సిగ్గుగా అనిపించింది: పాక్ ప్రధాని



**ఇస్లామాబాద్, జనవరి 31:** పాకిస్థాన్ తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. దీని నుంచి బయటపడేందుకు మిత్ర దేశాల వద్దకు వెళ్లి మరీ రుణాలు అడగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని తాజాగా ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫే అంగీకరించారు. అప్పులు అడగటం తనకు సిగ్గుగా అనిపించిందని వ్యాఖ్యానించారు. ఇస్లామాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో దేశంలోని ప్రముఖ ఎగుమతిదారులు, వ్యాపారులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌తో కలిసి నేను రహస్యంగా మిత్రదేశాల వద్దకు వెళ్లి అప్పులు అడిగాము. ఆ సమయంలో మాకు చాలా సిగ్గుగా అనిపించింది. రుణాలు తీసుకోవడం ఆత్మగౌరవానికి పెద్దదెబ్బ. డబ్బులు ఇచ్చేవారు ఏం డిమాండ్ చేసినా సరే అడ్డు చెప్పలేని పరిస్థితి ఉంటుంది' అని షరీఫ్ అన్నారు.

## బిఎల్‌ఎ దాడిలో 10 మంది పాక్ అధికారులు మృతి



**ఇస్లామాబాద్, జనవరి 31:** పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్‌లో బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్‌ఎ) భారీ ఎత్తు న దాడులు చేసింది. 12 ప్రాంతాల్లో దాడులకు పాల్పడింది. ఈ దాడు ల్లో 10 మంది పాకిస్థాన్ భద్రతా అధికారులు మరణించగా, 37మంది బిఎల్‌ఎ యోధులు మరణించినట్లు తెలుస్తోంది. ఈ దాడుల్లో కాల్పులతోపాటు ఆత్మాహుతిబాంబుదాడులు జరిగినట్లు తెలుస్తోంది. క్వెట్టా, పస్ని, మస్తుంగ్, నోష్కి, గ్వాదర్ జిల్లాల్లో ఈదాడులు జరిగినట్లు పాక్ సీనియర్ భద్రతా అధికారి వెల్లడించారు. అయితే, ఇప్పటివరకు ఈ దాడుల్లో ఎంతమంది సాధారణ ప్రజలు మరణించారనే వివరాలు వెలువడలేదు. భద్రతా సిబ్బంది వేగంగా స్పందించడంతో దాడులు తీవ్రతను తగ్గించినట్లు అధికారులు చెప్పారు.

## జాయింట్ వెంచర్‌కు పాక్ రూజ్‌వెల్ట్ హోటల్

**కరాచి,జనవరి 31:** పాకిస్థాన్ తమకు విదేశాల్లో ఉన్న అత్యంత విలువైన ఆస్తులలో ఒకటైన న్యూయార్క్‌లోని చారిత్రక రూజ్‌వెల్ట్ హోటల్‌ను పూర్తిగా విక్రయించకుండా, దానిని రీడెవలప్‌మెంట్ చేసేందుకు సిద్ధమైంది. జాయింట్ వెంచర్ పద్ధతిలో భాగస్వామిని చేర్చుకుని, ఈ ఆస్తి విలువను కనీసం 1 బిలియన్ డాలర్లకు పైగా పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. తీవ్రమైన ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) నిర్దేశించిన ప్రైవేటీకరణ కార్యక్రమంలో భాగంగా పాక్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. 1924లో ప్రారంభమైన రూజ్‌వెల్ట్ హోటల్, ఒకప్పుడు న్యూయార్క్ నగరానికే తలమానికంగా నిలిచింది. 1000కి పైగా గదులతో, గ్రాండ్ డేమ్ ఆఫ్ మాడిసన్ అవెన్యూగా పేరుగాంచింది. వాల్ స్ట్రీట్, మేడ్ ఇన్ మాన్‌హాటన్ వంటి ఎన్నో హాలీవుడ్ చిత్రాలకు ఇది వేదికైంది.

## లంచంతీసుకుంటూ పట్టుడటంతో రోడ్డుపై అరుపులు,కేకలు

**బెంగళూరు,జనవరి 31:** బెంగళూరులోని కేపీ అగ్రహార పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ గోవిందరాజు ఒక చీటింగ్ కేసులో మహమ్మద్ అక్బర్ అనే వ్యక్తికి బెయిల్ వచ్చేలా సాయం చేస్తానని, కేసు నుంచి పేరు తొలగిస్తానని రూ. 5 లక్షలు డిమాండ్ చేశారు. ఇప్పటికే రూ.లక్ష వసూలు చేసిన ఆయన మిగిలిన రూ.4లక్షలను చామరాజ్‌పేటలోని సీఏఆర్‌గ్రౌండ్స్ వద్ద తీసుకుంటుండగా లోకాయుక్త పోలీసులు మెరుపు దాడిచేసి పట్టుకోగానే గోవిందరాజు షాక్‌కు గురయ్యారు. తప్పించుకునే మార్గం లేక నడిరోడ్డుపైనే గట్టిగా అరుస్తూ, తనను వదిలేయాలంటూ అధికారులతో పెనుగులాడారు. యూనిఫాంలో ఉండి ఆయన చేసిన ఈ రభస అంతా అక్కడ ఉన్నవారు వీడియో తీశారు.

# సామాజిక న్యాయం కోసం సాగే ప్రతి పోరులో గద్దర్ ఆత్మ

### రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** ప్రజాగాయకుడు, ప్రజా యుద్ధ నౌకగా పేరొందిన గద్దర్ భౌతికంగా మన మధ్య లేకున్నా ఆయన ఆలోచనలు, ఆయన పాటలు, ఆయన ఆశయాలు ఇప్పటికీ మన మధ్య సజీవంగానే ఉన్నాయని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సామాజిక న్యాయం కోసం, సమానత్వం కోసం, మానవ గౌరవం కోసం సాగే ప్రతి పోరాటంలో గద్దర్ ఆత్మ కనిపిస్తుందని మంత్రి పేర్కొన్నారు. గద్దర్ 78వ జయంతి సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఘన నివాళులర్పించారు. గద్దర్ తన పాటల ద్వారా పీడిత ప్రజల హక్కుల కోసం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం దశాబ్దాల పాటు పోరాడారని, తన విప్లవాత్మక గళంతో ప్రతి ఒక్కరికి కూడు, గూడు, నీడ లభించాలనే లక్ష్యంతో జీవితాంతం తన పాటలతో ప్రజలను చైతన్య పర్చారని గుర్తు చేసుకున్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గద్దర్ ఆశయాలను, ఆకాంక్షలను అనుగుణంగా పని చేస్తుందని తెలిపారు.

# సిఎం రేవంత్‌రెడ్డి సమర్థపాలనకు నిదర్శనం ఆర్థిక సర్వే నివేదిక

### రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ చిన్నారెడ్డి

**హైదరాబాద్ (బేగంపేట) జనవరి 31,ప్రభాతవార్త:** రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకెళుతున్నదని, ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ వేదికగా ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే నివేదిక స్పష్టం చేసిందని, ఇది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన దక్షతకు అద్దం పడుతుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్, సిఎం ప్రజావాణి ఇన్‌ఛార్జి డా.జి.చిన్నారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమంతో పాటు ప్రజల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అనడానికి కేంద్ర ఆర్థిక సర్వే నివేదికే సాక్ష్యమని అన్నారు. రెండు సంవత్సరాల కాలంలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుచూపుతో అనుసరిస్తున్న విధానాలుగా రాష్ట్ర భవిష్యత్‌కు బాటలు వేస్తున్నాయని చిన్నారెడ్డి అన్నారు. ఆయన దూరదృష్టి విధానాలు రాష్ట్రాన్ని జాతీయ స్థాయిలో అగ్రభాగాన నిలిపేందుకు దోహదం చేస్తాయని, ప్రణాళికాబద్ధంగా రూపొందించిన కార్యాచరణ సత్ఫలితాలు ఇస్తున్నాయని చెప్పడానికి కేంద్ర ఆర్థిక సర్వే నిదర్శనమని అన్నారు. రెండేళ్ల కాలంలో తీసుకువచ్చిన భూభారతి డిజిటల్ ప్లాన్‌తో భూరికార్డులు పక్కాగా ఉంటున్నాయని, పట్టాలు, గ్రామాల్లో భూ వివాదాలు తగ్గుతున్నాయని. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు సిఎం రేవంత్‌రెడ్డి సమర్థపాలన దేశానికి దిక్సూచిగా మారుతుందని చిన్నారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.



పోలీసులు పట్టుకున్న వెండి ఆభరణాలు

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో రెండు కిలోల వెండి ఆభరణాలు పట్టివేత

**సిరిసిల్ల బ్యూరో, జనవరి 31, ప్రభాతవార్త:** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని రగుడు జంక్షన్ వద్ద రెండు కిలోలకు పైగా వెండి ఆభరణాలను పోలీసులు పట్టుకున్నారు. మున్సిపల్ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టి చెక్ పోస్టు వద్ద శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా టిఎస్ 08 ఎఫ్ఎస్ 6726 అనే నంబర్ కారును పోలీస్‌లు ఆపి తనిఖీ చేయగా వెండి ఆభరణాలు లబించాయి. జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన తోగిటి సత్యనారాయణ తన కారులో లెక్కలో లేని అనుమానస్పద 2.942 కిలోల వెండి పట్టగోలుసులు తీసుకెళుతుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ వెండి ఆభరణాలను ఎస్ఎస్‌టి ఇన్‌చార్జి జి ఆనంద్, ఎపిఒ సమక్షంలో స్వాధీనం చేసుకుని విచారణ చేస్తున్నామని పట్టణ సిఐ కృష్ణ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బు లు, మద్యం, ఇతర విలువైన వస్తువులను తీసుకుని వెళుతున్నట్లు సమాచారం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలి గించే చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపై ఎన్నికల నియమావళి ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.



# సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని హైదరాబాద్‌లోనే ప్రతిష్ఠించాలి

### లేకుంటే 11న సిఎం ఇంటిని ముట్టడిస్తాం

### రౌండ్‌టేబుల్ సమావేశంలో గిరిజన సంఘాల హెచ్చరిక

**హైదరాబాద్,జనవరి 31,ప్రభాతవార్త:** గిరిజన బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని హైదరాబాద్‌లోనే ప్రతిష్టించాలని పలువురు గిరిజన సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఫిబ్రవరి 10లోపు లంబాడీ ప్రజాప్రతినిధులతో చర్చించాలని, లేనిపక్షంలో 11న సిఎం ఇంటి ముట్టడికి పిలుపునిస్తామని తెలిపారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కుర్ర మోతిలాల్ నాయక్ అధ్యక్షతన 'సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని మద్దిమడుగులో పెట్టొద్దు- హైదరాబాద్ లో ప్రతిష్టించాలి' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీమంత్రి, ఎఐబిఎస్ఎస్ మాజీ జాతీయ అధ్యక్షుడు అమర్‌సింగ్ తిలావత్, సేవాలాల్ బంజారా సంఘం మహిళా అధ్యక్షురాలు సక్రిబాయి, సరితబాయి, సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షులు అభి రామ్ నాయక్. ఏఐబిఎస్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు మోహన్ సింగ్ నాయక్, ఎల్ హెచ్ పి ఎస్ నంగార బేరి లంబాడి హక్కుల పోరాట సమితి గణేష్ నాయక్ తదితర గిరిజన సంఘాల నేతలు హాజరై, మాట్లాడారు. సేవాలాల్ విగ్రహాన్ని బంజారాహిహిల్స్ లోని ఒక్క ఎకరం స్థలంలో ఏర్పాటుచేయాలని కోరారు. దేవరకొండలోని మద్దిమడుగులో ఏర్పాటు చేస్తే బంజారా జాతిని అవమానపరిచినట్టేనన్నారు. సేవాలాల్ మహారాజ్ బంజారా యూనివర్సిటీని ఏర్పాటు చేయాలన్నారు. మోతీలాల్‌నాయక్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. నగరంలో 300 సీట్లకు కేవలం 5 కేటాయించడం పట్ల షెడ్యూల్ తెగలపై ప్రభుత్వానికి నిరక్ష్యాన్లికి నిదర్శనమని మండిపడ్డారు. సమావేశంలో గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు వెంకట్ బంజారా, ఓయు జెఎసి నేతలు సంపత్నాయక్ రవి నాయక్, సేవాలాల్ నేతలు రాంబాబునాయక్, హుస్సేన్ నాయక్, భరత్‌చౌహాన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి టెండర్లలో అవకతవకలు!

### నిర్ధారణకు వచ్చిన కేంద్ర నిపుణుల బృందం

### సిబిఐ దర్యాప్తునకు బొగ్గు మంత్రిత్వ శాఖ సిఫార్సు?

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** వివాదాస్పదమైన సింగరేణి కాలరీస్‌కి చెందిన నైని కోల్ బ్లాక్ టెండర్లలో అవసకతవకలు జరిగినట్లు కేంద్ర నిపుణుల బృందం నిర్ధారణకు వచ్చినట్లు తెలియవచ్చింది. నైని బొగ్గు గని టెండర్ల విషయంలో పెద్ద ఎత్తున ఆరోపణలు రావడంతో వాటిపై విచారించేందుకు కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ ఇద్దరు సభ్యులతో కూడిన టెక్నికల్ కమిటీని నియమించింది. ఈ కేంద్ర దర్యాప్తు బృందంలో బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతనా శుక్లా, ఆ శాఖ టెక్నికల్ డైరెక్టర్ మారపల్లి వెంకటేశ్వర్లు సభ్యులుగా ఉన్నారు. ఈ కేంద్ర బృందం ఇటీవల సింగరేణి ప్రాంతంలో విచారణ చేసింది. సీఎస్ఆర్ నిధుల వినియోగం, టెండర్ నిబంధనలు వంటి అంశాలపై వివరాలు సేకరించింది. టెండర్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించింది. బొగ్గు గనుల టెండర్లకు సంబంధించి సింగరేణి అధికారులు తీసుకున్న చర్యలు, నిబంధనలు ప్రకారం జరిగాయా లేదా వంటి వివిధ అంశాలపై తీసింది. నిర్దిష్ట కంపెనీలకు ప్రయోజనం చేకూర్చేందుకు తప్పనిసరి సైట్ విజిట్ క్లాజులు వంటి కొత్త షరతులు ప్రవేశపెట్టబడ్డాయనేదానిపై లోతుగా అధ్యయనం చేసింది. ఈ విచారణలో మొత్తం టెండర్ల ప్రక్రియలో కొన్ని అవకతవకలను గమనించినట్లు విశ్వాసనీయవర్గాల ద్వారా తెలిసింది. టెండర్ల కేటాయింపులో పేర్కొన్న నియమాలను పాటించడంలో వైఫల్యం చెందడంతో పాటు కొన్ని నిబంధనల ఉల్లంఘనలను ఈ బృందం కనుగొన్నట్లు సమాచారం. టెండర్ల రద్దుకు గల కారణాలను బృందం ప్రత్యేకంగా అధ్యయనం చేసింది. సైట్ సందర్శనను తప్పనిసరి చేయాలనే చర్య టెండర్లను ప్రభావితం చేసిందనే అంశాన్ని గుర్తించినట్లు తెలుస్తోంది. సింగరేణి యాజమాన్యం స్వీయప్రకటన నిబంధనను పాటించడంలో విఫలమైందని, మరియు బిడ్డర్లు సైట్ సందర్శన ధృవీకరణ పత్రాలను పొందాలని పట్టుబట్టడం వెనుక మతలబు జరిగినట్లు సాంకేతిక బృందం పరిశీలనలో వెలుగు చూసినట్లు తెలుస్తోంది. ఈ సర్టిఫికెట్‌ను తప్పనిసరి చేయడం ద్వారా, అటువంటి కంపెనీలు లేదా బిడ్డర్లు మాత్రమే బిడ్‌లను దాఖలు చేయడానికి అర్హులు అవుతారని కనుగొంది. వివిధ ప్రభుత్వ సంస్థలు తమ స్వీయ ధృవీకరణ ప్రాతిపదికన టెండర్లను దాఖలు చేయడానికి అనుమతించిన అనేక ఇతర కంపెనీలు తమ బిడ్‌లను దాఖలు చేయడానికి అర్హత పొందవనే దానిపై ఈ బృందం ఒక నిర్ణయానికి వచ్చినట్లు వెల్లడవుతోంది. ఇదే సమయంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యకలాపాల కింద సంస్థ చేసిన అవాంఛిత ఖర్చులను కూడా గమనించింది. సింగరేణి బోర్డు స్వయంప్రతిపత్తి హోదా కింద అధికారాలను వినియోగించుకుంటూ ఒక ప్రైవేట్ ఈవెంట్ కోసం కోట్ల రూపాయల మేర ఖర్చుకు పాల్పడి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తం చేసింది. వీటన్నింటి దృష్ట్యా కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ ఈ అవకతవకలపై సీబీఐ దర్యాప్తుకు సిఫార్సు చేసే ఆవకాశాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడవుతోంది. మరోపక్క బొగ్గు గని టెండర్ల వ్యవహారంపై కేంద్ర బొగ్గు గనుల శాఖ ఇటీవల సీరియస్ కూడా అయింది. సంస్థ విధించిన నిబంధనలపై పాలకమండలిలో ఎందుకు చర్చించలేదన్న ఇటీవల కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సంజయ్ కుమార్ సింగరేణి యాజమాన్యాన్ని నిలదీశారు.

# విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడడం తగదు

### కలుషిత ఆహారంపై విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వ స్కూల్స్, హాస్టల్స్, గురుకులాల్లో తరచుగా జరుగుతున్న కలుషిత ఆహారంపై విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని సిపిఐఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడడం తగదని రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ హెచ్చరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూల్స్, హాస్టళ్లల్లో ఫుడ్ పాయిజనింగ్‌పై ఆందోళన వ్యక్తం చేశారు. ఖమ్మం కొణిజర్ల మండల పరిధిలోని బోడియాతండా ప్రభుత్వ పాఠశాలలో 38 మంది, వనపర్తి జిల్లా కొత్తకోట ప్రభుత్వ బాలికల కళాశాలలో 30 మంది విద్యార్థులు కలుషిత ఆహారం వల్ల అస్వస్థతకు గురవ్వడం అత్యంత దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ నిరక్ష్యం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని.. ఒక విచారణ కమిషన్ ఏర్పాటు చేసి, తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెండు నెలల క్రితమే హైదరాబాదులోని బాగ్‌లింగంపల్లి, మాదాపూర్, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్‌లో కలుషిత ఆహారం వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం మరవకముందే .. ప్రస్తుతం ఖమ్మం, వనపర్తి జిల్లాల్లో చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తుం దన్నారు. ఇది విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడటమేనని రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో నిర్వహణలోపం, పర్యవేక్షణ కొరత, పరిశుభ్రత లోపం, కలుషిత నీరు వంటి కారణాలతో పాటు, ఉప్మారవ్వ, పులిసిపోయిన పెరుగు, కుళ్ళిపోయిన కూరగాయలు, నాసిరకం పప్పులు, ముక్కిపోయిన బియ్యం పెట్టడం వల్లనే ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు పదేపదే జరుగుతున్నాయన్నారు. ఇలాంటి ఘటనలపై గతంలో హ్యూమన్‌రైట్స్ కమిషన్ తీవ్రంగా స్పందించినప్పటికీ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. ఆర్థిక భారం కూడా ఈ ఘటనకు ఒక ముఖ్య కారణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ హాస్టల్స్‌కు చెల్లించాల్సిన బిల్లులను పూర్తిగా చెల్లించాలని, ఘటనలకు కారణమవుతున్న అధికారులపై, కాంట్రాక్టు సంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, పర్యవేక్షణ లోపాలను సరిదిద్ది, ఆహార భద్రత ప్రోటోకాల్స్‌ను పకడ్బందీగా అమలు చేయాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు.

# సిసి కెమెరాల మధ్య ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

### రేపటి నుంచి 21 వరకు నిర్వహణ
### 5,26,192 మంది విద్యార్థులు
### 1,440 కేంద్రాలు ఏర్పాటు
### సిట్టింగ్ స్క్వాడ్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్‌తో పర్యవేక్షణ
### ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రేపటి(సోమవారం) నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను సీసీ కెమెరాల నడుమ నిర్వ హించనున్నారు. గత యేడాది వరకు కొన్ని కేంద్రాల్లోనే సీసీ కెమెరాలు ఉండగా.. ఈ ఏడాది సీసీ కెమెరాలు ఉన్న కాలేజీలకు మాత్రమే పరీక్షా కేంద్రాలను ఇంటర్ బోర్డు ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే ప్రాక్టికల్ పరీక్షలు సీసీ కెమెరాల నడుమ కొనసాగనున్నాయి. రాష్ట్రంలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు 5,26,192 మంది విద్యార్థులు హాజరు కానుండగా.. వారి కోసం రాష్ట్ర వ్యాప్తంగా 1440 కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్ష నేపథ్యంలో శనివారం ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ జయప్రద బాయి, జాయింట్ సెక్రటరీ ఎగ్జామ్స్ మోహన్‌తోపాటు సీజీజీ అధికారులతో కలిసి నాంపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఈ నెల 2 నుంచి 21 వరకు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించనున్నట్టు కృష్ణ ఆదిత్య తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలకు ఎంపీసీ విద్యార్థులు 2,74,007 మంది, బైపీసీ విద్యార్థులు 1,33,415 మంది హాజరు కానుండగా.. ఒకేషనల్ విద్యార్థులు 1,18,770 మంది హాజరు కానున్నారు. మొత్తంగా ప్రాక్టికల్ పరీక్షలకు 5,26,192 మంది హాజరు కానున్నారని.. వారి కోసం 1440 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరీక్షలను రెండు విడతల్లో నిర్వహించనున్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో నిర్వహించనున్నారు. ఉదయం సెషన్‌ను 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్‌ను 2 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించ నున్నారు. ప్రాక్టికల్ పరీక్షలకు 7,559 మంది ఎగ్జామినర్లను నియమిం చారు. వారిలో 1,814 మంది ప్రభుత్వ జూని యర్ కాలేజీల్లో పనిచేస్తున్న లెక్చరర్లను ఎగ్జా మినర్లుగా నియమించగా.. 3856 మంది ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో పనిచేసే లెక్చరర్లను ఎగ్జామినర్లుగా నియమించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్‌ను నియమించారు.

# జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి రావి నారాయణరెడ్డి స్మారక అవార్డు

### రేపు ప్రదానం చేయనున్న సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** రావి నారాయణరెడ్డి స్మారక జాతీయ అవార్డుకు ఎంపిక అయిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుద ర్శన్‌రెడ్డికి ఈ అవార్డును సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రదానం చేయ నున్నారని తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాపరెడ్డి ప్రకటించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సేనాని, సిపిఐ అగ్రనేత రావి నారాయణరెడ్డి స్మారక జాతీయ ఆవార్డును 2025 సంవత్సరానికిగానూ దేశంలో అనేక చారిత్రాత్మక తీర్పులను వెల్లువరించిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి ప్రదానం చేయాలని నిర్ణయించినట్లు ట్రస్ట్ అధ్యక్షులు చాడ వెంకట రెడ్డి తెలిపారు. సిపిఐ రాష్ట్రకార్యాలయం మఖ్దూంభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు అవార్డుకు సంబంధించిన వివరాలను ప్రకటించారు. మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూమి కోసం భుక్తి కోసమే కాకుండా 200 ఏళ్లకు పైగా సాగిన నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకు సాగిన మహోత్తర పోరాటమని తెలిపారు. ఈ పోరాటం ఫలితంగానే హైదరాబాద్ సంస్థానం భారత్ దేశంలో విలీనమైందన్నారు.

ఆనాటి పోరాట యోధుల త్యాగాలను భావి తరాలకు అందిం చడమే లక్ష్యంగా రావి నారాయణరెడ్డి తెలంగాణ అమరవీరుల ట్రస్ట్‌కు అంకురార్పణ చేశారన్నారు. ఆయన మరణానంతరం ఆ అశయాలను కొనసాగించడమే లక్ష్యంగా తెలంగాణ అమరవీరుల ట్రస్ట్ ఆధ్వర్యంలో 1999లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులను స్మరించుకుంటూ స్మారకోపన్యాసాలు నిర్వహిం చడంతో పాటు రావి నారాయణరెడ్డి పేరుతో జాతీయ ఆవార్డు ఇవ్వాలని నిర్ణయం తీసుకు న్నామని చెప్పారు.


అందులో భాగంగా 2000 సంవత్సరం నుంచి దేశంలో వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన పలువురికి అవార్డును ట్రస్ట్ ప్రదానం చేస్తూ వస్తుందన్నారు. ఆర్థిక రంగ నిపుణులు బందోపాధ్యాయ, సిహెచ్. హనుమంతరావు, కేంద్ర మాజీ హోంశాఖ మంత్రి ఇంద్రజిత్ గుప్తా, కేంద్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి చతురానన్ మిశ్రా, సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శులు ఎ.బి.బర్ధన్, సురవరం సుధాకర్‌రెడ్డి, ప్రముఖ దర్శకులు శ్యామ్ బెనగల్ లాంటి ప్రముఖులకు రావి నారాయణరెడ్డి స్మారక జాతీయ అవార్డును ప్రధానం చేశామని తెలిపారు. తెలంగాణ మలిదశ ఉద్యమం, కరోనా సమయంలో ఈ అవార్డులను ఇవ్వలేక పోయామని.. తిరిగి 2026లో ఈ అవార్డును పునరుద్దరించామని తెలిపారు.

# దండుపాళ్యం ముఠా తరహాలో కాంగ్రెస్ నాయకుల కుంభకోణాలు

### ప్రజల దృష్టి మళ్లించేందుకే రేవంత్‌రెడ్డి కొత్త నాటకాలు

### బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నప్పడి నుండి ఆ పార్టీ నాయకులు దండుపాళ్యం ముఠా తరహాలో



మాట్లాడుతున్న బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కుంభ కోణాలు చేస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ ప్రధానకార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. శనివారం సిద్దిపేటలోని రంగధాం పల్లి అమరవీరుల స్తూపం వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం టెలిఫోన్ ట్యాపింగ్ పేరుతో బిఆర్ఎస్‌పై వేధింపులను ధారావాహిక సీరియల్ తరహాలో రెండేళ్ల నుండి కొన సాగిస్తున్నదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసలు సమస్యలను పక్కదారి పట్టించి ప్రతిపక్ష నాయకులను వేధిస్తున్నాడన్నారు. అధికారంలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యే అంతా అలీబాబా 40 దొంగలు, దండుపాళ్యం ముఠా తరహాలోనే కుంభకోణాలు చేస్తున్నారని, బొగ్గు స్కాం, 9 వేల ఎకరాల భూస్కామ్, ఇలా అనేక స్కామ్‌లు చేశారని, వాటి నుండి ప్రజల దృష్టి మళ్లించడం కోసమే ఈ నాటకాలు ఆడు తున్నారని ఆయన అన్నారు. రేవంత్‌రెడ్డిని ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్ నాయకుల గొంతు నొక్కడం కోసం సిట్ పేరిట కుట్రలు కొనసాగుతున్నాయని ఆయన అన్నారు. ప్రతీకార వాంఛతో రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని, ఎలక్షన్ అఫిడవిట్‌లో హారీశ్‌రావు అడ్రస్ సిద్దిపేటలో ఉంటే హైదరాబాద్ ఇంటి అడ్రస్‌కు నోటీస్ ఇచ్చారని, కేసీఆర్‌కు మాత్రం హైదరా బాద్‌లో నోటీస్ ఇచ్చారన్నారు.

రేవంత్‌రెడ్డి ఇంటి అడ్రస్ కొడంగల్ అయితే గతంలో అధికారులు హైదరాబాద్‌లో నోటీస్ ఇచ్చారని, అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ వివక్ష చూపలేద న్నారు. కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న రేవంత్‌రెడ్డికి తెలంగాణ ప్రజలు శిక్ష వేస్తారన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ కనకరాజుతో పాటు తదితరులు ఉన్నారు.

# పరిశుభ్రతపై సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా అమలు చేయాలి: టిఎస్ యుటిఎఫ్ డిమాండ్

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** పరిశుభ్రతపై సుప్రీం కోర్టు చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చిందని టిఎస్ యుటిఎఫ్ పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా అమలు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావరవి, ప్రధాన కార్యదర్శి ఎ. వెంకట్, ఉపాధ్యక్షురాలు సిహెచ్ దుర్గాభవాని, మహిళా విభాగం కన్వీనర్ ఆర్. శారద డిమాండ్ చేశారు. నెలసరి ఆరోగ్యం ప్రాథమిక హక్కుఅని, అది జీవించే హక్కు, విద్యాహక్కులో భాగమని సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మకమన్నారు. ఈ తీర్పు పట్ల తమ సంఘం హర్షం ప్రకటిస్తుందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల ఆరోగ్యం, పరిశుభ్రత పట్ల పాలకులు అవలంబిస్తున్న నిరక్ష్య వైఖరిని సుప్రీంకోర్టు తీర్పు తేటతెల్లం చేసిందని, ముఖ్యంగా పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు లేక బాలికలు తగిన మోతాదులో నీళ్ళుకూడ తాగడం లేదని ఫలితంగా, ఋతుస్రావం సమయంలోనే కాకుండ ఇతర అనారోగ్య సమస్యలకు దారి తీసే పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొందన్నారు.

విద్యారంగం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామనే మాటలు కేవలం ప్రకటనల వరకేనని, నేటికి అనేక పాఠశాలల్లో బాల బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు లేకపోవడం అంటే ప్రభుత్వాలకు అధికార యంత్రాంగానికి విద్యార్థుల ఆరోగ్య, పరిశుభ్రత పట్ల శ్రద్ధ లేకపోవడమేనన్నారు. సుప్రీంకోర్టు తీర్పుప్రకారం రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఆర్టికల్ 21, 21(ఎ) ప్రకారం తీర్పునివ్వడం ద్వారా ప్రభుత్వాలను బాధ్యులను చేసిందని గుర్తు చేశారు. టియస్‌యుటిఎఫ్‌గా గత కొన్ని సంవత్సరాల నుండి ప్రభుత్వ పాఠశాలల్లోని బాలికలకు ఉచిత సానిటరీ ప్యాడ్స్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నప్పటికి ప్రభుత్వాలు పెద్దగా స్పందించలేదని, అదపాదడపా ఇచ్చి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేశారని, ఈ తీర్పుతో ప్రభుత్వాలను బాధ్యులను చేయడం హర్షించతగ్గ విషయమన్నారు. ఇప్పటికైనా సుప్రీంకోర్టు తీర్పును చిత్తశుద్ధితో అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.



ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

# వచ్చే ఆర్థిక సంవత్సరం బిసిల బడ్జెట్ రూ. 25 వేల కోట్లు కేటాయించాలి

### 14 బిసి సంఘాల డిమాండ్

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** వచ్చే ఆర్థిక సంవత్సరం బీసీల సంక్షేమా నికి, అభివృద్ధికి బీసీల బడ్జెట్ రూ. 25వేల కోట్లు కేటాయించాలని 14 బీసీ సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం విద్యానగర్ బీసీ భవన్‌లో జరిగిన 14 బీసీ సంఘాల సమావేశానికి జాతీయ బి.సి సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో యేటా 25వేల కోట్లు కేటాయి స్తామని ప్రకటించారు. కానీ ఇంతవరకు 10వేల కోట్లకు మించి కేటాయించడం లేదు, ఖర్చు పెట్టడం లేదన్నారు. సమావేశాల్లో ఈ కింది తీర్మానాలు ఆమోదించారు. 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ 25వేల కోట్లు కేటా యించాలని, బిసి కార్పొరేషన్‌కు సబ్సిడీ రుణాల కోసం రూ. 4 వేల కోట్ల బడ్జెట్, ఎంబీసీ కార్పొరేషన్ కు 2 వేల కోట్లు, బిసి అడ్వకేట్లకు ఇచ్చే స్టైపెండ్ నెలకు రూ.1000 నుంచి 10 వేలకు పెంచాలని, అలాగే ఐ.ఐ.టీ - ఐ.ఐ.ఎం - ఎన్.ఐ.టి తదితర కోర్సులకు కూడా పూర్తి ఫీజులు చెల్లించాలని, ఈ సంవత్సరంలో అదనంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కు ఒక బి.సి గురుకుల పాటశాలలు మంజూరు చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. సమావేశంలో వక్లాభరణం కృష్ణ మోహన్, నీల వెంకటేష్, పగిళ్ళ సతీష్, అనంతయ్య, రాజేందర్, అనురాధ గౌడ్, జి. పద్మ, వేణుమాధవ్, కిషోర్ యాదవ్ తదితరులు సంఘ నాయకులూ పాల్గొన్నారు.



బతుకమ్మకుంటలో చేపలను వదులుతున్న ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ పెట్టు సాయి, మాజీ ఎంపి వి.హనుమంతరావు, చిత్రంలో శంభుల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

# విహెచ్ చొరవతో బతుకమ్మకుంటకు పునరుజ్జీవం

### రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి

### ఇది 35 యేళ్ల పోరాట ఫలితం..

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** బతుకమ్మకుంట సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ పిసిసి అధ్యక్షుడు వి.హనుమంతరావు ప్రత్యేక చొరవతోనే పునరుద్ధరణ జరిగిందని తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి అన్నారు. శనివారం బతుకమ్మకుంటలో వి.హనుమంతరావుతో కలిసి చేపలు వదిలే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ మత్స్యశాఖ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి వంద శాతం సబ్సిడీతో రాష్ట్రవ్యాప్తంగా చెరువులో చేపలను వదిలే పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారని, ఇది రాష్ట్రంలోని లక్షలాది మంది మత్స్యకారుల కుటుంబాలకు వరంగా మారిందన్నారు. పిసిసి మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపి వి.హనుమంతరావు మాట్లాడుతూ స్థానికులతో కలిసి గత 35 సంవత్సరాలుగా పోరాటం చేసి బతుకమ్మకుంటను సాధించుకున్నామని తెలిపారు. కుంట పునరుద్ధరణకు సీఎం రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేశారని కొనియాడారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ నగర వ్యాప్తంగా కబ్జాకు గురవుతున్న చెరువులు కుంటలను కాపాడుతున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు మోత రోహిత్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఆర్.లక్ష్మణ్ యాదవ్, పిసిసి కార్యదర్శులు శంభుల శ్రీకాంత్‌గౌడ్, లక్‌పతి యాదగిరిగౌడ్, మాజీ కార్పొరేటర్ పి.నారాయణస్వామి, దిద్ది రాంబాబు, సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, సత్తిబాబుగౌడ్, నగేష్‌గౌడ్, గడ్డం శ్రీధర్‌గౌడ్ కోటం అనిల్, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



## బంగాళాఖాతంలో 3,190 కి.మీ. వరకూ నోటమ్ జారీ

**న్యూఢిల్లీ, జనవరి 31:** బంగాళాఖాతంలో ఫిబ్రవరి 5, 6 తేదీలకు సంబంధించి భారత్ మరోసారి నోటమ్‌అంటే 'నోటీస్ టు ఎయిర్‌మెన్'ను జారీ చేసింది. గతంలో సుమారు 2,530 కిలోమీటర్ల వరకే పరిమితమైన నో ఫ్లై జోన్‌ను ఇప్పుడు 3,190 కిలోమీటర్ల వరకు పెంచారు.సాధారణ భద్రతా ప్రక్రియన్ను ముందుకెళ్లిన వ్యూహాత్మక చర్యగా కనిపిస్తోంది. నిర్ణీత సమయంలో ఈ విస్తీర్ణంలో విమానాల రాకపోకలపై సంపూర్ణ ఆంక్షలు విధించడం, లోతైన రక్షణ ప్రయోగాలకు ప్రభుత్వం సిద్ధమవుతోందన్న సంకేతాన్ని ఇస్తోంది. ఇంత విస్తృత గగనతల నియంత్రణ సాధారణంగా చిన్న స్థాయి రాకెట్ ప్రయోగాల కోసం జారీ చేయరు. దీర్ఘ శ్రేణి, అధిక శక్తి గల క్షిపణి వ్యవస్థల పరీక్షల సమయంలో మాత్రమే ఇటువంటి పరిమితులు అవసరం అవుతాయి. అందుకే ఈ నోటమ్, భారత్ సుదూర వ్యూహాత్మక సామర్థ్యాలను పరీక్షించబోతున్నదన్న ఊహాగానాలకు ఆజ్యం పోస్తోంది. ముఖ్యంగా సముద్రం నుంచి ప్రయోగించే క్షిపణి లేదా బాలిస్టిక్ వ్యవస్థకు సంబంధించిన పరీక్ష జరిగే అవకాశం ఉందన్న అభిప్రాయాలు బలపడుతున్నాయి. ప్రభుత్వం ఇప్పటివరకు ఏ క్షిపణి వ్యవస్థను పరీక్షించనుంది, ఏ ప్రయోగ వేదికను వినియోగించనుందో స్పష్టంగా వెల్లడించలేదు. ఇదే తరహాలో గత డిసెంబర్‌లో బంగాళాఖాతంపై 3,240 కిలోమీటర్ల పరిధికి నోటమ్ జారీ కావడం, భారత్ సుదూర పరీక్షల క్రమబద్ధంగా కొనసాగిస్తున్నట్లు సూచిస్తోంది. నోటమ్ అనేది కేవలం విమానయానానికి సంబంధించిన సాంకేతిక నోటీసు మాత్రమే కాదు. అది ఒక దేశం చేపట్టబోయే కీలక సైనిక కార్యకలాపాలకు ముందస్తు సంకేతం కూడా. క్షిపణి పరీక్షలు, సైనిక విన్యాసాలు వంటి సందర్భాల్లో గగనతలం, సముద్ర మార్గాల భద్రతను నిర్ధారించడం అంతర్జాతీయ బాధ్యత. అదే సమయంలో, ఈ నోటీసులు రక్షణ రంగంలో జరుగుతున్న పరిణామాలను ప్రపంచానికి తెలియజేసే సాధనంగా కూడా మారుతున్నాయి. భారత్ గణనీయమైన పురోగతి.. ఇటీవలి సంవత్సరాల్లో రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) క్షిపణి సాంకేతికతపై పెట్టిన దృష్టి ఈ నేపథ్యంలో మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

# బైబై బేగంపేట.. ముగిసిన వింగ్స్ ఇండియా 2026

### ప్రపంచస్థాయి భాగస్వామ్యం, కీలక ప్రకటనలు,
### చివరి రెండు రోజుల్లో 70 వేలకుపైగా సందర్శకులు

**హైదరాబాద్ (బేగంపేట) జనవరి 31, ప్రభాతవార్త:** బైబై బేగంపేట అంటూ వింగ్స్ ఇండియా 2026కు వచ్చిన విమానాలన్నీ వెళ్లిపోయాయి.శనివారం సాయంత్రం వరకు నింగిలో రివ్వున దూసుకెళ్తూ మార్క్‌జెఫ్రీ, సూర్యకిరణ్ ఏరోబాటిక్ టీంల విన్యాసాలు సందర్శకులను కేరింతలు కొట్టించాయి.ఆసియాలోనే అతిపెద్ద అత్యంత సమగ్ర పౌర విమాన యాన ప్రదర్శన సదస్సు అయిన వింగ్స్ ఇండియా 2026 నాలుగు రోజుల పాటు ఘనంగా కొనసాగిన అనంతరం శనివారం ముగిసింది.ప్రపంచ వ్యాప్తంగా పాల్గొన్న సంస్థలు,కీలక పరిశ్రమ ప్రకటనలు,విధానపరమైన చర్చలు,విమాన ప్రదర్శనలు అద్భుతమైన వైమానికి విన్యాసాలు ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.పౌర విమానయాన మంత్రిత్వశాఖ ,ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ),ఫిక్కీ సంయుక్తంగా నిర్వహించిన వింగ్స్ ఇండియా 2026 భారతదేశం ప్రపంచ స్థాయి విమానయాన కేంద్రంగా ఎదుగుతున్న దిశను మరొకసారి స్పష్టంగా చాటి చెప్పింది.విమాన యాన శ్రేణి మొత్తం నుంచి కీలక భాగస్వాములను ఈ వేదిక ఒక తాటిపైకి తెచ్చింది.కేవలం చివరి రెండు రోజుల్లోనే 70వేలకు పైగా సందర్శకులు ఈ ప్రదర్శనను వీక్షించారు.ఈ ప్రదర్శనలో ఎగిరే విమాన ప్రదర్శనలు,సూర్యకిరణ్ ఏరోబాటిక్ విన్యాసాలు, అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన పైలట్ మార్క్ జెఫ్రీస్ వైమానిక ప్రదర్శనలు ఈ భారీ హాజరుకు ప్రధాన కారణంగా నిలిచాయి.వింగ్స్ ఇండియా లో 150పైగా ప్రదర్శక సంస్థలు ఇందులో పాల్గొన్నాయి. నాలుగు రోజులు కార్యక్రమంలో 7500కు పైగా వ్యాపార సందర్శకులు,లక్షకు పైగా సాధారణ సందర్శకులు అలాగే 2000మంది ప్రతినిధులు హాజరయ్యారు. వీరిలో 200కు పైగా అంతర్జాతీయ ప్రతినిధులు ఉన్నారు.

ఈ ప్రదర్శనలో 30కి పైగా స్థిర మరియూ ఎగిరే విమానాలు ప్రదర్శనలో ఉంచారు.500కు పైగా బిటుబి, బిటుజీ సమావేశాలు నిర్వహించారు. ఇవన్నీ కలిపి వింగ్స్ ఇండియాను ఆసియాలోను అత్యంత సమగ్ర పౌర విమాన యాన వేదికగా నిలబెట్టాయి. ఈ ప్రదర్శనలో భారతీయ ,అంతర్జాతీయ విమానయాన రంగానికి చెందిన ప్రముఖ సంస్థలు పాల్గొన్నాయి. ప్రధాన విమాన యాన సంస్థలుగా ఎయిర్ ఇండియా,ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఆకాసా ఎయిర్‌లు పాల్గొన్నాయి. ప్రపంచస్థాయి విమాన తయారీ సంస్థలు ఎయిర్‌బస్, డసాల్ట్, ఏమియేషన్ ,ఏటీఆర్, ఢీహావిలాండ్, ఎంబ్రా యర్, పిలాటస్ తమ ఆధునిక విమానాలు సాంకేతికను ప్రదర్శించాయి. భారతీయ విమానయాన పరిశోధన తయారీ సామర్థ్యాలను హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌లిమిటెడ "(హెచ్ఏఎల్), సీఎస్ఐఆర్,నేషనల్ ఏరోస్పేస్ ల్యాబోరేటరీస్(ఎన్ఏఎల్) ప్రదర్శనలో ఉంచారు.విమానాశ్రయ నిర్వహణ,మౌలిక




వసతుల రంగంలో అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ లిమిటెడ్ ,బెంగుళూరు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లిమిటెడ్,కొచ్చిన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ అలాగే సాంకేతిక సేవలందించే ఏడిబీ సేఫ్‌గేట్,ఎస్ఐటీఏలు కీలక పాత్ర పోషించాయి. ఎంఆర్ఓ సంస్థలు,శిక్షణ అకాడమీలు, స్టార్టప్‌లు, విశ్వవిద్యాలయాలు, రాష్ట్ర ప్రభుత్వ విమానయాన సంస్థలు మొత్తం విమానయాన వ్యవస్థను ప్రతిబింబించాయి.

# బిజెపి, బిఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా మన అభ్యర్థులు ఉండాలి

### మున్సిపల్ ఎన్నికలపై అమెరికా నుంచి సిఎం రేవంత్‌రెడ్డి జూమ్ మీటింగ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి31:** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల సందడి నెలకొన్న నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, పార్టీ నేతలతో కలిఇస ఎన్నికల వ్యూహాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా కాంగ్రెస్ అభ్యర్థులు ఉండాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ జూమ్ మీటింగ్ నిర్వహించింది.ఈ జూమ్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా నుంచే పాల్గొని పలు సూచనలు చేశారు. మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని ఇన్‌చార్జ్ మంత్రులకు దిశానిర్దేశం చేశారు. అభ్యర్థుల ఎంపికలో నిరక్ష్యం ప్రదర్శించవద్దని అన్నారు.ప్రతి డివిజన్, ప్రతి వార్డు గెలుపు మనకు ముఖ్యమే అన్నారు. రెబల్స్ విషయంలో మాట్లాడి స్వయంగా సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. పార్టీ బలహీనంగా ఉన్న మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, మంత్రుల మధ్య అంతరం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా నాయకులకు సిఎం దిశానిర్దేశం చేశారు. పార్టీలోని నాయకులందరూ విభేదాలు పక్కన పెట్టి సమిష్టిగా పనిచేస్తేనే విజయం సాధ్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. చైర్మన్,మేయర్ అభ్యర్థుల ఎంపిక విషయంలో సిఎం రేవంత్‌రెడ్డి వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నారు. మున్సిపల్ చైర్మన్,మేయర్ అభ్యర్థులను ఇప్పుడే ప్రకటించవద్దని పార్టీ నేతలకు ఆయన సూచించారు. సమీక్షా సమావేశంలో క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతం,అభ్యర్థుల ఎంపిక కసరత్తు, ప్రచార సరళిపై విస్తృతంగా చర్చించారు. 90శాతం స్థానాలను కైవసం చేసుకోవాలని ఇన్‌చార్జ్ మంత్రులకు టార్గెట్ నిర్దేశించారు. రెబల్స్ బెడద లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాగా,. రాష్ట్రంలో ఫిబ్రవరి11న ఎన్నికలు జరగనున్నాయి. ఈనెల 28న నామినేషన్ల ప్రక్రియ మొదలవ్వగా జనవరి 30న ముగిసింది.




సభలో ప్రసంగిస్తున్న మంత్రి లక్ష్మణ్, బండాప్రకాష్, వెన్నెల, సూర్యకిరణ్, శాంతాసిన్హా, హరగోపాల్, కోదండరామ్, నారాయణ, జాన్‌వెస్లీ, జె.శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

## గద్దర్ కల్చరల్, రీసెర్చ్ సెంటర్లకు ప్రభుత్వ భూమి, నిధులు కేటాయిస్తాం

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జనవరి 31, ప్రభాతవార్త :** గద్దర్ ఈ ప్రపంచానికి తెలంగాణ యాస భాష వెనుకబడిన మన ప్రాంతాన్ని పాటలు, కవిత్వం, సాహిత్యం ద్వారా తెలియపరిచారని, తన జీవితాన్ని, కుటుంబాన్ని ఫణంగాపెట్టి అట్టడుగు ప్రజల కోసం కవిగా, కళాకారుడుగా, ప్రజా ఉద్యమనౌకగా చేసిన అనితర సేవలను అనిర్వచనీయమని, మీరు కోరినట్లు ఆ మహనీయుని పేరుమీద కల్చరల్, రీసెర్చ్ సెంటర్లు గౌరవప్రదంగా ఉండేటట్లు తగిన ప్రభుత్వ భూమిని, తగినన్ని నిధులకు కేటాయిస్తామని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ హామీనిచ్చారు.

ఈ విషయంలో తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి వచ్చే జయంతినాటికి తగు ఏర్పాటు చేస్తానని భరోసానిస్తూ రాష్ట్రవ్యాప్తంగా గద్దర్ ఫౌండేషన్ తరఫున చేసే ప్రజోపయోగ పనులన్నింటికి తమవంతు సంపూర్ణ సహకారం అందిస్తామని సభాముఖంగా మంత్రి వాగ్దానం చేశారు. ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, గద్దర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి పర్యవేక్షణలో శనివారం రాత్రి జరిగిన గద్దర్ 78వ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి లక్ష్మణ్ జ్యోతిప్రకాసనంచేసి గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించి ప్రసంగించారు. అమ్మ తెలంగాణమా, గద్దరన్న పాటల సీడిలను ఆవిష్కరించారు.

సిపిఐ నారాయణ మాట్లాడుతూ ఆదివాసీల హక్కులను కాపాడడంలో గద్దర్ పాత్ర మరువలేనిదని, ఒక తిరుగుబాటు చరిత్రకు చిహ్నమైన సమ్మక్క, సారక్క జాతరకు మంత్రి సీతక్కను బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటించాలని ప్రభుత్వానికి సూచించారు.

# సంక్షేమంలో ఫుడ్‌ఫాయిజన్‌కు చెక్

### ఇంటిగ్రేటెడ్ మెకానిజం అభివృద్ధి

### హాస్టళ్ల నిర్వహణకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో ఫుడ్ పాయిజనింగ్‌కు చెక్ పెట్టేందుకు సర్కార్ అలర్ట్ అయింది. తెలంగాణలో హాస్టళ్లలో తరచూ ఫుడ్ పాయిజనింగ్ సంఘటనలు జరుగుతునే ఉన్నాయి. ఈ నేపధ్యంలో వీటికి అడ్డుకట్ట వేసేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా తెలంగాణలోని వనపర్తి జిల్లా కొత్తకోట బీసీ గర్ల్స్ హాస్టల్లో ఫుడ్ పాయిజన్ జరిగింది. రాత్రి భోజనం తర్వాత పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు విరోచనాలతో దాదాపు 20 మంది విద్యార్థినులు బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న సిబ్బంది వెంటనే విద్యార్థులను అంబులెన్సో వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో ఇంటిగ్రేటెడ్ మెకానిజాన్ని అభివృద్ధి చేస్తోంది. హాస్టళ్ల సక్రమ నిర్వహణకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకొస్తోంది. దీనికి సంబంధించి సంక్షేమ శాఖలకు చెందిన సీనియర్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం ఈ విషయమై ఇప్పటికే డెవలపర్లు ప్రతిపాదిత వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ పాఠశాలలు, హాస్టళ్లలో ఫుడ్ పాయిజనింగ్ కేసులను అరికట్టడంలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు, సంస్థ స్థాయి కమిటీలు ఆశించిన ఫలితాలను ఇవ్వడంలో విఫలమవడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. రాష్ట్రంలోని అన్ని సంక్షేమ శాఖలలో హాస్టల్ నిర్వహణ కోసం ఇంటిగ్రేటెడ్ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టింది.

రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లలో పెరుగుతున్న ఫుడ్ పాయిజనింగ్ సంఘటనలపై వివిధ వర్గాల నుండి విమర్శలు రావడంతో, ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం గతంలో కమిటీలను ఏర్పాటు చేసింది. ఆహార తయారీని పర్యవేక్షించడం, కలుషితాన్ని నివారించడం, ఆహార సంబంధిత అనారోగ్యాలను నియంత్రించడం ఈ కమిటీలకు అప్పగించ బడ్డాయి. వారి సంబంధిత సంస్థలలో ప్రత్యక్ష పర్యవేక్షణ ద్వారా ఆహార భద్రతా సంఘటనలను పరిశోధించి, కారణాలను గుర్తించి, ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాలని ఆదేశించింది. అయితే, హాస్టళ్లలో ఆహారం తిన్న తర్వాత విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్న కేసులు రాష్ట్ర వ్యాప్తంగా అనేక సంస్థల నుండి కొనసాగుతు న్నాయి. రాష్ట్రంలోని పలు సంక్షేమ గురుకుల పాఠశాలలు, హాస్టళ్ల తప్పనిసరి కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉన్నా వాటిని విస్మరించినట్లు, మరికొన్ని చోట్ల ఏర్పాటు చేసినా అవి సక్రమంగా పనిచేయడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లలో ఫుడ్ పాయిజనింగ్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతుం డటం పట్ల ఆందోళన చెందుతున్న ప్రభుత్వం, అన్ని సంక్షేమ శాఖలలో క్రమబ ద్ధీకరిం చబడిన హాస్టల్ నిర్వహణ కోసం ఇంటిగ్రేటెడ్ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఇంటిగ్రేటెడ్ సిస్టమ్‌లో చేర్చాల్సి న పరిమితులపై సాఫ్ట్‌వేర్ డెవలపర్‌లకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చినట్లు సంక్షేమ శాఖ అధికారులు వెల్లడించారు.

## బిఆర్ఎస్ ఎమ్మెల్యేను ఆవహించిన ఆరెస్సెస్ భావజాలం

### కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జనవరి31:** హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర విమర్శలు చేశారు. విధి నిర్వహణలో ఉన్న అధికారిపై మతం పేరుతో వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. ఐపీఎస్ అధికారిని ఉద్దేశించి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ముస్లింల పట్ల ఆయనకున్న ద్వేషాన్ని బయటపెట్టాయని అన్నారు.మొదటిసారి ఎమ్మెల్యే అయిన వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారంటే, ఆయనను ఆరెస్సెస్ భావజాలం ఆవహించి ఉంటుందని చురక అంటించారు. పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్‌లో ఉంటూ కౌశిక్ రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం శోచనీయమని అన్నారు. ఆయన వ్యాఖ్యలను బీఆర్ఎస్ ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తిని ఉప ముఖ్యమంత్రిగా, హోంమంత్రిగా చేశారని గుర్తు చేశారు.త్వరలో జరగనున్న మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలపై కూడా అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు.

# నేడు రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ఎస్ శాంతియుత ఆందోళనలు

### కెసిఆర్ నందినగర్ ఇంటికి నోటీసులు అందించడంపై కెటిఆర్ ధ్వజం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 31:** సిట్ విచారణ పేరుతో ఉద్దేశపూర్వకంగా కేసీఆర్‌ను వేధిస్తున్నారంటూ ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ నేతల నిరసన ప్రదర్శనలు చేయనున్నారు. ఆదివారం రాష్ట్రమంతటా శాంతి యుతంగా ఆందోళనలకు దిగాలని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 12 వేలకుపైగా గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేయాలని సూచించారు.నిరసనల్లో భాగంగా ప్రతి మున్సిపల్, నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ శ్రేణులు బైక్ ర్యాలీలు నిర్వహించనున్నాయి. నల్ల జెండాలతో నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నారు. ధర్నాలు, రాస్తారోకోల ద్వారా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేయనున్నారు. మాజీ మంత్రులు, సీనియర్ నేతలు, పార్టీ శ్రేణులు ఆందోళనల్లో పాల్గొనాలని కేటీఆర్ పిలుపు నిచ్చారు. నిరసనలు శాంతియుతంగా చేయాలని, పోలీసులతో ఘర్షణలు వద్దని సూచించారు. నోటీసులను నందినగర్‌లోని కేసీఆర్ నివాసం గోడకు సిట్ అతికించడంపై కేటీఆర్ మండిపడ్డారు. ఈ మేరకు ఎక్స్‌వేదికగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడు, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మీద ఈ దుర్మార్గపు వైఖరి ఏంటి? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఆయన స్వయంగా తానుంటున్న నివాసం అడ్రస్‌తో పోలీసులకు సమాధానం ఇచ్చిన తర్వాత కూడా ఆయన లేని నివాసానికి రాత్రిపూట వచ్చి గోడకు నోటీసులు అతికించి పైశాచిక ఆనందాన్ని పొందడం దారుణమని అన్నారు. ఇది అహంకారం కాకపోతే మరింకేమిటి! అని కేటీఆర్ మండి పడ్డారు. 65 సంవత్సరాలు దాటిన వ్యక్తులను వారుంటున్న నివాసం వద్దే విచారించాలనే నిబంధనను కూడా పోలీసులు అతిక్రమిస్తున్నారని కేటీఆర్ అసహనం వ్యక్తం చేశారు. అసలు పోలీసులకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ) మీద అవగాహన ఉందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. లేదా సీఎం చేతిలో కీలుబొమ్మల్లా ప్రతిపక్ష నాయకులను వేధించడమే పనా? అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమ కేసులన్నింటినీ ఛేదిస్తామని ప్రతి తప్పుడు పనిని వెలికితీసి తెలంగాణ ప్రజల ముందు పెడతామని కేటీఆర్ తెలిపారు. సమయం వచ్చినప్పుడు ప్రజాక్షేత్రంలోనే వారికి బుద్ధి చెబుతారని తెలిపారు.

## ప్రతి రంగంలోనూ సత్తా చాటుతున్న తెలంగాణ

### నిర్మాణాత్మక విమర్శలను స్వాగతిస్తాం

### రాజకీయ లబ్ధి కోసం అసత్యాలు వద్దు : మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్యంలో విమర్శ అనేది ఒక ఆరోగ్యకరమైన సంప్రదాయమని, ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకు ఇది అవసరమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని మా ప్రజా ప్రభుత్వం నిర్మాణాత్మక విమర్శలను ఎప్పుడూ స్వాగతిస్తుందన్నారు. ఈ విషయంలో మాకెలాంటి భేషజాలు లేవని, పాలనలో లోటుపాట్లను ఎత్తిచూపడం ప్రతిపక్షాల బాధ్యత కానీ, ఆ విమర్శ అనేది వాస్తవాల పునాదుల మీద నిలబడాలి తప్ప, కేవలం రాజకీయ లబ్ధి కోసం అల్లిన అసత్యాల మీద కాకూడదని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేక, కేవలం తమ స్వార్థం రాజకీయాల కోసం, ఉనికి కోసం కొందరు కుట్రపూరితమైన అసత్య ప్రచారాలకు తెరలేపారని అన్నారు. ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని, రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని, పెట్టుబడులు రావడం లేదంటూ ఇలా రకరకాలుగా అసత్యాలను వండి వార్చుతున్నారని మండిపడ్డారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో సాధిస్తున్న పురోగతికి, ఆర్థిక వ్యవస్థ పనితీరుకు, పాలనలో పారదర్శకతకు, మా ప్రభుత్వ పనితీరుకు తాజాగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎకానమిక్ సర్వే 2025-26 ఒక తిరుగులేని సాక్ష్యం అన్నారు.

# 'గ్రేటర్'లో వ్యాపార సంస్థలపై అగ్నిమాపక, హైడ్రా వరుస తనిఖీలు

### నాంపల్లి అగ్నిప్రమాదం ఎఫెక్ట్..
### గోదాములుగా మార్చిన సెల్లార్లు ఖాళీ,
### నిబంధనలు అతిక్రమించిన భవనాలకు తాళాలు

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** నాంపల్లిలోని ఫర్నీచర్ దుకాణంలో వారం రోజుల క్రితం సంభవించిన అగ్ని ప్రమాదం దరిమిలా ఫైర్ సర్వీస్, హైడ్రా అధికారులు గ్రేటర్ పరిధిలో వ్యాపార సంస్థలపై వరుసగా దాడులకు దిగుతూ ఓవైపు గోదాములుగా మారిన సెల్లార్లను ఖాళీ చేయిస్తూ మరోవైపు నిబంధనలు అతిక్రమించిన భవనాలకు తాళాలు వేస్తున్నారు. గడచిన నాలుగు రోజులుగా హైడ్రా, ఫైర్ సర్వీస్ అధికారులు వందకు పైగా సంస్థల్లో సెల్లార్లను ఖాళీ చేయించగా నిబంధనలకు విరుద్ధంగా వున్న 50కి పైగా భవనాలకు తాళాలు వేశారు. జంట నగరాలు, శివార్లలో గల అన్ని వ్యాపార సంస్థల్లో నిబంధనలు కచ్చితంగా అమలయ్యే వరకు ఈ దాడులు కొనసాగుతాయని ఫైర్ సర్వీస్ అధికారులు చెబుతున్నారు.

హైదరాబాద్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించినపుడు ఫైర్ సర్వీస్‌తో పాటు ఇతర విభాగాల అధికారులు వారం పది రోజుల హడావిడి చేయ డం, ఆ తరువాత దాని గురించి మరచి పోవడం ఇప్పటి వరకు జరిగేది. కానీ నాంపల్లిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇద్దరు చిన్నారుల సహా ఐదుగు రు గోదాముగా మారిన సెల్లార్‌లో




చిక్కుకుని మరణించడం సర్కారీ విభాగాల్లో కదలికను తెచ్చింది. ఇదివరకటిలా హడావిడి చేసి వెళ్లిపోకుండా వ్యాపర సంస్థలను సర్కిళ్ల వారిగా తనిఖీలు చేస్తూ నిబంధనలను పాటించని వాటికి చిన్నపాటి తప్పిదాలు అయితే కొంత గడువు ఇచ్చి వెంటనే సరిది ద్దు కోవాలని చెబుతున్నారు. ఫైర్ సర్వీస్ అనుమతులతో పాటు విద్యుత్, బల్దియా నుంచి అనుమతులు లేని వాటికి వెంటనే అనమతులు తెచ్చు కోవాలని, వీటి కోసం భవనాలను మార్చాలని హైడ్రా, ఫైర్ సర్వీస్ అధికారులు వ్యాపార సంస్థలకు చెబుతున్నారు. నిబంధనలకు అనుగుణంగా అ న్ని భవనాలలో అగ్నిమాపక సాధనాలతో పాటు తగినంత నీటి నిలువ వుండాలని, వీటిని ఎలా వాడాలో తెలిసిన సిబ్బంది కచ్చితంగా ఉండాలని అధికారులు చెబుతున్నారు. సెల్లార్లతో పాటు సెల్లార్లకు వుండే మెట్ల మార్గాలలో ఎట్టి పరిస్థితుల్లో ఎలాంటి వస్తువులు వుంచరాదని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు గ్రేటర్ పరిధిలో గోదాములుగా మారిన వందకు పైగా సెల్లార్ల ఖాళీ చేయించారు. ఇందులో వున్న వస్తువులను మరో చోటుకు మార్చించారు. భవనాల పై భాగంలో పెంట్ హౌస్ సహా ఇతర నిర్మాణాలకు అనమతుల విషయంలో అధికారులు కఠినంగా వుంటున్నారు. ఎలాంటి అనుమతులు లేని భవనాలు, కొంతమేర అనుమతులతో వున్న బడా భవనాలను 50 వరకు జప్తు చేశారు. జంట నగరాలు, శివార్లలో ఫైర్ సర్వీస్, హైడ్రా ఇలా వ్యవహరించడం ఇదే తొలిసారి.

#### గ్రేటర్ పరిధిలో వేల సంఖ్యలో బహుళ అంతస్తులన్నింటి తనిఖీకి హైడ్రా, ఫైర్ సర్వీస్ నిర్ణయం

ఇదిలా ఉండగా గ్రేటర్ హైదరాబాద్‌లో వేల సంఖ్యలో బహుళ అంతస్తులు వుండగా అందులో మెజారిటీ భవనాలకు ఎలాంటి అనుమతులు లేవ నేది తెలిసిందే. చాలా వాటికి ఒకటి రెండు అంతస్తుల వరకు అనుమతులు వుంటే ఐదారు అంతకు ఎక్కువగా అంతస్తుల వరకు నిర్మాణాలు జరిగి వున్నాయి. చాలా వరకు భవనాలలో ఎలాంటి ఫైర్ సేఫ్టీ ఉపకరణాలు కానీ వాటిని ఎలా వాడాలో తెలిసిన సిబ్బంది కానీ వున్న దాఖలాలు లేవు. ఇక చాలా వరకు భవనాలలో సెల్లార్లన్నీ గోదాములు లేదా అక్రమంగా ఇళ్లు లేదా వ్యాపార సముదాయాలు వున్నాయి. ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే నాంపల్లి తరహాలో మరణాలు సంభవిస్తున్నాయి. ఇంతకు ముందు రాంగోపాల్‌పేట్‌లో ఓ బడా భవనంలో చెలరేగిన అగ్ని ప్రమాదం సెల్లార్ లో గల రసాయన గోదాము కారణంగా నాలుగు రోజుల వరకు మంటలు అదుపులోకి రాలేదు. ఈ ఘటనలో ఐదుగురు మరణించారు. సికింద్రాబా ద్‌లో మరో అంస్తులో సెల్లార్‌లో విద్యుత్ మోటారు సైకిళ్ల కారణంగా అగ్ని ప్రమాదం సంభవించి అన్ని బైక్‌లు కాలిపోగా ఇక్కడ ఆరుగురు మరణిం చారు. ఇలాంటి ఘటనలు అనేకం జరిగాయి. గత ఏడాది పాతబస్తీలోని గుల్జార్ హౌస్ వద్ద ఓ భవనంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో ఎసిల వల్ల చెలరేగిన మంటలకు ఒకే కుటుంబానికి చెందిన 17 మంది మృత్యువాత పడ్డారు. జంట నగరాలలో ప్రతీ ఏడాది ఐదారు అగ్ని ప్రమాదాలు జ రుగుతుండగా ప్రతీ ఘటనలో కోట్లాది రూపాయల ఆస్తి నష్టం జరుగుతోంది. కొన్నింటిలో ప్రాణ నష్టం సంభవిస్తోంది. వీటి నివారణకు వ్యాపార సంస్థల్లో కచ్చితంగా నిబంధనలు అమలయ్యేలా చూసేందుకు హైడ్రా, ఫైర్‌సర్వీస్ నడుం బిగించింది. నాంపల్లి అగ్ని ప్రమాదం తరువాత ఈ రెండు విభాగాల వరుస దాడులు కొంతమేర ఫలితాలను ఇస్తున్నాయి.

## చివరి టి-20లో భారత్ అనూహ్య విజయం

### 46 పరుగుల తేడాతో కివీస్ ఓటమి

**తిరువనంతపురం, జనవరి 31:** భారత్ న్యూజిలాండ్ మధ్య జరిగిన ఆఖరి టీ20లో టీమిండియా విజయం సాధించింది. 272 పరుగుల హై టార్గెట్ ఛేజింగ్‌లో ఒకానొక దశలో న్యూజిలాండ్ విజయం సాధిస్తుందా అనిపించింది. ఫిన్ అలెన్ క్రీజులో ఉన్నంతసేపూ బౌండరీల మోత మోగించి న్యూజిలాండ్‌లో ఆశలు పుట్టించాడు. అయితే అక్షర్ పటేల్ బ్రేక్ ఇవ్వడంతో మ్యాచ్ ఒక్కసారిగా మారిపోయింది. ఆ తర్వాత అర్ష్‌దీప్ ఐదు వికెట్లతో సత్తా చాటి భారత విజయంలో కీలకంగా మారాడు. తిరువనంతపురం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో పరుగుల వరద పారింది. టాస్ గెలిచిన భారత జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. సంజూ శాంసన్ మరోసారి విఫలమవ్వగా అభిషేక్ 30 పరుగులతో రాణించాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 63, ఇషాన్ కిషన్ 103, హార్దిక్ 42 పరుగులు బాదడంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 271 పరుగులు చేసింది. భారత్ నిర్దేశించిన 272 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ జట్టు ఆరంభంలోనే టిమ్ సైఫర్ట్ వికెట్ కోల్పోయింది. 3 బంతుల్లో 5 పరుగులు చేసిన సైఫర్ట్ మొదటి ఓవర్‌లోనే అవుటయ్యాడు. ఆ తర్వాత నుంచి ఫిన్ అలెన్ రచిన్ రవీంద్ర కలిసి స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. ఫిన్ అలెన్ ఆట తీరుకు భారత బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకున్నారు. ఫిన్ అలెన్ రచిన్ రవీంద్ర రెండో వికెట్‌కు 48 బంతుల్లోనే ఏకంగా 100 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఫిన్ అలెన్ 38 బంతుల్లోనే 8 ఫోర్లు, 6 సిక్సర్లతో 80 పరుగులు చేసి అవుటయ్యాడు. అలెన్ అవుటయ్యే సమయానికి న్యూజిలాండ్ జట్టు 9 ఓవర్లకు 117 పరుగులు చేసింది. అలెన్ అవుటైన తర్వాత కివీస్ స్కోర్ బోర్డు నెమ్మదించడంతో పాటు వికెట్లు కూడా కోల్పోయింది. గ్లెన్ ఫిలిప్స్ 7, రచిన్ రవీంద్ర 30, మిచెల్ సాంట్నర్ 0, బెవాన్ జాకబ్స్ 7 పరుగులు చేసి పెవిలియన్ బాట పట్టారు. ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, మిచెల్ సాంట్నర్ వెంటవెంటనే అవుటవ్వడంతో కివీస్ ఆశలు సన్నగిల్లాయి. ఒకవైపు వికెట్లు పడుతున్నా డారిల్ మిచెల్ మాత్రం ఒంటరి పోరాటం చేశాడు. 12 బంతులు ఆడిన డారిల్ మిచెల్ రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో 26 పరుగులు చేసి అవుటయ్యాడు.




పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం ఇస్తున్న కెఆర్ సూర్యనారాయణ

## ఉద్యోగుల బకాయిలు రూ.35వేల కోట్లు చెల్లింపునకు బడ్జెట్లో నిధులు కేటాయించాలి

**ఎపి గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్**

**విజయవాడ, జనవరి 31, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు బకాయిలున్న రు.35వేల కోట్లను చెల్లించడానికి బడ్జెట్లో నిధులు కేటాయించాలని ఏపి గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కెఆర్ సూర్య నారాయణ డిమాండ్ చేశారు. అలా ఇవ్వలేని పక్షంలో బాకీకి భూమి ఇవ్వాలన్నారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో వున్న 4 డిఎలు ఇవ్వాలన్నారు. మధ్యంతర భృతి, వేతన సవరణ కమీషన్, సిపిఎస్, జిపిఎస్‌పై ఆమోదకరమైన పరిష్కారం తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. ఈ మేరకు ఆయన పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రి పయ్యావుల కేశవ్‌కు అసోసియేషన్ నేతలతో కలిసి శనివారం సమర్పించారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం ప్రవేశపెట్టాలన్నారు.



## ఉభయదేవేరులతో గోవిందరాజస్వామి తెప్పపై విహారం

**తిరుపతి,జనవరి 31ప్రభాతవార్తప్రతినిధి:** గోవింద రాజస్వామి ఆలయ వార్షిక తెప్పోత్స వాల్లో ఆరవరోజు శనివారం సాయంత్రం శ్రీదేవిభూదేవి సమేగ గోవిందరాజస్వామి భక్తులను కటాక్షించారు. సాయంత్రం 6.30 గంటలకు తెప్పపై ఏడుచుట్లు విహరించి భక్తులకు అభయ మిచ్చారు. పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఎఇఒ నారాయణ చౌదరి, సూపరింటెండెంట్ శేషగిరి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనంజయ,అర్చకులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

## అంబటి వ్యాఖ్యలపై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం

**- క్షమాపణ చెప్పకపోతే తెలుగు మహిళలు ఊరుకోరు**

**అనంతపురం, జనవరి 31 ప్రభాతవార్త బ్యూరో** ముఖ్యమంత్రి చంద్రబాబుని వ్యక్తిగతంగా విమర్శించిన అంబటి రాంబాబుని ఎవరూ ఒక మనిషిలా చూడటం లేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబటి వ్యాఖ్యల నేపథ్యంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ..సభ్యత, సంస్కారం అన్నవి ఏ కోశానా రాంబాబుకు లేనట్టు కనిపిస్తున్నా యన్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజంగా ఉంటాయన్నారు. గతంలో కూడా వైసీపీ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు గారిని, కూటమి నాయకులను ఇష్టానుసారం దూషించారన్నారు. ఆరోజే జగన్ వీటిని ఖండించి ఉంటే.. రాంబాబు లాంటి వారు ఇంత బరితెగించి మాట్లాడి ఉండే వారు కాదన్నారు. ఆయన వ్యాఖ్యలు కనీసం కుటుంబ సభ్యులైనా హర్షిస్తారా అని నిలదీశారు. వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని క్షమాపణ చెప్పాలని.. లేదంటే రాష్ట్రంలో తెలుగు మహిళలు ఊరుకునేది లేదు.

# అవ్వాతాతల చెంతకు మంత్రి నారాయణ

**- ఇంటింటికి వెళ్లి పెన్షన్ అందజేసిన మంత్రి - పండుగలా పెన్షన్ల పంపిణీ**



**నెల్లూరు, జనవరి 31, ప్రభాతవార్త - వైద్యం** నెల్లూరు నగరంలోని 16వ డివిజన్ గుర్రాల మడుగు సంగంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఒక జాతరను తలపించింది. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ శనివారం తెల్లవారుజాము నుంచే డివిజన్‌లో పర్యటించి, ఇంటింటికి వెళ్లి అవ్వాతాతలు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు స్వయంగా పెన్షన్ నగదును అందజేశారు. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం కావడంతో లబ్దిదారులకు ఇబ్బంది కలగకుండా ఒక రోజు ముందే పంపిణీ చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. డివిజన్‌కు చేరుకున్న మంత్రి నారాయణకు స్థానికమహిళలు మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి స్వయంగా తమ ఇంటి గడప వద్దకు వచ్చి పెన్షన్ అందించడంతో లబ్దిదారులు ఆనందానికి హద్దులు లేవు. ఒక్క 16వ డివిజన్‌లోనే 497 మందికి రూ.21,42,500 నగదును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 68 లక్షల మందికి సుమారు రూ.34 వేల కోట్ల భారీ వ్యయంతో పెన్షన్లు అందజేస్తున్నామని తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు పెన్షన్‌ను రూ.4వేలకు పెంచి దేశంలో మరెక్కడా లేని విధంగా పేదల సంక్షేమానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వం రూ.10లక్షల కోట్ల అప్పులు పెట్టినా, చంద్రబాబు అపార అనుభవంతో 90శాతం ఎన్నికల హామీలను నెరవేర్చామని పేర్కొన్నారు. మహిళలకు 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రూ.20వేల సాయం, యువనేత లోకేష్ ఆధ్వర్యంలో 67 లక్షల మందికి తల్లికి వందనం అమలు చేస్తున్నామని వివరించారు. నెల్లూరులో రూ.50 కోట్లతో డ్రైనేజీసమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని, నగరాన్ని గ్రీన్ సిటీగా మార్చి, దోమల రహిత నగరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. మంత్రి నారాయణ పనితీరును ప్రశంసించారు. మంత్రి క్రమశిక్షణకు మారు పేరు. చెప్పిన సమయానికి వచ్చి పెన్షన్లు పంపిణీ చేయడం ఆయన నిబద్దతకు నిదర్శనం. అడగగానే స్పందించే గొప్ప నాయకుడు మనకు ఎమ్మెల్యేగా ఉండటం నెల్లూరు వాసుల అదృష్టం. స్కూళ్లు, పార్కులు, కాలువల ఆధునీకరణకు ఆయన పెద్దపీట వేస్తున్నారు అని అన్నారు.

# సిఎంపై 'అంబటి' వ్యాఖ్యలు గర్హనీయం

**- తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయి - ఆయన వ్యాఖ్యలు వెనక్కితీసుకుని క్షమాపణ చెప్పే దాకా విశ్రమించం - రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**

**గుంటూరు, జనవరి 31, ప్రభాతవార్త ప్రతినిధి:** వైసిపి మాజీ మంత్రి అంబటి రాంబాబు చంద్రబాబు నాయుడుపై చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర టిడిపి అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసం ~ావు మండిపడ్డారు. రాజకీయాల్లో విమర్శలు ఉండాలి కానీ వ్యక్తిత్వ హననం కాదన్నారు. శనివారం అంబటి రాంబాబు సిఎం చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలు కేవలం ఒక వ్యక్తిని దూషించడం కాదని, రాష్ట్రం కోసం అహర్నిశలూ శ్రమిస్తున్న దశాబ్దాల చరిత్ర గల దార్శనికుడిని అవమానించడమే అని అన్నారు. ఆయన వాడిన పదజాలాన్ని తాము తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. రాజకీయాల్లో స్థాయిని మరిచి, సంస్కారాన్ని వదిలేసి మాట్లాడటం మీకు అలవాటుగా మారిందని,. కానీ ఈరోజు చంద్రబాబు పై చేసిన వ్యాఖ్యలు తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయన్నారు. మా నాయకుడిని దూషించడం అంటే.. తెలుగు బిడ్డల గౌరవాన్ని కించపరచడమే అని వ్యాఖ్యానించారు. అంబటి నోరు అదుపులో పెట్టుకోండి అని హెచ్చరించారు. చేసిన తప్పును తెలుసుకొని.. ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పే వరకు మేం విశ్రమించం అని స్పష్టం చేశారు.

# అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్



**తిరుపతి, జనవరి 31ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్ర చందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో చీఫ్ లంకెల సుబ్బరాయుడు ఆదేశాలతో అంతర్జాతీయ స్మగ్లర్‌ను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు.ఆ విభాగం ఎస్పీ పి. శ్రీనివాస్ ఆధ్వర్యం లో కఠిన చర్యలు తీసుకుంటున్నారు. అంతర్జాతీయ స్మగ్లర్ల పైన ప్రత్యేక నిఘా ఉంచారు. పాత కేసులలో పరారీ లో వున్న స్మగ్లర్ల ను అరెస్ట్ చేయడం కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడం జరిగింది. మహమ్మద్ ముజామిల్ లైసెన్స్ పేరుతో ఎర్రచందనం దుంగలను చైనా కు ఎగుమతి చేస్తూ, లైసెన్స్ ముసుగు లో శేషాచల అడవులలో అక్రమం గా తరలించిన ఎర్రచందనము దుంగలను అక్రమ రవాణా చేస్తూన్నాడు. ఉమ్మడి చిత్తూరు జిల్లా లో పలు కేసులలో ముద్దాయిగా ఉండి, పరారీ లో ఉన్న అంతర్జాతీయ ఎర్ర చందనము స్మగ్లర్‌ని అరెస్ట్ చేశారు. ఈ అక్రమ రవాణా లో మహమ్మద్ ముజామిల్ కి సహకరిస్తున్న చైనాకు చెందిన ప్రతినిధి మైఖేల్ పాత్ర పైన పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని చీఫ్ సుబ్బరాయుడు తెలిపారు. అంతర్జాతీయ స్మగ్లర్ ను అరెస్ట్ చేయడంలో కీలక పాత్ర పోషించిన అడిషనల్ యస్పీ కులశేఖర్ బృందాన్ని అభినందించారు. గత జనవరి నుండి ట్రయల్ జరిగిన 31 కేసులలో 27 కేసులలో శిక్ష పడి 87 కేసులలో ముద్దాయిల పై నేరం రుజువవడంతో న్యాయస్థానం శిక్ష వేసారన్నారు.

# వేంకటేశ్వర స్వామి కోర్టులో వైసిపి నేతలకు శిక్ష తప్పదు: కాంగ్రెస్ నేత చిట్టిబాబు



**తిరుపతి, జనవరి 31ప్రభాతవార్తప్రతినిధి:** అధికారంలో ఉన్న ఐదేళ్ళలో చేసింది పాపపు పనులు ,చెప్పేది పరిశుద్ధ మాటలని తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు తీవ్ర స్థాయిలో తప్పుపట్టారు. చేసిన పాపాలకు తిరుమల కొండపై కొలువైన శ్రీ వెంకటేశ్వర స్వామి కోర్టులో శిక్ష తప్పదని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. కొండపైన చిన్న తప్పు కూడా చేయడానికి భక్తులు ఎవరు సాహసించరన్నారు. అయితే ఐదేళ్లపాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం శ్రీ వెంకటేశ్వర స్వామి వద్ద క్షమించరాని పాపాలను చేసిందని ఆరోపించారు. పిలిస్తే పలికే దైవమైన స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన లడ్డూలను అసలు నెయ్యే కానీ రసాయనాలతో తయారుచేసిన నెయ్యితో లడ్డూలను స్వామివారికి నివేదించడం, భక్తులకు పంచడం తిరుమల చరిత్రలో క్షమించరాని అత్యంత ఘోరమైన పాపమన్నారు. ఇందుకోసం కోట్లను కూడబెట్టుకోవడానికి దుర్మార్గపు చర్యలకు అప్పటి టీటీడీ చైర్మన్లు కొందరు సిబ్బంది బరితెగించారని మండిపడ్డారు. ఇప్పుడు తాము ఉత్తములని, పరిశుద్ధులని, పవిత్రులమని, అమాయకులమని పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతూ శ్రీవారి భక్తులను, ప్రజలను నమ్మించడానికి నాటకాలు ఆడుతున్నారని ఎద్దేవాచేశారు.సుప్రీంకోర్టు ఆదేశాలతో విచారణ చేసిన సిబిఐ సిట్ తన చార్జి షీట్లో 60 లక్షల కిలోల కల్తీ నెయ్యిని లడ్డూల తయారీకి వినియోగించారని స్పష్టంగా పేర్కొందని, కల్తీ నెయ్యిలతోనే దాదాపు 20 కోట్ల లడ్డూలను తయారు చేశారని అయితే ఈ నెయ్యిలో ఆవు కొవ్వు లేదని తాము ఎలాంటి పాపం చేయలేదని వైసిపి నేతలు చెప్పడం వారి బరితెగింపునకు అబద్ధాల మాటలకు పరాకాష్ట అన్నారు. రసాయనాలతో తయారుచేసిన నెయ్యిని శ్రీవారి ప్రసాదాలకు వాడామనే విషయం ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. తాను చైర్మన్ గా ఉన్నప్పుడు నిల్వచేసిన లడ్డూలు బూజు పడుతున్నాయని భక్తులు, మీడియా స్పష్టం చేస్తే వారిపై ఎదురుదాడి దిగింది నిజం కాదా అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దోషులకు కఠిన శిక్షలు విధించాలని, దోచుకున్న సొమ్మంతా స్వాధీనం చేసుకోవాలని గౌడపేరు చిట్టిబాబు డిమాండ్ చేశారు.

## అమరావతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం పనులు 90 శాతం పూర్తి !

**విజయవాడ.జనవరి 31,ప్రభాత వార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. నిర్దిష్ట వ్యవధిలో స్టేడియం నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అమరావతి పరిధిలోని నవులూరు వద్ద నిర్మిస్తున్న ఈ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం పనులు తుది దశకు చేరుకున్నాయి. స్టేడియం నిర్మాణం దాదాపు 90 శాతం పూర్తయిందని ఏపీ మున్సిపల్ శాఖ అధికారులు అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు స్టేడియం నిర్మాణ పనుల పురోగతిని చూపిస్తూ ఓ వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. "రాజధాని అమరావతిలో నవులూరు వద్ద అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. అత్యాధునిక సౌకర్యాలతో దీనిని సిద్ధం చేస్తున్నాం" అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఈ స్టేడియంను మొత్తం 24 ఎకరాల విస్తీర్ణంలో 34 వేల సీటింగ్ సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. విజయవాడకు 13 కిలోమీటర్లు, గుంటూరుకు 16 కిలోమీటర్ల దూరంలో వ్యూహాత్మకంగా ఇది నిర్మితమవుతోంది. మిగిలిన పనులను కూడా వేగంగా పూర్తి చేసి, స్టేడియంను త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు తెలిపారు.

## అమరావతిలో ది న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ఏర్పాటు

**విజయవాడ,జనవరి31,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ రాజధాని అమరావతిలో ప్రాంతీయ కార్యాలయ ఏర్పాటుకు ది న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ఏర్పాటు చేయనుంది. ఉద్దండరాయునిపాలెం- వెలగపూడి పరిధిలో రూ.100 కోట్ల వ్యవయంతో ఈ కార్యాలయాన్ని నిర్మించనుంది. ఈ మేరకు కంపెనీ చీఫ్ రీజినల్ మేనేజర్ వి.రాజా, సీఆర్‌డీఏ అధికారుల మధ్య ఇటీవల ఒప్పందం కుదిరింది. ఆధునిక అవసరాలకు అనుగుణంగా కొత్త ఇన్సూరెన్స్ ఉత్పత్తుల అభివృద్ధికి ఏఐ స్పెషలిస్ట్ అధికారులను కూడా నియమించనున్నామని కంపెనీ ప్రతినిధులు చెప్పారు. గ్రామీణ, పట్టణ, కార్పొరేట్ రంగాలతో పాటు సాధారణ ప్రజలకు అవసరమైన అన్ని రకాల నాన్ లైఫ్ ఇన్సూరెన్స్ సేవలను అమరావతి ప్రాంతీయ కార్యాలయం ద్వారా అందిస్తామని పేర్కొన్నారు. అమరావతిలో టెక్నికల్, ఫైనాన్స్, మార్కెటింగ్, అడ్మినిస్ట్రేషన్ వంటి విభాగాల్లో 200 నుంచి 225 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

## పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌గా దామోదరనాయుడి నియామకం చెల్లదు..

**జిఒను రద్దు చేసిన హైకోర్టు**

**విజయవాడ జనవరి 31 ప్రభాతవార్త ప్రతినిధి:** పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌గా టి. దామోదరనాయుడిని పునర్నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం గతేడాది ఆగస్టు 6న జారీచేసిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. ఆయన నియామకం నిబంధనలకు విరుద్ధంగా ఉందని స్పష్టంచేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.విజయ్‌ఈ మేరకు తీర్పు ఇచ్చారు. దాంతో ఆ దిశలో ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేసిన దామోదరనాయుడిని తిరిగి నియమిస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గతేడాది ఆగస్టు 6న జీవో 295 జారీచేశారని, దానిని రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఏపీ పశుసంవర్ధక ఆఫీసర్స్ సర్వీసు అసోసియేషన్ అధ్యక్షుడు కె.సత్యనారాయణ, ఏపీ పశువైద్యుల అసిస్టెంట్ సర్జెన్స్ సర్వీసు అసోసియేషన్ అధ్యక్షుడు టి. జయప్రకాశ్, పశుసంవర్ధకశాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ పాముల సత్యకుమారి ఈ వ్యాజ్యాలు దాఖలు చేశారు. వారి తరపున న్యాయవాదులు పి.దుర్గాప్రసాద్, జీవీఎస్ కిశోర్‌కుమార్ వాదనలు వినిపించారు. దామోదరనాయుడిని డైరెక్టర్‌గా రెగ్యులర్ పోస్టులో నియమించడం వల్ల సీనియార్టీ ప్రకారం డైరెక్టర్ పోస్టుకు అర్హత ఉన్న అధికారులకు అన్యాయం జరుగు తుందన్నారు. ఆయన నియామకం నిబంధ నలకు విరుద్ధమన్నారు. ఇటీవల జరిగిన విచార ణలో ఈ వ్యాజ్యాలపై వాదనలు పూర్తి .

# తిరుమల సమాచారం

## పద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రికి రూ.90లక్షలు విలువైన వైద్యపరికరాలు



**తిరుమల,జనవరి 31ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని పద్మావతిచిన్నపిల్లల హృదయాలయానికి అవసరమైన అత్యాధునిక వైద్యపరికరాలను ఓ దాత భూరీమొత్తంలో విరాళాల రూపంలో అందించారు. సుమారు 90లక్షలు రూపాయలు విలువైన ఈ వైద్యపరికరాలను శనివారం తిరుపతి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ ద్వారా ఆస్పత్రికి అందజేశారు. ముంబైకి చెందిన ఆల్కెమ్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మధురిమసింగ్ 90లక్షలు రూపాయలు విలువైన హైఎండ్‌వెంటిలేటర్లు నాలుగు, పేషెంట్‌మానిటర్లు,హ్యూమిడిఫయర్లు, హెచ్‌ఎఫ్‌ఎన్‌సి నాలుగు పరికరాలు ఉన్నాయి. చిన్నపిల్లల హృదయ చికిత్సలకు ఈ పరికరాలు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న నూతన చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి అవసరమైన పరికరాలను విరాళంగా అందించడం అభినందనీయం. ఈ సందర్భంగా దాత మధురిమసింగ్‌ను టిటిడి జెఇఒ డాక్టర్ శరత్, ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాధరెడ్డి, ఆర్‌ఎంఒ డాక్టర్ భరత్, ఆల్కెమ్ ఫౌండేషన ప్రతినిధులు శ్రీవారి మెమోంటోతో సత్కరించారు.

## బంగారు, వెండి ధరల వ్యత్యాసాల ఎఫెక్ట్ !

**తిరుమలలో బంగారు,వెండి డాలర్లు అమ్మకాలు తాత్కాలిక నిలుపుదల నష్టాల నివారణకు అమ్మకాల్లో మార్పులపై టిటిడి కసరత్తు**

**తిరుమల,జనవరి 31ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి భక్తులు ఎంతో పవిత్రంగా, భక్తితో కొనుగోలుచేసి ధరించే బంగారు,వెండి డాలర్ల విక్రయాలను మార్కెట్‌లో వాటి ధరల హెచ్చుతగ్గుల (వ్యత్యాసాల)ప్రభావంతో తిరుమలలో వాటి అమ్మకాలను తాత్కాలికంగా నిలుపుదలచేసింది. జనవరి 28వతేదీ నుండి ఫిబ్రవరి 3వతేదీ వరకు పూర్తిగా ఈ కౌంటర్లను టిటిడి మూసివేసింది. బహిరంగ మార్కెట్‌లో గత కొంతకాలంగా బంగారు,వెండి ధరలు అనూహ్యంగా పెరిగినా, తగ్గినా ఆ ప్రభావం శ్రీవారి భక్తులపై పడకుండా టిటిడి అధికారులు వారానికి ఒక్కరోజుమాత్రమే ఈ ధరల్లో మార్పు చేసి భక్తులకు విక్రయిస్తున్నారు. తిరుమలలో భక్తులకు 5,10గ్రాముల బంగారు డాలర్లతోబాటు 5,10,50గ్రాముల వెండి డాలర్లను అమ్మకాలు చేస్తున్నారు. గత కొన్నేళ్ళుగా బంగారు 2గ్రాముల డాలర్లు అమ్మకాలను టిటిడి పూర్తిగా నిలుపుదలచేసింది. ఇప్పుడు 5,10గ్రాముల బంగారుడాలర్లు మాత్రమే అమ్మకాలు చేస్తుంది. ఇదీ కూడా ఫిబ్రవరి 3వతేదీవరకు పూర్తిగా నిలిపివేసింది. బయట మార్కెట్ ధరకంటే తిరుమలలో తక్కువ ధరకే శ్రీవారి డాలర్లు అందుబాటులో ఉండటంతో భారీగా అమ్మకాలు జరిగాయి. ఈ విషయాన్ని టిటిడి అధికారులు గుర్తించారు.దీంతో టిటిడిపై భారం పడింది. ఈ నష్టాన్ని అధిగమించేందుకు టిటిడి అధికారులుకీలక నిర్ణయం తీసుకుని ఆలయం ముందున్న కౌంటర్‌ను తాత్కాలికంగా మూసివేసింది. అంతేగాక ఇకపై శ్రీవారి దర్శనం చేసుకున్నట్లు టిక్కెట్ కలిగిన భక్తులకే స్వామివారి బంగారు,వెండి డాలర్లు విక్రయించాలని కూడా స్పష్టమైన నిర్ణయం తీసుకున్నారు. మార్కెట్‌లో బంగారు ధరలు రోజుకురోజుకూ పెరుగుతుండటంతో పెద్దమొత్తంలో డాలర్లు కొనుగోలును కూడా రద్దుచేయాలని నిర్ణయించారు.

## హిందూ ధర్మానికి పెద్దపీట!

**'గోవిందకోటి' రాస్తే విఐపి బ్రేక్ దర్శనంపై మరింత అవగాహన**




**తిరుమల,జనవరి 31ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధర్మానికి మరింత పెద్దపీట వేయడంలో భాగంగా చిన్నతనంనుండే యువ తలో అవగాహన కల్పించడంతోబాటు భక్తిభావం పెం పొందించే దిశగా తిరుమల తిరుపతి దేవస్థానం చొరవ తీసు కుం టోంది. ఇందులో భాగంగా రామకోటి తరహాలో యువత "గోవింద కోటి"రాస్తే ఆ భక్తుడితోబాటు ,వారి కుటుంబసభ్యులు ఐదుగురికి విఐపి బ్రేక్ దర్శనం కల్పిస్తున్న విషయంపై మరింతగా విస్తృత ప్రచారం చేసేదిశగా కార్యాచరణ అమలుచేస్తున్నారు. ఈ విధానం 2023 సెప్టెంబర్‌లో అప్పటి టిటిడి బోర్డు తీసుకున్న ఈ మంచినిర్ణయంపై భక్తుల్లో ఇంకా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు ప్రస్తుత పాలకమండలి, టిటిడి అధికారులు సానుకూలంగా వ్యవహరిస్తున్నారు. టిటిడి ప్రత్యేక పుస్తకాలు ముద్రించి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రస్తుత టిటిడి పాలకమండలి కూడా హిందూ సనాతన ధర్మవ్యాప్తికి ఎంతో ఉపయుక్తంగా ఉన్న "గోవిందకోటి"రాయడం వల్ల యువతలో భక్తిభావం పెంపొందింపజేసేందుకు అవకాశం కల్పించాలని నిర్ణయించారు. 25ఏళ్ళ లోపు యువత "గోవిందకోటి"రాస్తే వారి కుటుంబసభ్యులకు విఐపి బ్రేక్ దర్శనం కల్పించేందుకు సుముఖంగానే ఉన్నారు. 10,01,116సార్లు గోవిందనామాలు రాసిన భక్తులకు స్వామివారి దర్శనం కల్పించేలా మంచి దృక్పధంతో ఉన్నారు.తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ప్రశస్త్యాన్ని, భక్తిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పాలని, తిరుమలలో గోవింద నామం తప్ప మరేతర పదం వినిపించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా ఇప్పటికే స్పష్టంగా తెలిపారు. అదే ఆశయంతో పాలకమండలి కూడా అడుగులేస్తోంది.

## ఆర్యవైశ్యుల్లో 95 శాతం కూటమి ప్రభుత్వం, ఎన్‌డిఏ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నారు

**తాడిపత్రిఅర్బన్, జనవరి 31 ప్రభాతవార్త** ఆర్యవైశ్యుల్లో 95 శాతం మంది రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, కేంద్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నారని వారి మద్దతుతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, కేంద్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పాటైందని రాష్ట్ర పరిశ్రమలశాఖామంత్రి, అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టిజి భరత్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణ సమీపంలోని కడప రోడ్డులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 32 అడుగుల వాసవిమాత మండపాన్ని ఏర్పాటు చేసి అందులో 12 అడుగుల వాసవిమాత విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శనివారం వాసవిమాత మండపం ఆవిష్కరణ కార్యక్రమానికి మంత్రి టిజి భరత్ ముఖ్యఅతిథిగా హాజరై తాడిపత్రి ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి మాట్లాడుతూ తాడిపత్రికి నాలుగు వైపులా రహదారులు వున్నాయని రహదారుల సర్కిళ్లలో దేవుని విగ్రహాలు ఏర్పాటు చేసి టెంపుల్ సిటీగా మార్చాలన్న ఆలోచనలను అనుగుణంగా అనంతపురం రోడ్డులో ధ్యాన శివుని విగ్రహం, బుగ్గ వద్ద సత్యసాయిబాబా సింబల్ ఏర్పాటు చేశామన్నారు. కడప రోడ్డులో ఆర్యవైశ్యులు ముందుకు వచ్చి వాసవిమాత విగ్రహం, మండపం ఏర్పాటు చేస్తామని చెప్పడంతో అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. అత్యంత సుందరంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అందరిని కలుపుకుని తాడిపత్రిని బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కులాలకు అతీతంగా పనిచేసే వారికే తాడిపత్రిలో పట్టం కడతామన్నారు. ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన భూమా నాగరాగిణి విద్యావంతురాలని గుర్తించి ఆమెను మార్కెట్‌యార్డుచైర్‌పర్సన్‌గా నియమించడం జరిగిందన్నారు. ఆర్యవైశ్యులు తమకు మద్దతు ఇవ్వకపోతే తాము ఇన్ని సంవత్సరాలు విజయం సాధించలేమని పేర్కొన్నారు. మంత్రి టిజి భరత్ మాట్లాడుతూ పట్టణంలోని అమ్మవారిశాల వంద సంవత్సరాల క్రితమే అద్భుతంగా నిర్మించారని చాలా బాగుందన్నారు, ఆర్యవైశ్యులు ఎన్‌డిఏకు ఇస్తున్న మద్దతును చంద్రబాబునాయుడు గుర్తించి ప్రాధాన్యత ఇచ్చారన్నారు.

## కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని కళ్యాణోత్సవం



**రాపూరు, (నెల్లూరు) జనవరి31ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4.30కి స్వామి వారి మూలమూర్తికి అభిషేకం, గోపూజ,పూలాంగి సేవ నిర్వహించారు.ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో వేదపండితులు,వేద మంత్రోచ్ఛరణలతో స్వామి వారి కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.సాయంత్రం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ సూపరిటెండెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్,సిబ్బంది పులగల నరసింహ, వెంకటసుబ్బయ్య, పెంచల స్వామి, కోండల రావు.

# చెరకు పంట విస్తీర్ణం పెంచడానికి చర్యలు

**ప్రభుత్వం ద్వారా సహకారం అందించడానికి కృషి : మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**విజయనగరం, జనవరి 31 (ప్రభాతవార్త ప్రతినిధి ) :** చెరకు పండించే రైతులకు అవగాహన కలిగించి, చెరకు విస్తీర్ణాన్ని పెంచడానికి కృషి చేస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గతంలో చెక్కర కర్మాగారాలు పని చేసేటప్పుడు జిల్లాలో విరివిగా పండించేవారని, తిరిగి ఆ ప్రాంతాల్లో రైతులంతా చెరకు పండించేలా అవగాహన కలిగించవలసిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయ పడ్డారు. రైతుకు చెరకు సాగు వలన నష్టం జరగదు అనే భరోసా లభిస్తే ముందుకు వస్తారని, అందుకోసం చర్యలు తీసుకుంటామని అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి చెరకు సాగు, రైతుల పరిస్థితుల పై సంకిలి చెక్కర కర్మాగారం ప్రతినిధులు, చెరకు పండించే ప్రాంతాల్లోని ప్రజా ప్రతినిధులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంకిలి కర్మాగారం ఈ ఏడాది మూసివేస్తారనే వదంతులు వచ్చాయని, అది ఉత్తరాంధ్రకు భారీ నష్టమని , ఆ ఫ్యాక్టరీ కొనసాగాలంటే చెరకు ఉత్పత్తి పెరగవలసిన అవసరం ఉందని అన్నారు. రైతులకు అవగాహన కలిగించి ఈ ఏడాది 4 లక్షల టన్నుల వరకు కర్మాగారానికి వచ్చేలా కృషి చేస్తామని కర్మాగారం నుండి అందించవలసిన ఇన్పుట్స్ అందించాలని కోరారు. ముఖ్యమంత్రి దృష్టి కి చెరకు రైతుల పరిస్థితుల్ని తీసుకువెళ్ళి ప్రభుత్వం నుండి సహకారం అందేలా కృషి చేస్తానని తెలిపారు. సంకిలి కర్మాగారం ప్రతినిధులు మాట్లాడుతూ విజయనగరం, శ్రీకాకుళం, మన్యం జిల్లాల్లో చెరకు సాగు క్రమంగా తగ్గుతూ వస్తోందని, చెరకు నిర్వహణా వ్యయం అధికంగా ఉంటోందని, చేతికి డబ్బులు వచ్చే సరికి ఏడాది పాటు ఎదురు చూడవలసి వస్తోందని, రైతులకు ఎక్కువ ఆదాయం వచ్చే మొక్క జొన్న, ఆయిల్ పామ్ వంటి పంటల వైపు మరలుతున్నారని వివరించారు. తమిళనాడు, తెలంగాణా రాష్ట్రాల్లో డి.బి.టి ద్వారా రైతులకు ప్రభుత్వం నగదు జమ చేస్తోందని,మన రాష్ట్రం లో కూడా ఆ విధంగా ప్రోత్సహిస్తే రైతులు ముందుకు వస్తారని వివరించారు. మంచి విత్తనం, సబ్సిడీ, రుణాలు, రవాణా, లేబర్ తదితర సౌకర్యాలు కల్పించవలసి ఉందని తెలిపారు. చెరకు వాతావరణ పరిస్థితుల్ని తట్టుకొని నిలిచే పంట కనుక అన్ని విధాలుగా ప్రభుత్వం నుండి రైతుకు సహకారం అందిస్తే ముందుకు వస్తారని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు మాట్లాడుతూ ఫ్యాక్టరీ నుండి రైతుకు కొంత సహాయం అందించేవారని, దానిని నిలిపివేయడం వల్లనే రైతు ఆసక్తి చూపడం లేదని అన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం, ప్రభుత్వం కలిసి చర్చించుకొని, రైతుకు సహకారం అందిస్తేనే చెరకు రైతుకు మేలు జరుగుతుందని, అప్పుడే ఫ్యాక్టరీ ని నిలబెట్టుకోగలమని అన్నారు.

# ఇంట్లోనే స్ట్రీట్ ఫుడ్..

మిరపకాయ బజ్జీ, ఉల్లిపాయ పకోడీ, పానీపూరీ, భేల్‌పూరి, సమోసా, ఆలూబోండా, వడాపావ్, పావ్‌భాజీ..ఎన్నెన్ని స్ట్రీట్ ఫుడ్స్! అలా వీధుల్లో నడుస్తుంటే ఆ పరిమళాలకు నోరూరినా.. వాటి మీద దుమ్మూధూళీ పడుతుందని కొనుక్కోడానికి వెనకాడతాం. అసలవన్నీ ఇంట్లోనే చేసుకుంటే,, ఎంచక్కా తినొచ్చు కదా! మీ కోసం కొన్ని.



## కచోరీ



**కావలసినవి:** మైదాపిండి 2 కప్పులు, ఉప్పు, నూనె తగినంత, నెయ్యి 2 టేబుల్ స్పూన్లు,స్టఫింగ్ కోసం: పెసరపప్పు అర కప్పు, కారం రెండు చెంచాలు, ఛాట్ మసాలా, ధనియాల పొడి, ఆమ్చూర్ పౌడర్ చెంచా చొప్పున, నెయ్యి 2 చెంచాలు.

తయారీ, మైదాపిండిలో కొన్ని నీళ్లు, కాస్త ఉప్పు, నెయ్యి, నూనె వేసి బాగా కలిపి అరగంట పక్కనుంచాలి. పెసరపప్పును రెండు గంటలు నానబెట్టాలి. నీళ్లు వడకట్టేసి కొంచెం బరకగా గ్రైండ్ చేయాలి. ప్యాన్‌లో నూనె వేడయ్యాక పెసరపప్పు ముద్దను వేయించాలి. అందులో నెయ్యి, కారం, ఉప్పు, చాట్ మసాలా, ధనియాల పొడి, ఆమ్‌చూర్ పౌడర్ జతచేసి ఇంకాస్త వేగనిచ్చి దించాలి. మైదాపిండిని చిన్న భాగాలుగా విడగొట్టి పూరీల్లా వత్తుకోవాలి. ఒక్కో పూరీ మీద రెండు చెంచాల స్టఫింగ్ను ఉంచి అంచులను దగ్గరగా చేసి.. చేత్తో తట్టి కచోరీ చేయాలి. అన్నీ అయ్యాక కాగుతున్న నూనెలో వేయిస్తే సరి..

## షాహీ టుకడా

**కావలసినవి:** బ్రెడ్ స్లైసులు 8, పంచదార ముప్పావు కప్పు, పాలు 5 కప్పులు, నెయ్యి పావు కప్పు, యాలకుల పొడి అర చెంచా, కుంకుమ పువ్వు కాస్త, పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులు అన్నీ కలిపి ముప్పావు కప్పు

**తయారీ:** పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులను నేతిలో వేయించాలి. అడుగు భాగం మందంగా ఉన్న పాత్రలో పాలు పోసి మధ్యలో కలియ తిప్పుతూ మరిగించాలి. పాలు చిక్కగా అయ్యాక.. యాలకుల పొడి, డ్రైఫ్రూట్స్ పలుకులు, కుంకుమ పువ్వు వేసి, ఇంకో రెండు నిమిషాలు దించేస్తే రబ్రీ తయారైపోతుంది. పంచదార పాకం తయారుచేయాలి. బ్రెడ్సుల అంచులను తీసేసి, ఒక్కో బ్రెడ్ని రెండు ముక్కలుగా కట్ చేయాలి. వీటిని పెనం మీద నేతితో బంగారు రంగు వచ్చే వరకూ వేయించి, పంచదార పాకంలో ముంచి తీయాలి. తినేటప్పుడు ఈ స్లైసుల మీద తగినంత రబ్డీ వేసుకుంటే సరి... షాహీ తుకణాలను ఆనందంగా ఆస్వాదించవచ్చు.

## అక్కీ రోటీ

**కావలసినవి:** బియ్యప్పిండి 2 కప్పులు, ఉల్లి, కొత్తిమీర, సోయకూర తరుగు పావు కప్పు చొప్పున, అల్లం అంగుళం ముక్క, పచ్చిమిర్చి 3, జీలకర్ర చెంచా, రుచికి సరిపడా, కరివేపాకు నాలుగు ఉప్పు రెబ్బలు, నూనె తగినంత **తయారీ:** అల్లం, పచ్చిమిర్చిలను కచ్చా పచ్చగా నూరాలి. వెడల్పాటి గిన్నెలో బియ్యప్పిండి, తగినన్ని నీళ్లు, ఉల్లి, కొత్తిమీర, సోయకూర తరుగు, కరివేపాకు, అల్లం, మిర్చి ముద్ద, ఉప్పు, జీలకర్ర వేసి బాగా కలపాలి. పిండిలో అన్నీ కలిసిపోయి, ఉండలు కట్టకుండా మెత్తగా అయ్యాక.. పన్నెండు భాగాలు చేసుకోవాలి. అరిటాకు లేదా పాలిథిన్ కాగితం మీద నూనె రాసి.. ఒక్కో బాల్ను చేత్తో తడుతూ రొట్టె చేసి కాలుతున్న పెనం మీద రెండు వైపులా బంగారు రంగు వచ్చేదాకా కాల్చుకుంటే సరి.. రుచికరమైన అక్కి రోటీ రెడీ,



# విదేశీ గడ్డపై భారతీయులకు ఉపాధి కల్పిస్తూ..




భర్త ఉద్యోగరీత్యా విదేశీగడ్డ మీద అడుగు పెట్టారామె. ఖతర్లో స్థిరపడినా భారత్ మీద అభిమానాన్ని కోల్పోలేదు. కాబట్టే, అక్కడ మనవాళ్లు పడుతున్న కష్టాలను గమనించారు. వారికి ఉపాధి కల్పించడమే కాదు, సాయమూ చేశారు. ఆ సేవలకు గుర్తింపుగానే నారీశక్తి పురస్కారాన్ని అందుకున్నారు...

అబ్బగౌని నందిని.

మాది మేడ్చల్ జిల్లా మజీద్పూర్. నాన్న ఉద్యోగరీత్యా హైదరాబాద్‌కి మారాం. నాకు బీబీఏ అయిపోగానే పెళ్లైంది. మావారు శ్రీధర్ ప్రోత్సాహంతో ఎంబీఏనీ పూర్తిచేశా. 2011లో మావారికి ఐతార్లో ఉద్యోగం వచ్చింది. దీంతో ఆయనతో కలిసి అక్కడి కెళ్లా. మాకు ఇద్దరమ్మాయిలు. వాళ్లని చూసుకుంటూనే ఉద్యోగం చేసేదాన్ని. ఒరోజు ఆఫీసుకి వెళ్తే ఏజెంట్ల చేతిలో మోసపోయిన ముస్లిం యువతి కనిపించింది. ఆమె వేదన నన్ను కదిలించింది. తనను తీసుకుని భారత రాయబార కార్యాలయానికి వెళ్లా. అక్కడి అధికారులతో మాట్లాడి, క్షేమంగా భారత్‌కు వెళ్లేలా చూశారు. ఆ సంఘటన తరవాత వలస కార్మికులుగా వచ్చిన మనవాళ్ల ఇబ్బందులెన్నో కనిపించాయి. వాళ్లకి సాయపడాలి అనిపించింది. అందుకే ఉద్యోగం మాని, వీళ్లకి సాయం చేయడంపైనే పూర్తి దృష్టి పెట్టా. ఓసారి కార్మికవాడకు వెళ్లినప్పుడు 20 మంది భారతీయులు తీవ్ర ఇబ్బందులు పడటం చూశారు. ముందు వాళ్లందరికీ భోజనాలు పెట్టించి, వివరాలు సేకరించారు, తరవాత రాయబార కార్యాలయంతో మాట్లాడితే వారు స్పందించారు, ఆ కార్మికులను స్వదేశానికి పంపారు. గుర్తించే సమయంలో 40 మందిని ప్రత్యేక విమానాల ద్వారా భారత్‌కు పంపించాం. నిత్యం కార్మికులను సందర్శిస్తూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తాను. ఏజెంట్ల వల్ల మోసపోయిన వారికే కాదు, జైళ్లలో మగ్గుతున్న వాళ్లని విడిపించీ క్షేమంగా భారత్‌కి పంపడంలో సాయపడుతున్నా. ఇక్కడ ఇళ్లల్లో పనిచేయడానికి తెలుగు రాష్ట్రాల నుంచి మహిళలు వస్తున్నారు వారిని కలిసి మాట్లాడుతుంటారు. నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి, చిన్నచిన్న ఉద్యోగాలకు వీలుగా అరబిక్, ఆంగ్లంతోపాటు ఇతర భాషల్లో శిక్షణ ఇస్తున్నాం. ఉద్యోగరీత్యా ఇక్కడ స్థిరపడుతున్న భారతీయ కుటుంబాలు చాలానే. ఈ పిల్లలకు మన దేశం, భాష, సంస్కృతులపై అవగాహన కల్పిస్తున్నా. ఖతార్‌లోని భారతీయ సాంస్కృతిక కేంద్రం (ఐసీసీ)లో బతుకమ్మ, సంక్రాంతి, దసరా, దీపావళి వంటి పండుగలను నిర్వహించడంతోపాటు సంబంధిత పాఠాలూ బోధిస్తున్నాం. పిల్లలు, మహిళల్లో స్ఫూర్తిని కలిగించడానికి తెలుగు రాష్ట్రాల్లో ఐఎస్, ఐపీఎస్‌లు, అధికారులతో జూమ్ సమావేశాలు నిర్వహిస్తాం. మనవాళ్లే కాదు, ఖతార్ మహిళలూ వీటికి హాజరవుతుంటారు. ఐసీసీలో సభ్యురాలిగా చేరిన నేను ప్రస్తుతం సంస్థ సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలిగా ఉన్నాను. నాకు మావారి సహకారం ఎప్పుడూ ఉంటుంది. తన సంపాదనలో కొంత భాగాన్నీ సేవాకార్యక్రమాలకు కేటాయిస్తుంటారు.

**పురస్కారం..** భారత రాయబార కార్యాలయం ప్రవాసీ భారతీయ దినోత్సవం సందర్భంగా నన్ను ఖినారీశక్తి పురస్కారానికి ఎంపిక చేసింది. సమర్థ మహిళా నాయకత్వం, సేవాభావం, సమాజాభివృద్ధి, భారతీయ సంస్కృతి పరిరక్షణ. భారత్ ఐతార్ మైత్రిని బలోపేతం చేయడానికి కృషికి గుర్తింపుగా ఈ అవార్డులు ఇచ్చినట్లు చెప్పినప్పుడు చాలా సంతోషించా. నా సేవలకు దక్కిన గుర్తింపు ఇది. □

# ప్రభువే అనంతజ్ఞాని

'ఆశ్చర్యమైన ఆలోచనశక్తియు అధిక బుద్ధియు అనుగ్రహించువాడు ఆయనే' (యెషయా 28:29), 'బుద్ధి జ్ఞానముల సర్వసంపదలు ఆయనయందే గుప్తములైయున్నవి' (కొలొస్స యులకు 2:3). అవును దేవుడే అనంతజ్ఞాని. ఆయన జ్ఞానాన్ని మనం కొలవలేం. ఇంత అని వర్ణించలేం. అనంతజ్ఞాని అయిన దేవుడు తన జ్ఞానం బట్టి అతిశయించే దేవుడు కాదు. ఆయన జ్ఞానంతోనే సమస్త సృష్టిని నిర్మించాడు. మానవుడిని తయారు చేశాడు. నిరంతరం తన జ్ఞానంబట్టే ప్రపంచాన్ని ఏలుతున్నాడు. ఈలోకంలో ఎంతో తెలివితేటలు, జ్ఞానం గలవారున్నారు. తమ తెలివితేటలతో ప్రతిభను చాటుకుంటూ, ఉన్నత పదవుల్లో ఉంటూ, పేరు, డబ్బును సంపాదించుకుంటున్నారు. అయితే దేవుడు ఇలాంటి వారిని తృణీకరిస్తాడు. జ్ఞానంగల వారిని ఆయన తృణీకరించి, జ్ఞానం లేనివారిని రక్షించుకుంటున్నాడు. 'జ్ఞానులను సిగ్గుపరచుటకు లోకములోనుండు వెఱ్ఱివారిని దేవుడు ఏర్పరచుకొనియున్నాడు' (1 కొరింథీ 1:29). లోకంలో ఉన్నవారు తమ జ్ఞానంబట్టి గర్విస్తుంటారు. తమకు కలిగే పేరు, సంపదలను చూసుకుని, ఇతరులపట్ల చిన్నచూపు ఉండవచ్చు. తెలివితేటలు లేనివారిని ఎవరూ గుర్తించరు. వారిని అభిమానించేవారు కూడా ఉండదు. కానీ దేవుడికి ఇలాంటివారే కావాలి. అందుకే బలహీనులను, జ్ఞానంలేనివారిని, బలహీనులను దేవుడు తన 'రక్షణ'తో వారికి నిత్యరాజ్యాన్ని ఇస్తున్నాడు. యేసుక్రీస్తును విశ్వసించడమే అసలైన జ్ఞానం అని బైబిల్ సెలవిస్తున్నది. ప్రభువును ఎవరైతే సేవిస్తున్నారో వారే అసలైన జ్ఞానవంతులు. ఎందుకంటే ఈ జ్ఞానం తమ శక్తితో పొందినది కాదు. అది దేవుడి కృపే. అయితే ఈలోకంలో జయించాలంటే మనకూ జ్ఞానం, తెలివితేటలు అవసరం. అవి దేవుడిని అడిగితే ఆయనే ఇస్తాడు. ఎందుకంటే ఆయనే జ్ఞాని కాబట్టి, మనకు అవసరమైన తెలివితేటలు ఇచ్చి, ఇతరులతో మనల్ని సమానంగా కూర్చుండబెడతాడు. కాబట్టి దేవుడిని విశ్వసించి, ఆయన జ్ఞానంతో లోకంలో విజయపథంలో జీవిద్దాం.



-పి.వాణిపుష్ప

అంతర్వాణి

# మెరిసే జుట్టుకి గంజి

వాతావరణం మారింది. పొడిగాలకు తేను తగ్గి. జుట్టు నిర్జీవంగా మారుతుంది. మరి వాటికి తగిన పోషణ ఖరీదైన సాంపూలు, కండిషనర్లే వాడక్కర్లేదు. గంజి కూడా మేలు చేస్తుంది. చైనీస్, కొరియన్ బ్యూటీ కేడీ దీనికి ప్రత్యేక ప్రాధాన్యమూ ఉంది. మరి దీన్నెలా వాడాలి? ఆ ప్రయోజనాలేంటో తెలుసుకుందామా!

గంజిలో ఇనోసిటాల్ అనే కార్బోహైడ్రేట్ జుట్టు కుదుళ్లని బలాన్ని ఇస్తుంది. ఒత్తుగా ఎదిగేలా చేస్తుంది. ఇందులో కాస్త నిమ్మరసం కలిపి పెడితే మెరుపు కనిపిస్తుంది. ఉడికించిన అన్నం నీళ్లల్లో విటమిన్ బి, ఇ, సి విటమిన్లుఉంటాయి. ఇవి వెంట్రుకలకు పోషణ అందించి ఆరోగ్యంగా మారుస్తాయి. కండిషనర్గా వాడితే జుట్టు చిట్లడం తగ్గుతుంది. పొడవూ జుట్టు బిరుసుగా మారిందా? అయితే, గోరువెచ్చగా ఉన్నపుడే గంజిని తలకు పట్టించి ఓ పదిహేను నిమిషాలు వదిలేయండి. ఇది కురులను మెత్తగా మారుస్తుంది. ఇందులోని నేచురల్ ప్రొటీన్... జుట్టుకి సహజంగా నిగారింపుని తెస్తుంది. □

# తోబుట్టువులే తోడు నీడగా..



నాటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో.. ఒక్కో ఇంట్లో పదిమంది దాకా పిల్లలు కనిపించేవారు. అంతమంది ఉన్నా.. అన్యోన్యంగా కలిసి మెలిసి ఆడుకునేవారు. నేటికాలంలో ఇంట్లో ఇద్దరే ఉన్నా.. చీటికి మాటికి గొడవలు పడుతున్నారు. రాజీకి రాలేకపోతున్నారు. ఇందుకు పెద్దలపర్యవేక్షణ లేకపోవడం ఒక కారణమైతే.. తల్లిదండ్రుల తీరికలేని జీవనశైలి మరో కారణమని మానసిక నిపుణులు చెబుతున్నారు. ఇలాగే కొనసాగితే, వయసుతోపాటే వారిమధ్య దూరం కూడా పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా జరగకూడదంటే.. చిన్నప్పుడే తోబుట్టువుల మధ్య ప్రేమ, అనురాగాలను పెంచేందుకు తల్లిదండ్రులుచొరవ చూపాలని సూచిస్తున్నారు.

**పక్షపాతం పనికిరాదు.....**పిల్లల విషయంలో పక్షపాతం ఏమాత్రం పనికిరాదు. తోబుట్టువులు అన్నాక.. గొడవలు సాధారణమే! అలాంటి సమయాల్లో ఇద్దరి సమస్యలనూ పూర్తిగా వినాలి. ఒకరివైపే వకాల్తా పుచ్చుకొని.. వారు చెప్పిందే విని తుది నిర్ణయం తీసుకోవద్దు. ఇలా చేయడం వల్ల ఎదుటివారు మానసిక క్షోభకు గురవుతారు. తోటివారిపై విద్వేషం పెంచుకుంటారు. అలాకాకుండా ఉండాలంటే.. ఇద్దర్నీ కూర్చోబెట్టి మాట్లాడాలి. ఇద్దరి వివరణలూ విని.. అన్ని రకాలుగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. అప్పుడే పిల్లల మధ్య నైతిక సంబంధాలు మెరుగు పడుతాయి. స్నేహపూర్వక వాతావరణం అలవడుతుంది.

**పోలికలతో పోటీనే.....** పిల్లల్ని ఒకరితో మరొకరిని ఎట్టి పరిస్థితుల్లోనూ పోల్చ వద్దు.'అక్కను చూసి నేర్చుకో!' అనో.. 'అన్నను చూసి బుద్ధి తెచ్చుకో!' అనో అస్సలు అనొద్దు. అలా పోలిక పెడితే.. వారి మధ్య పోటీ పెడు తున్నట్టే! ఒకరిని పొగడటం.. మరొకరిని తిట్టడం.. పిల్లల మానసిక స్థితిపై ప్రభావం చూపుతుంది. వారిలో ఒకరిపై ఒకరికి తెలియ కుండానే కోపతా పాలు పెరుగు తాయి. దీంతో.. ఇద్దరి మధ్యా తరచుగా తగువులూ అవుతుంటాయి.

**బంధం బలపడేలా.....** పిల్లల మధ్య విద్వేషాలు రగిలితే.. పెద్దయ్యాక కూడా కొనసాగే అవకాశం ఉంటుంది. అందుకే, బాల్యంలోనే వారిలో విద్వేషాలను తొలగిం చాలి. వారి మధ్య స్నేహపూర్వక వాతావరణం కల్పించాలి. వారితో ఇద్దరూ కలిసి ఆడే సరదా ఆటలను ఆడించాలి. ఫన్నీ టాస్కులు అప్పగించి.. ఇద్దరూ కలిసి చేసేలా ప్రోత్సహించాలి. దీనివల్ల ఒకరి గురించి మరొకరు పూర్తిగా తెలుసుకుంటారు. ఒకరికొకరు సాయం చేసుకోవడం.. బొమ్మలను పంచుకోవడం, పరస్పరం సంతోషంగా ఉండటం.. □



# 'స్కై' సినిమా ప్రీ రిలీజ్

మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి, ఆనంద్ ప్రధాన పాత్రల్లో వేలార్ ఎంటర్ టైన్ మెంట్ స్టూడియోస్ బ్యానర్ పై నాగిరెడ్డి గుంటక, శ్రీలక్ష్మి గుంటక, మురళీ కృష్ణంరాజు, పృథ్వీ పెరిచర్ల నిర్మిస్తున్న సినిమా "స్కై". పృథ్వీ పెరిచర్ల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంతో శివ ప్రసాద్ అనే కొత్త మ్యూజిక్ డైరెక్టర్ ఇండస్ట్రీకి పరిచయమవుతున్నారు. "స్కై" సినిమా ఫిబ్రవరి 6న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు "స్కై" సినిమా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ ను ప్రముఖ దర్శక నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలోమ్యూజిక్ డైరెక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ సినిమా ఇండస్ట్రీ మీద ప్యాషన్ తో చిన్న స్థాయి నుంచి మ్యూజిక్ డైరెక్టర్ గా ఎదిగాను. అన్నారు.నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఈవెంట్ కు వచ్చే ముందు "స్కై" సినిమా కంటెంట్, సాంగ్స్ చూశాను. ఆ కంటెంట్ చూస్తుంటే ఈ మూవీలో ఒక ఇంటెన్స్ లవ్ స్టోరీ చూడబోతున్నామని తెలుస్తోంది. పొడ్యూసర్ నాగిరెడ్డి గుంటక మాట్లాడుతూ ఈ రోజు మా మూవీ ప్రెస్ మీట్ కు వచ్చిన మధుర శ్రీధర్ గారికి థ్యాంక్స్. "స్కై" సినిమాను మేమంతా ఎంతో కష్టపడి ప్రొడ్యూస్ చేశాం. టీమ్ అందరూ ప్యాషనేట్‌గా వర్క్ చేశారు.. అన్నారు.

# 'అనగనగా ఒక రాజు' విజయోత్సవం



కష్టానికి తగిన ప్రతిఫలం వస్తుందని చెప్పడానికి ఉదాహరణ ఈ ఖిఅనగనగా ఒక రాజుఖి చిత్రం: ప్రముఖ నిర్మాత, టీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజుమెగాస్టార్ చిరంజీవి గారు మెచ్చిన హీరో నవీన్ పొలిశెట్టి: ప్రముఖ దర్శకుడు బాబీ కొల్లి సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో అడుగుపెట్టి, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రేక్షకుల మనసు దోచుకున్న చిత్రం 'అనగనగా ఒక రాజు'. స్టార్ ఎంటర్‌టైనర్ నవీన్ పొలిశెట్టి కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం రూ.100 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి, సంచలన విజయాన్ని అందుకుంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రానికి నూతన దర్శకుడు మారి దర్శకత్వం వహించారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటించారు. దిల్ రాజు మాట్లాడుతూ.. "అనగనగా ఒక రాజు చిత్ర బృందానికి నా శుభాకాంక్షలు. నిర్మాత నాగవంశీకి ప్రత్యేక అభినందనలు. ప్రముఖ దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ.. 'టైమ్ బాగుంటే హీరో అవుతారు అంటుంటారు. కానీ టైమింగ్ బాగుండి హీరో అయినవాడు నవీన్ పొలిశెట్టి. స్టార్ ఎంటర్‌టైనర్ నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ.. "మా సినిమాలో ఒక డైలాగ్ ఉంది. రాజు గారి పెళ్లి ఏడు తరాలు అటు, ఏడు తరాలు ఇటు గుర్తుండిపోద్దని. అలాగే ఈ సంక్రాంతి మా అందరికీ ఏడు తరాలు అటు, ఏడు తరాలు ఇటు గుర్తుండిపోతుంది. ధన్యవాదాలు.

# తెర

## 'శ్రీనివాస మంగాపురం'లో రవీనా టాండన్ కుమార్తె రాషాథడానీ



'శ్రీ 100', మంగళవార్ం చిత్రాలలో ప్రశంసలు పొందిన దర్శకుడు అజయ్ భూపతి, ప్రస్తుతం మరో క్రేజీ ప్రాజెక్ట్ 'శ్రీనివాస మంగాపురం' కు దర్శకత్వం వహిస్తున్నారు. సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్ బాబుల వారసత్వాన్ని కొనసాగిస్తూ, జయ కృష్ణ ఘట్టమనేని ఈ చిత్రంతో వెండితెరకు పరిచయం అవుతున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె, ఉయ్ అమ్మ పాటతో గుర్తింపు పొందిన రాషాథడానీ కూడా తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేస్తోంది. సక్సెస్ ఫుల్ నిర్మాత అశ్విని దత్ ఈ ప్రాజెక్ట్‌ను సమర్పిస్తుండగా, చందమామ కథల్ బ్యానర్ పై నిర్మాత పి.కిరణ్ దీనిని నిర్మిస్తున్నారు. టైటిల్ రివిల్, ఆకట్టుకునే ఫస్ట్ లుక్ పోస్టర్‌తో ఈ సినిమా ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ రోజు, ఈ చిత్రం నుంచి రాషా థడానీ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు, ఇందులో ఆమెను మంగ్త పాత్రలో పరిచయం చేశారు. సాంప్రదాయ దుస్తులలో రాషా అద్భుతంగా కనిపిస్తోంది, హుందాతనం, బలమైన స్క్రీన్ ప్రెజెన్స్ తో ఆకట్టుకుంది. మోషన్ పోస్టర్‌లో ఆమె ఆకట్టుకునే లుక్స్ ఇప్పటికే ప్రేక్షకులు, సినీ వర్గాలని అలరించాయి. ఈ చిత్రం ఇటీవల 30 రోజుల పాటు సాగిన మొదటి షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. ప్రస్తుతం రెండవ షెడ్యూల్‌లోకి ఎంటర్రైయింది. ఉన్నత నిర్మాణ విలువలు, క్రియేటివ్ విజన్‌తో టీం వేగంగా ముందుకు సాగుతోంది.



# '1+1 ఆఫర్' సినిమా ట్రైలర్

నిమ్మల శ్రీరామ్, మోనిక హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా "1+1 ఆఫర్". ఈ చిత్రంలో రాజేష్ భూపతి, రోహిత్, బాలాజీ, సురేష్ కుమార్ యాదవ్, జీవన్, రామ్ (కేపి పాల్ ఫేమ్)ఇతర కీలక పాత్రల్లో నటించారు .ఈ చిత్రాన్ని త్రివేణి పిక్చర్స్ బ్యానర్ పై వి.వేణుగోపాల్ రెడ్డి నిర్మించారు .ఏఎస్ఆర్ (శ్రీరామ్) దర్శకత్వం వహించారు. సరికొత్త కథా కథనాలతో కంటెంట్ ఓరియెంటెడ్ మూవీగా రూపొందిన "1+1 ఆఫర్" సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. శుక్రవారం హైదరాబాద్ ఫిలింఛాంబర్ లో దర్శకుడు వి. సముద్ర, నటుడు 30 ఇయర్స్ పృథ్వీ చేతుల మీదుగా ఈ చిత్ర ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విలన్ రాజేష్ మాట్లాడుతూ "1+1 ఆఫర్" చిత్ర ట్రైలర్ లాంఛ్ చేసేందుకు వచ్చిన సముద్ర గారికి, పృథ్వీ గారికి థ్యాంక్స్. అన్నారు.హీరోయిన్ మోనిక మాట్లాడుతూ ఈ సినిమాలో హీరోయిన్ గా నటించే అవకాశం రావడం హ్యాపీగా ఉంది. అన్నారు.దర్శకుడు వి సముద్ర మాట్లాడుతూ "1+1 ఆఫర్" ట్రైలర్ చాలా బాగుంది. ఈ సినిమాతో వన్ ప్లస్ హండ్రెడ్ అనేలా దర్శకుడు శ్రీరామ్ గారు వంద సినిమాలు చేయాలి. . అన్నారు.30 ఇయర్స్ పృథ్వీ మాట్లాడుతూ రాజేష్ మంచి ప్రతిభ గల నటుడు . హీరోగా "1+1 ఆఫర్" సినిమా ఆయనకు గుర్తింపు తీసుకురావాలి అన్నారు.

# 'అమరావతికి ఆహ్వానం' టీజర్



శివ కంఠ మనేని, ధన్య బాలకృష్ణ, ఎస్తేర్, సుప్రిత, హరీష్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన సినిమా "అమరావతికి ఆహ్వానం". ఈ మూవీలో సీనియర్ నటులు అశోక్ కుమార్, భద్రమ్, జెమిని సురేష్, నాగేంద్ర ప్రసాద్ ఇతర కీలక పాత్రలు పోషించారు. డైరెక్టర్ జీవీకే ఈ మూవీని తెరకెక్కించారు. ప్రముఖ నిర్మాత ముప్పా వెంకయ్య చౌదరి గారి నిర్మాణ సారథ్యంలో జి. రాంబాబు యాదవ్ సమర్పణలో లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బేనర్‌పై కేఎస్ శంకర్‌రావు, ఆర్ వెంకటేశ్వర రావు ఈ సినిమాను నిర్మించారు. శుక్రవారం హైదరాబాద్ లో ఈ సినిమా టీజర్ ను ప్రఖ్యాత నిర్మాత నటులు మురళీ మోహన్ గారు రిలీజ్ చేశారు. "అమరావతికి ఆహ్వానం" సినిమా ఫిబ్రవరి 13న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ్ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో..నటుడు అశోక్ కుమార్ మాట్లాడుతూ నిర్మాత వెంకటేశ్వరరావు గారు మా బావగారు. ఆయన అడగటంతో ఈ సినిమాలో నటించాను. ప్రముఖ నటులు నిర్మాత మురళీ మోహన్ మాట్లాడుతూ "అమరావతికి ఆహ్వానం" సినిమా టీజర్ చాలా బాగుంది. ఈ మూవీ కంటెంట్ చూస్తుంటే తప్పకుండా విజయం సాధిస్తుందని నమ్మకం కలుగుతోంది. ఈ నిర్మాతలు గతంలో కూడా చిన్న బడ్జెట్ లో మంచి చిత్రాలు చేశారు. అన్నారు.ప్రొడ్యూసర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మాకు సినిమా ఇండస్ట్రీతో 30 ఏళ్లకు పైగా అను బంధం ఉంది. సినిమాలు చేయాలంటే డబ్బులు కావాలని రియల్ ఎస్టేట్ మార్గాన్ని ఎంచుకు న్నాం. అన్నారు. హీరోయిన్ ఎస్తేర్ మాట్లాడుతూ "అమరావతికి ఆహ్వానం" సినిమా టీజర్ చూస్తున్నప్పుడు అందులోని యాక్టర్స్ అంతా నిజంగానే ఒక ఫ్యామిలీ కావొచ్చనే ఫీలింగ్ మీకు ఎలా కలిగిందో షూటింగ్ చేసేప్పుడు మా యూనిట్ అందరం ఒక ఫ్యామిలీ అనే భావన మా అందరిలో కలిగింది. డైరెక్టర్ జీవీకే మాట్లాడుతూ హీరో శివ కంఠమనేని మాట్లాడుతూ 'మేము కలిసి గతంలో 'అక్కడొకడుంటాడు, మధురపూడి గ్రామం అనే నేను, రాఘవరెడ్డి, బిగ్ బ్రదర్' వంటి మూవీస్ చేశాం. ఇప్పుడు "అమరావతికి ఆహ్వానం" చిత్రంతో మీ ముందుకు వస్తున్నాం అన్నారు.

# 'విత్ లవ్' ట్రైలర్ లాంచ్



అభిషన్ జీవింత్, అనస్వర రాజన్ ప్రధాన పాత్రలలో నటించిన ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'విత్ లవ్'. మదన్ రచన, దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని సౌందర్య రజనీకాంత్‌తో పాటు నజరత్ పసిలియన్, మహేష్ రాజ్ పసిలియన్ ఎంఆర్‌పి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సంయుక్తంగా నిర్మించారు. ఖివిత్ లవ్ఖి చిత్రం ఫిబ్రవరి 6, 2026న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. తెలుగు థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్ సురేష్ ప్రొడక్షన్స్ నిర్వహిస్తోంది. తాజాగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో హీరో రానా దగ్గుబాటి మాట్లాడుతూ.. అందరికీ హాయ్. చెప్పలేని ప్రేమ గురించి ఇక్కడ అంతా చాలా బ్యూటిఫుల్ గా మాట్లాడారు. ట్రైలర్ చూసిన అందరూ కూడా చాలా కనెక్ట్ అయ్యారు. . థాంక్యూ. హీరో అభిషన్ జీవింత్ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. టూరిస్ట్ ఫ్యామిలీకి మీరందరూ గొప్ప ఆదరణ ఇచ్చారు. హీరోయిన్ అనస్వర రాజన్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ట్రైలర్ చూసిన తర్వాత మీరందరూ కరెక్ట్ అవడం చాలా ఆనందంగా ఉంది. ప్రొడ్యూసర్ సౌందర్య రజనీకాంత్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమాని తెలుగులోకి తీసుకురావడం నాకు చాలా ఆనందంగా ఉంది. రానా చైల్డ్ చైల్డ్హుడ్ ఫ్రెండ్. తనతో నాకు ఎన్నో బాల్య జ్ఞాపకాలు ఉన్నాయి.



## థాయ్‌లాండ్ మాస్టర్స్ ఫైనల్స్‌కు దేవిక

**న్యూఢిల్లీ:** థాయ్‌లాండ్ మాస్టర్స్-2026లో భారత్ షట్లర్ దేవిక సిహాగ్ దూసుకెళ్లింది. థాయిలాండ్ మాస్టర్స్ సూపర్ 300లో నిలిచిన ఏకైక భారతీయురాలు దేవిక సిహాగ్ శనివారం మహిళల సింగిల్స్ ఫైనల్‌కు చేరుకుంది. సెమీఫైనల్స్‌లో దేవిక 22-20, 21-13 తేడాతో చైనీస్ తైపీకి చెందిన ఐదో సీడ్ హువాంగ్ యు హ్సున్ పై కేవలం 38 నిమిషాల్లోనే విజయం సాధించింది. దేవిక తొలి గేమ్‌లో 15-20తో వెనుకబడి ఉంది. అయితే తదుపరి దూకుడుతో 7 పాయింట్లతో తొలి గేమ్‌ను కైవసం చేసుకుంది. రెండో గేమ్‌లో సిహాగ్ జోరు పెంచి వరుస గేమ్‌లలో మ్యాచ్‌ను ముగించడంలో ఎటువంటి తప్పిదానికి అవకాశం ఇవ్వకుండా విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. అంతకు ముందు క్వార్టర్ ఫైనల్స్‌లో దేవిక వరల్డ్ 16వ ర్యాంకర్, థాయిలాండ్‌కు చెందిన సుపానిడా కటేథాంగ్‌పై సంచలన విజయం సాధించింది. ప్రపంచ ర్యాంక్‌లో 63వ స్థానంలో ఉన్న దేవిక, టాప్ సీడ్ కేటెథాంగ్‌ను 21-19, 21-18 తేడాతో వరుస గేమ్‌లలో ఓడించింది. ఇక పురుషుల సింగిల్స్‌లో మన్నెపల్లి తరుణ్ చైనాకు చెందిన జు జువాన్ చెన్ చేతిలో కేవలం 37 నిమిషాల్లో 11-21, 17-21 తేడాతో వరుస గేమ్‌లలో ఓడిపోయాడు. అలాగే మహిళల సింగిల్స్‌లో మలేషియాకు చెందిన వాంగ్ లింగ్ చింగ్ తో గంటా నాలుగు నిమిషాలు జరిగిన ఈ పోటీలో ఇషారాణి బారువా 21-18, 16-21, 13-21 తేడాతో పరాజయం చెందింది.




## మహిళల కబడ్డీ ఛాంపియన్‌గా హర్యానా

**న్యూఢిల్లీ:** 72వ మహిళల సీనియర్ జాతీయ కబడ్డీ ఛాంపియన్‌షిప్ 2026లో హర్యానా జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ఈ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో డిపెండింగ్ ఛాంపియన్స్ ఇండియన్ రైల్వేస్‌పై 39-37 తేడాతో విజయం సాధించిన హర్యానా టైటిల్‌ను కైవసం చేసుకుంది. హర్యానా చివరి దశలో విజయం సాధించడానికి ముందంజలో ఉన్నా, రైల్వేస్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకునే ఒత్తిడిలో కూడా అద్భుతమైన ప్రదర్శనను అందించింది. హర్యానా తరఫున నికితా అత్యుత్తమ ప్రదర్శన చేసి 17 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. అలాగే హర్యానా జట్టులోని రుచి తొమ్మిది పాయింట్లతో బలమైన మద్దతును అందించగా, రాజ్ రాణి దాడులలో హర్యానాను నియంత్రణలో ఉంచడానికి దోహదపడింది. మ్యాచ్ కీలక దశల్లో ఆమె జట్టుకు మద్దతు ఇచ్చింది. ఇండియన్ రైల్వేస్ తరఫున పూజ 11 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. పూజకు సోనాలి షింగేట్ నుండి మరో బలమైన ఆల్ రౌండ్ సహకారం లభించింది. వారు ఒక్కొక్కరు ఆరు పాయింట్లు జోడించారు. ఆలస్యంగా ముందుకు సాగినప్పటికీ నాకౌట్ దశల్లో హర్యానా స్థిరమైన ప్రదర్శనలతో టైటిల్‌ను గెలుచుకుంది. క్వార్టర్ ఫైనల్స్‌లో మధ్యప్రదేశ్‌ను అద్భుతంగా ఓడించిన తర్వాత, హర్యానా టోర్నమెంట్‌కు ముందు ఫేవరెట్‌గా ఉన్న హిమాచల్‌ప్రదేశ్‌ను సెమీఫైనల్‌లో ఓడించింది. మరోవైపు, ఇండియన్ రైల్వేస్ టోర్నమెంట్ అంతటా తమ అనుభవాన్ని ప్రదర్శించింది. క్వార్టర్ ఫైనల్స్‌లో మహారాష్ట్ర, సెమీ ఫైనల్స్‌లో తమిళనాడుపై ఘన విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. టైటిల్ పోరులో తృటిలో ఓడిపోయే ముందు కూడా పోటీలో అత్యంత నిలకడగా రైల్వేస్ జట్టు పట్టుదలతో వ్యవహరించింది. ఇక సెమీఫైనలిస్టులుగా ఓడిన హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు జట్లకు కాంస్య పతకాలు లభించాయి.

# ఆస్ట్రేలియా ఓపెన్ విజేతగా రిబకినా

## హోరాహోరీ పోరులో సబలెంకా ఓటమి



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా ఓపెన్-2026 మహిళల సింగిల్స్ విజేతగా కజకిస్తాన్ స్టార్ ఎలెనా రిబకినా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్ పోరులో ప్రపంచ నంబర్ 1 ఆర్యనా సబలెంకాపై 6-4, 4-6, 6-4 తేడాతో విజయం సాధించిన రిబకినా తొలి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ఌ దక్కించుకుంది. ఈ ఫైనల్ మ్యాచ్‌లో చివరి వరకూ నువ్వానేనా అన్నట్లు సాగింది. తొలి సెట్‌లో నిలకడైన ఆటతో 6-4 తేడాతో రిబకినా గెలుచుకుంది. అనంతరం సబలెంకా తన మార్కు పవర్ హిట్టింగ్‌తో పుంజుకుంది. ఈ సెట్‌లో రిబకినాను 6-4 తేడాతో ఓడించిన సబలెంక మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో సెట్‌కు తీసుకెళ్లింది. ఈ సెట్‌లో కూడా సబలెంకా సత్తా చాటింది. వరుస గేమ్‌లు గెలుస్తూ 3-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే రెండుసార్లు బ్రేక్ చేసిన రిబకినా 6-4 తేడాతో సెట్‌ను సొంతం చేసుకుంది.

# డబ్ల్యుపిఎల్ ఫైనల్‌లో బెంగళూరు

## రెండో ప్లేస్‌లో గుజరాత్.. మూడో స్థానానికి గట్టి పోటీ

**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) 2026 చివరి అంకానికి వచ్చేసింది. యూపీ వారియర్జ్ పై విజయం సాధించి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు డబ్ల్యూపీఎల్ 2026 సీజన్‌లో ఫైనల్‌లో అడుగుపెట్టిన తొలి జట్టుగా నిలిచింది. ఈ సీజన్‌లో లీగ్ దశలో అన్ని మ్యాచ్‌లు (ఎనిమిది) ఆడిన ఆర్‌సీబీ ఆరు విజయాలను సాధించి +1.247 నెట్ రన్ రేటు కలిగి 12 పాయింట్లతో పాయింట్ల పట్టిక లో అగ్రస్థానాన్ని ఖాయం చేసుకుంది. ఆర్‌సీబీతో పాటు, గుజరాత్ జయింట్స్, ముంబై ఇండియన్స్ 8 మ్యాచ్‌లు ఆడగా, మిగిలిన రెండుజట్లు తలా 7మ్యాచ్‌లు ఆడేశాయి. ఇక లీగ్ దశలో ఏ జట్టు ఆర్‌సీ బీ పాయింట్లను దాటడం కాదు కదా సమం చేసే అవకాశం లేదు. ఈ క్రమంలోనే ఆర్‌సీబీ ఫైనల్‌కు చేరుకుంది. లీగ్ నిబంధనల ప్రకారం టేబుల్ టాపర్ (పాయింట్ల పట్టికలో అగ్రస్థానం) జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. పాయింట్ల పట్టికలో రెండు, మూడు స్థానాల్లో నిలిచిన జట్లు ఎలిమినేటర్ మ్యాచ్ ఆడతాయి. ఇందులో గెలిచిన జట్టు ఫైనల్ కు చేరుకుంటుంది. ఇప్పటికే





బెంగళూరు ఫైనల్ చేరుకోవడంతో మిగిలిన రెండు స్థానాల కోసం ఏకంగా 2 జట్లు పోటీపడుతున్నాయి. ఈ సీజన్‌లో గుజరాత్ ఇప్పటి వరకు 8 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 5 మ్యాచ్‌ల్లో విజయం సాధించి -0.168 నెట్ రన్ రేట్‌తో 10 పాయింట్లతో పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతోంది. గుజరాత్ తమ చివరి లీగ్ మ్యాచ్ ముంబైపై విజయం సాధించడంతో ఎలిమినేటర్ మ్యాచ్‌కు అర్హత సాధించింది. అలాగే ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ముంబై ఇండియన్స్ 8 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో మూడు మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. ప్రస్తుతం ఆ జట్టు ఖాతాలో -0.059 నెట్ రన్ రేట్, ఆరు పాయింట్లుతో పట్టికలో మూడో స్థానంలో ఉంది. ఇక ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఢిల్లీ క్యాపిటల్స్ ఏడు మ్యాచ్‌లు ఆడింది.

మూడుమ్యాచ్‌ల్లో గెలిచి 6పాయింట్లతో పట్టికలో నాలుగోస్థానంలో కొనసాగుతోంది. తన చివరి మ్యాచ్‌ను యూపీతో ఆడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే ముంబై వర్సెస్ గుజరాత్ మ్యాచ్‌తో సంబంధం లేకుండా ఎలిమినేటర్‌కు అర్హత సాధిస్తుంది. ఓడిపోతే మాత్రం ఇతర జట్ల ఫలితాలు, రన్‌రేట్ లెక్కల పై ఆధాపడి ఉంటుంది. యూపీ వారియర్జ్ ఇప్పటి వరకు ఏడు మ్యాచ్‌లు ఆడింది. ఇందులో రెండు మ్యాచ్‌ల్లోనే విజయం సాధించింది. నాలుగు పాయింట్లతో చివరి స్థానంలో నిలిచింది, ఈ జట్టు ఎలిమినేటర్‌కు అర్హత సాధించాలంటే ముందుగా ఢిల్లీ పై భారీ తేడాతో గెలుపొందాలి. అప్పుడు అన్ని జట్ల పాయింట్లు సమమైనా నెట్‌రన్‌రేటు మెరుగ్గా ఉంటే యూపీ ఎలిమినేటర్‌కు అర్హత సాధిస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో యూపీ ఎలిమినేటర్‌కు చేరుకోవాలంటే ఏదైన అద్భుతం జరగాల్సిందే.




## ప్రపంచ అథ్లెటిక్స్ మీట్‌లో

# తేజస్విన్‌కు హైజంప్ టైటిల్

**న్యూఢిల్లీ:** ప్రపంచ అథ్లెటిక్స్ కాంస్య మీట్ 2026, డెలాస్ డాడ్స్ ఇన్విటేషనల్‌లో హైజంప్ టైటిల్‌ను తేజస్విన్ శంకర్ కైవసం చేసుకున్నాడు. అమెరికాలోని మాన్‌హట్టన్‌లో శనివారం జరిగిన ఈ పోటీలో పారిస్ ఒలింపిక్ రజత పతక విజేత షెల్బీ మెక్‌వెన్‌ను ఓడించి సంచలన విజయం సాధించాడు. ఈ టోర్నీలో శంకర్ అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు, మొదటి ప్రయత్నంలోనే 2.26 మీటర్ల వరకు అన్ని మార్కులను సాధించి హోమ్ ఫేవరెట్ షెల్బీని అధిగమించాడు. అతడు 2.26 మీటర్లతో తన మూడు ప్రయత్నాలలోనూ విఫలమైన తర్వాత 2.22 మీటర్లతో రెండవ స్థానంలో నిలిచాడు. ఫిబ్రవరి 2023లో బోస్టన్‌లో 2.26 మీటర్ల దూరంతో ఇండోర్ హైజంప్ టైటిల్‌ను గెలుచుకున్న తర్వాత శంకర్ చేసిన అత్యుత్తమ ప్రయత్నం ఇది.



## టి 20లో పాక్ గెలుపు

### 90 రన్స్ తేడాతో ఆస్ట్రేలియా ఓటమి

**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచ కప్ కోసం పాకిస్తాన్ అద్భుతంగా సిద్ధమవుతోంది. మొదటి టీ20 గెలిచిన తర్వాత, పాక్ లాహోర్‌లో శనివారం జరిగిన రెండవ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాను నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 90 పరుగుల తేడాతో ఓడించింది. 199 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆస్ట్రేలియా 15.4 ఓవర్లలో 108 పరుగులకే ఆలౌట్ అయింది. అబ్రార్ అహ్మద్, షాదాబ్ ఖాన్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అంతకుముందు, పాకిస్తాన్ కెప్టెన్ సల్మాన్ అఘా కేవలం 40 బంతుల్లో 76 పరుగులు చేసి పాకిస్తాన్ 198 పరుగులు చేసింది. వికెట్ కీపర్ బ్యాటర్ ఉస్మాన్ ఖాన్ కూడా 36 బంతుల్లో 53 పరుగులు చేసి అర్ధ సెంచరీ చేశాడు. అయితే, స్టార్ బ్యాటర్ బాబర్ అజామ్ 5 బంతుల్లో కేవలం 2 పరుగులకే అవుట్ అయ్యాడు. ఆస్ట్రేలియా తరపున ఐదుగురు బౌలర్లు ఒక్కొక్కరు వికెట్ తీసుకున్నారు, ఆడమ్ జంపా జట్టులో కీలక ఆటగాడు. ఇక ఆస్ట్రేలియా సిరీస్‌లో 1-0 తేడాతో వెనుకబడి ఉంది.

## టాటా స్టీల్ చెస్‌లో అర్జున్, ప్రజ్ఞాఓటమి

**న్యూఢిల్లీ:** విజ్క్ ఆన్ జీలో జరిగిన 2026 టాటా స్టీల్ చెస్ మాస్టర్స్‌లో రౌండ్ 11 మ్యాచ్‌లలో భారత గ్రాండ్‌మాస్టర్లు ఎరిగైసి అర్జున్, ప్రజ్ఞానంద రమేష్‌బాబు ఇద్దరూ ఓడిపోయారు. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో తెల్లటి పావులు కలిగిన అర్జున్ 2025 ఫిడే ప్రపంచ కప్ విజేత జావోఖిర్ సిందరోవ్ కంటే వెనుకబడిపోయాడు. టైటిల్ కోసం పోటీ ముమ్మరం కావడంతో ఉజ్బెక్ గ్రాండ్‌మాస్టర్ లీడర్ నోడిర్‌బెక్ అబ్దుసత్తోరోవ్‌తో కలిసి అగ్రస్థానంలో నిలిచే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో, ప్రజ్ఞానంద జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్ చేతిలో ఓడిపోయాడు, ఇది టోర్నమెంట్‌లో అతని మూడవ ఓటమిని సూచిస్తుంది. మరోవైపు, ప్రస్తుత ప్రపంచ చెస్ ఛాంపియన్ దొమ్మరాజు గుకేష్ తోటి భారతీయుడు అరవింద్ చితంబరంతో జరిగిన మ్యాచ్‌లో తెల్లటి ముక్కలతో డ్రాగా ముగించాడు. కేవలం రెండు రౌండ్ల ఆట మిగిలి ఉండగా, 11 రౌండ్ల తర్వాత 5.5 పాయింట్లతో గుకేష్ ఎనిమిదో స్థానంలో నిలిచి అత్యుత్తమ స్థానంలో నిలిచాడు. టాటా స్టీల్ మాస్టర్స్ ప్రస్తుత ఛాంపియన్ ప్రజ్ఞానంద 4.5 పాయింట్లతో



11వ స్థానంలో ఉన్నాడు. 14 మంది ఆటగాళ్ల ఫీల్డ్‌లో అరవింద్ మరియు అర్జున్ చెరో 4 పాయింట్లతో 12వ మరియు 13వ స్థానంలో ఉన్నారు.

వాణిజ్యం

## వెండి, బంగారం ధరల్లో అనూహ్య పతనం!



**న్యూఢిల్లీ,జనవరి 31:** బులియన్ మార్కెట్‌లో దూసుకునిపోయిన బంగారం వెండిధరలు వారాంతంలో ఒక్కసారిగా తగ్గిపోయాయి. అంతర్జాతీయ విపణిలో ఔన్స్ బంగారం ఒక్కరోజులో 594 డాలర్లు క్షీణించి 4732 డాలర్లు, వెండిధర 36 డాలర్లు క్షీణించి 78 డాలర్లకు పరిమితం అయ్యాయి. ఈప్రభావం దేశీయ బులియన్ మార్కెట్‌పై చూపించింది. 10 గ్రాముల స్వచ్ఛత బంగారం రూ.21,860కిపైగా తగ్గి రూ.1,57,840కి చేరింది. అలాగే కిలో వెండి ధర కూడా రూ.లక్షకుపైగా పతనం అయి రూ.2.99 లక్షలవద్ద స్థిరపడింది. ముందురోజు ఈ ముగింపుధరలు రూ.1,79,800గాను, రూ.3,99,600గాను కొనసాగిన సంగతి తెలిసిందే. ఇక ఎంసిఎక్స్‌లో జరిగే తులం బంగారం ఏప్రిల్ కాంట్రాక్టుధర రూ.1,80,499వద్దప్రారంభం అయి రూ.1,83,439వద్ద గరిష్టాన్ని తాకింది. ఆతర్వాత మళ్లీ దిగజారి రూ.1,50,849కి చేరుకుంది. 18శాతం క్షీణించినట్లు బులియన్ నిపుణుల అంచనా. అలాగే వెండిధరలు మార్చినెల కిలో కాంట్రాక్టుధరలు రూ.3,83,898వద్దప్రారంభం అయి రూ.3,89,986వద్ద గరిష్టస్థాయికి చేరింది ఆ తర్వాత రూ.2,91,922 వద్దకనిష్టస్థాయికి చేరుకుని అక్కడే ముగిసింది. ఈ కాంట్రాక్టుధరల్లో 27శాతం నష్టంజరిగినట్లు ట్రేడర్లు అంచనావేసారు.

# కేంద్ర బడ్జెట్: ఎక్ఛేంజిల్లో ట్రేడింగ్!




**ముంబయి,జనవరి 31:** కేంద్ర ప్రభుత్వం 2026-27 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో భారత స్టాక్ ఎక్స్ఛేంజీలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఆదివారం అయినప్పటికీ స్టాక్ మార్కెట్లలో పూర్తిస్థాయి ట్రేడింగ్ నిర్వహించనున్నట్లు ప్రకటించాయి. దీంతో ఇన్వెస్టర్లు బడ్జెట్ ప్రకటనలకు అనుగుణంగా తమ వ్యూహాలను మార్చుకునేందుకు వీలు కలుగుతుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రేపు ఉదయం 11 గంటలకు లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్లు యథావిధిగా ఉదయం 9:15 గంటల నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు పనిచేస్తాయని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) ఒక సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. నిర్మలా సీతారామన్‌కు ఇది వరుసగా తొమ్మిదో బడ్జెట్ కావడం విశేషం. ఎన్డీయే కూటమి వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చాక ప్రవేశపెడుతున్న రెండో పూర్తిస్థాయి బడ్జెట్ ఇది. ఫిబ్రవరి 1న సెటిల్‌మెంట్ హాలిడే కావడంతో ట్రేడింగ్‌పై కొన్ని నిబంధనలు వర్తిస్తాయి. జనవరి 30న కొనుగోలు చేసిన షేర్లను బడ్జెట్ రోజున (ఫిబ్రవరి 1) అమ్మడానికి వీలుండదు. అలాగే బడ్జెట్ రోజున కొన్న స్టాక్స్‌ను మరుసటి రోజు విక్రయించడం సాధ్యం కాదు. ప్రభుత్వ రుణ ప్రణాళిక, ద్రవ్య లోటు లక్ష్యాలపై ఇన్వెస్టర్లు ప్రధానంగా దృష్టి సారించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటు జీడీపీలో 4.1శాతం నుంచి 4.2శాతం మధ్య ఉండొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాగా, ఆర్థిక సర్వే 2025-26ను ఇప్పటికే ఈ నెల 29న పార్లమెంటులో ప్రవేశపెట్టారు.

## 195 లక్షల టన్నులకు పెరిగిన చక్కెర ఉత్పత్తి



**ముంబయి,జనవరి 31:** చక్కెర ఉత్పత్తి దేశంలో ఒక్క జనవరినెలలోనే 195.03 లక్షల టన్నులకు పెరిగింది. గత సీజన్‌లో ఇదే కాలంలో 164.79 లక్షల టన్నులకు చేరిన ఉత్పత్తి ఈ ఏడాది గణనీయంగాపెరిగిందని భారత చక్కెర ఉత్పత్తిదారుల సంఘం వెల్లడించింది. వార్షిక ప్రాతిపదికన ఉత్పత్తిలో 18.4 శాతం పెరుగుదలను నమోదుచేసింది. ఇస్మా వివరాల ప్రకారం, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 515 చక్కెర ఫ్యాక్టరీలు పనిచేస్తున్నాయి. గత సంవత్సరం ఇదే సమయంలో పనిచేస్తున్న 501 మిల్లుల కంటే కొంచెం ఎక్కువ. చక్కెర క్రషింగ్ సీజన్ సాధారణంగా అక్టోబర్‌లో ప్రారంభమవుతుంది. డేటా ప్రకారం, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటక దేశంలోనే అత్యధికంగా చక్కెర ఉత్పత్తి చేసే రాష్ట్రాలు. ఈ మూడు రాష్ట్రాలలో ఈ సంవత్సరం ఉత్పత్తి పెరిగింది. మహారాష్ట్రలో చక్కెర ఉత్పత్తి 7.872 మిలియన్ టన్నులకు చేరుకుంది, గత సీజన్ ఇదే కాలంతో పోలిస్తే ఇది దాదాపు 42 శాతం ఎక్కువ. రాష్ట్రంలో ప్రస్తుతం 206 ఆపరేషనల్ మిల్లులు ఉన్నాయి, గత సంవత్సరం ఇదే కాలంలో 190 ఉన్నాయి. రెండవ స్థానంలో ఉన్న ఉత్తరప్రదేశ్ జనవరి చివరి నాటికి 5.51 మిలియన్ టన్నుల చక్కెరను ఉత్పత్తి చేసింది. ఇది గత సంవత్సరం కంటే దాదాపు 2.5 మిలియన్ టన్నులు (సుమారు 5 ) ఎక్కువ, దీనికి స్థిరమైన క్రషింగ్ మద్దతు ఉంది. కర్ణాటకలో క్రషింగ్ కూడా మెరుగుపడింది, గత సీజన్‌తో పోలిస్తే ఉత్పత్తి దాదాపు 15 పెరిగింది. కేంద్ర వ్యవసాయ మంత్రిగా శరద్‌పవార్ కొనసాగిన తరుణంలో ఆయన ప్రత్యేకించి ఆర్థికశాఖ, ప్రధానులతో చర్చించి చక్కెర మిల్లులకు ఎగుమతులపై ఆంక్షలు సడలింపులు, ఇథనాల తయారీ వంటి వాటిపై పలు ప్రయోజనాలకోసం కృషిచేసేవారు. ఇపుడు చక్కెర మిగులునిల్వలు క్లియర్‌చేసుకోవాలని ఉత్పత్తిదారులకు ఎగుమతి ఆర్డర్లు ఒక్కటే కీలకం.




# ఎల్టీసిజి, ఎస్టీసిజిలను పునఃసమీక్షించాలి!

## ఆర్థిక మంత్రికి ఇన్వెస్టర్ల సూచనలు

**న్యూఢిల్లీ,జనవరి 31:** కేంద్ర బడ్జెట్‌లోమూడు కీలక ప్రకటనలుచేస్తే స్టాక్ మార్కెట్లు దూసుకుపోతాయని మార్కెట్‌నిపుణులు సూచిస్తున్నారు. ఈ అంశాలకు జెరోధా సీఈవో నితిన్ కామత్ కూడా మద్దతుతెలిపారు. షేర్లపై దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్టీసిజి) పన్నులో ఏడాదికి రూ.1.25 లక్షల వరకు మినహాయింపు ఆ మొత్తాన్ని మించిన లాభాలపై 12.5 శాతం పన్ను అమలులో ఉంది. అయితే ఈ పన్ను మినహాయింపు పరిమితిని రూ.5 లక్షలకు పెంచాలని ఇన్వెస్టర్లుకోరుతున్నారు. స్వల్పకాలిక మూలధన లాభాల (ఎస్టీసీజీ)పై ప్రస్తుతం 20 శాతం పన్ను ను 10 శాతాకి తగ్గించాలని సూచిస్తున్నారు. రూ.1.5 లక్షల వరకు లాభాలపై పన్ను మినహాయింపు ఇవ్వాలన్న డిమాండ్ వస్తోంది. డిమాండ్‌గా షేర్ల కొనుగోలు, అమ్మకాలపై విధించే సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ ఎస్టీటీని పూర్తిగా రద్దు చేయాలని లేదా మరింతగా తగ్గించాలని కోరుతున్నారు. ఈక్విటీ డెలివరీపై 0.1 శాతం డెరివేటివ్స్‌పై.01 శాతం, ఇంట్రాడే ట్రేడింగ్‌పై 0.025 శాతం ఎస్టీటీవసూలు చేస్తున్నారు. ట్రేడింగ్‌పరిమాణం భారీగా ఉన్నవారికి పెనుభారం అవుతోందని నిపుణులు చెబుతున్నారు. బడ్జెట్ 2026కు ముందు జెరోధా సీఈవో నితిన్ కామత్ ఎస్టీటీపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్టీసీజి పన్ను లేని సమయంలో ఎస్టీటీని అమలు చేశారు. ఇప్పుడు ఎల్టీసీజీ పన్ను తిరిగి వచ్చిన తర్వాత కూడా ఎస్టీటీని కొనసాగించడం వల్ల పెట్టుబడిదారులపై ద్వంద్వ పన్నుల భారం పడుతోందని ఆయన వ్యాఖ్యానించారు. మూడు డిమాండ్లలో కనీసం కొన్నింటినైనా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటిస్తే, స్టాక్ మార్కెట్‌లో భారీ ర్యాలీ కనిపించే అవకాశం ఉందని రిటైల్ ఇన్వెస్టర్లకు ఇది భారీ ఊరటనిస్తుందని భావిస్తున్నారు.

## ఈక్విటీలపై రాబడికి ఐటిచట్టం

# సెక్షన్ 87-ఎ వర్తించదు!

### డెల్లాయిట్ ఇడి దీపికా మాథుర్



**న్యూఢిల్లీ,జనవరి 31:** వేతన జీవులకు పన్ను భారం తగ్గించే ఉద్దేశంతో ఆదాయ పరిమితిని కేంద్రం రూ.12 లక్షలకు పెంచిన విషయం తెలిసిందే. అయితే, ఓ ప్రత్యేక సందర్భంలో మాత్రం ఈ పరిమితికన్న ఆదాయం తక్కువ ఉన్నప్పటికీ పన్ను చెల్లించాల్సి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. సాధారణ ఉద్యోగి ఏడాదికి రూ.12.75 లక్షలు సంపాదిస్తేప్రామాణిక తగ్గింపు రూ.75 వేలు మినహాయింపు తర్వాత రూ.12 లక్షలపై పన్ను రూ.60 వేలు. ఆదాయ పన్ను సెక్షన్ 87ఏ ప్రకారం ఈ మొత్తానికీ మినహాయింపు వర్తిస్తుంది. దీంతో సదరు ఉద్యోగిపై ఎలాంటి పన్ను భారం పడదని డెలాయిట్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపికా మాథూర్ తెలిపారు. ఈక్విటీలపై రాబడికి ఈ 87ఏ సెక్షన్ వర్తించదని మాథుర్ వివరించారు. దీర్ఘకాలిక పెట్టుబడుల ద్వారా ఏడాదికి రూ.1.25 లక్షలు ఆర్జిస్తే ఆ మొత్తంపై 12.5 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఉద్యోగి మొత్తం ఆదాయం రూ.12 లక్షల లోపు ఉన్నప్పటికీ అందులో ఈక్విటీల ద్వారా పొందిన ఆదాయం రూ.1.25 లక్షల కంటే ఎక్కువైతే పన్ను భారం తప్పదని చెప్పారు. ఓ ఉద్యోగి మొత్తం ఆదాయం రూ.11 లక్షలు (జీతం రూ.9.75 లక్షలు, ఈక్విటీ రూ.1.25 లక్షలు) ఈక్విటీల ద్వారా వచ్చిన ఆదాయం పరిమితికి లోబడి ఉండడం వల్ల ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదన్నారు. ఉద్యోగి ఆదాయం రూ.11 లక్షలు (జీతం రూ.8 లక్షలు, ఈక్విటీ రూ.3 లక్షలు) అయితే మాత్రం ఈక్విటీలో రూ.1.25 లక్షలు పోగా మిగిలిన రూ.1.75 లక్షలపై రూ.12.5 శాతం పన్ను చెల్లించాల్సి వస్తుందన్నారు. ఈక్విటీల ద్వారా పొందిన ఆదాయం పరిమితి (రూ.1.25 లక్షలు) కి మించడమే దీనికి కారణమని మాథూర్ వివరించారు. ఈక్విటీలపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను రేట్లు రెండు పన్ను విధానాల్లోనూ ఒకేలా ఉన్నాయి. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీకి రిబేట్ వర్తిస్తుంది, ఈక్విటీ లాభాలకు వర్తించదు. అయినప్పటికీ, రూ.1.25 లక్షలు దాటిన లాభాలపై మాత్రమే 12.5 శాతం ప్రత్యేక రేటుతో పన్ను విధిస్తున్నందున, ఈక్విటీలపై కఠినంగా పన్ను వేస్తున్నారని చెప్పడం సరికాదని మాథుర్ వెల్లడించారు.

## ఆర్బీఐ విదేశీ కరెన్సీ ఖజానా కళకళ



**ముంబయి,జనవరి 31:** భారతదేశ విదేశీ మారక నిల్వలు జీవితకాల గరిష్టాలకు పెరిగాయి. జనవరి 23తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వలు 8.053 బిలియన్ డాలర్లు, పెరిగి రికార్డు స్థాయిలో 709.413బిలియన్‌డాలర్లకు చేరాయి. ఆర్బీఐ ఖజానాలో బంగారం, విదేశీ కరెన్సీ నిల్వలు పెరగడంతో ఈ వృద్ధి కనిపించింది. ప్రత్యేకించి గత కొన్ని వారాల వ్యవధిలోనే భారత ఖజానాలోని విదేశీ కరెన్సీ నిల్వలు (డాలర్, యూరో, పౌండ్, యెన్, రూబుల్ వంటివి) భారీగా పెరిగాయని ఆర్‌బీఐ నివేదికలో ప్రస్తావించింది. జనవరి 23తో ముగిసిన వారంలో విదేశీ కరెన్సీ నిల్వలు 2.367 బిలియన్ డాలరు మేర 562.885 బిలియన్ డాలర్లకు చేరాయి. ముందు వారంతో పోలిస్తే, జనవరి 23తో ముగిసిన వారంలో భారత ఖజానాలోని బంగారం నిల్వలు సైతం 5.635 బిలియన్ డాలర్లు మేర పెరిగి 123.088 బిలియన్ డాలర్లకు చేరాయి. భారతదేశ విదేశీ మారక నిల్వలు చివరిసారిగా 2024 సెప్టెంబరులో 704.89 బిలియన్ డాలర్ల గరిష్ట స్థాయికి చేరాయి. 16 నెలల తర్వాత మళ్లీ ఈ వారంలోనే భారత ఫారెక్స్ నిల్వలు రూ.65 లక్షల కోట్ల స్థాయిని చేరాయి. 2022లో భారత్ విదేశీ మారక నిల్వలు ఏకంగా 71 బిలియన్ డాలర్లు తగ్గిపోయాయి. కానీ 2023 నుంచి తీరుమారింది. భారత్ విదేశీ మారక నిల్వలు 2023లో 58 బిలియన్ డాలర్లు, 2024లో 20 బిలియన్ డాలర్లు, 2025లో 56 బిలియన్ డాలర్లు చొప్పున పెరిగాయి. 11 నెలల పాటు విదేశీ వాణిజ్యం చేసేందుకు సరిపడా విదేశీ కరెన్సీ నిల్వలు భారత్ వద్ద సిద్ధంగా ఉన్నాయని ఆర్‌బీఐ వెల్లడించింది. విదేశీ వాణిజ్యం, అంతర్జాతీయ లావాదేవీలు, విదేశీ పెట్టుబడులు, రుణాలు, విదేశీ మారక నిల్వల విషయంలో భారత్ బలంగా ఉందని స్పష్టం చేసింది. విదేశాల కరెన్సీ నిల్వలను ఆర్థిక పరిభాషలో ఫారిన్ కరెన్సీ అసెట్స్ (ఎఫ్‌సీఏ) అంటారు. విదేశీ మారక నిల్వల్లో సింహభాగం విదేశాల కరెన్సీ నిల్వలు బంగారం నిల్వలు ఉంటాయి. మూడో స్థానంలో స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్) ఉంటాయి. 2026 జనవరి 23 నాటికి భారతదేశం చేతిలో 18.737 బిలియన్ డాలర్లు విలువైన ఎస్‌డీఆర్‌లు ఉన్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.